
ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
4 అణాలు
26-12-'56



సినిమా తారలకు సౌందర్యమునిచ్చు సబ్బు

ఇంక 'మొహన్నద్' కొరత కాదు



అలెగ్జాండరు క్రి. పూ. 331 లో పర్షియాపై దండెత్తి నపుడు, ఖడ్గములు తదితర ఆయుధములు హిందూ దేశమునుండి తెప్పించుకొనెనని ఫిర్దౌసి వ్రాసిన "షహ నామా" అను పద్యకావ్యము వలన తెలియుచున్నది. నాగరిక ప్రపంచ మందంతయునూ, హిందూదేశము నాణ్యమైన ఉక్కుకు పుట్టినిల్లని ఖ్యాతిగాంచి యుండెను. అసలు, ఖడ్గమునకు అరబ్బుల 'ముహన్నద్' యను పురాతన పదము "హిందీనుండి" అను యర్థము నిచ్చును

మరల నేడు వేరొక సందర్భమున జాతీయ చింతనయందు ఉక్కు ప్రప్రథమమునకు వచ్చుచున్నది. యుద్ధావసరములకు కాక, శాంతి కొరకు దేశాభివృద్ధికొరకు దేశము నందలి ఉక్కును చేయు శక్తి త్వరితముగా హెచ్చింపబడుచున్నది.

టాటా స్టీల్

జాతిని సేవించుచున్నది

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 17
26-12-56

దుర్ముఖ మార్గశిర బహుళ దశమి బుధవారం

విషయానుక్రమణిక

ముఖచిత్రం: "మురళీకృష్ణుని మోహన భంగిమ"

[కాచఫలకంపై చిత్రింపబడిన ప్రాచీన చిత్రం]

శ్రీరామ రక్ష

“దేశమంతా అభివృద్ధి చెందుతున్నది; ఆంధ్రరాష్ట్రం కూడా సర్వతోముఖంగా అభివృద్ధి చెందాలి. ఆంధ్ర ప్రభుత్వం వెంటనే ఒక నాటక కళా కేంద్రాన్ని స్థాపించాలి” అని కేంద్ర సంక్షేమ సంఘ అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ ఈ నెల 12 న విశాఖపట్టణంలో ఒక నృత్య నికేతనానికి ప్రారంభోత్సవం జరుపుతూ సలహా ఇచ్చారు. సలహాలకెప్పుడూ కొరతలేనిమాట నిజమే అయినప్పటికీ, ఇదేమీ కొత్త సలహా కాదు. అనైక్యతలో ఆంధ్రులకు పెట్టింది పేరు; సాధించవలసినవిషయం చిన్నదైనా, పెద్దదైనా, తలలు కూడక ఏపనీ సాధించలేకపోవడం జరుగుతున్నది. కలసికట్టుగా వ్యవహరించి కార్యం సానుకూలం చేసుకునే నేర్పరితనం మనకు లేదేమో ననిపిస్తుంది. సంగీతం, నృత్యం, శిల్పం మొదలైన లలితకళలలో ఒకప్పుడు ప్రపంచ ప్రఖ్యాతి సాధించిన జాతి ఆంధ్రులదని గొప్ప చెప్పుకోవడమే గాని, ఆదరాభిమానాలు లేక ఇప్పుడు ఆకళలు ఎంత దౌర్భాగ్య స్థితికి వచ్చినవో ఆలోచించే ఓపిక లేదు. అందుచేతే, మన లలితకళలు నానాటికీ అడుగంటి పోతున్నవి. ఇందుకు కూచిపూడివారి నాట్యకళే ఒక నిదర్శనం. ఇదేవిధంగా ఉపేక్షిస్తే, ఈ నాట్యకళ అచిర కాలంలోనే పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం కూడా వున్నది. స్వరాష్ట్రాన్ని సాధించిన తర్వాత కూడా కూచిపూడి నాట్యకళ పునరుద్ధరణకు రాష్ట్ర పాలకులు ఏమీ చేయలేక పోయినారు. కేంద్ర లలితకళా సంస్థ ఇచ్చిన పదివేల రూపాయల విరాళాన్ని కూడా సద్వినియోగం చేయలేక, ధారాగతం చేశాము; ఇది శోచనీయం.

నాటక కళాకేంద్రం అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే గుర్తించిందనీ, అయితే ఆర్థికమైన ఇబ్బందులవల్ల దాని స్థాపన సాధ్యపడలేదనీ, ఇకమీద ఆలస్యం జరగదనీ రాష్ట్ర విద్యామంత్రి శ్రీ పట్టాభిరామారావు అంటున్నారు. మనకు కావలసింది కేవలం ఒక నాటక కళాకేంద్రం మాత్రమే కాదు. సర్వ సమగ్రమైన ఆంధ్ర లలితకళాపరిషత్తు ఒకటి ఏర్పడాలి. దాని శాఖలుగా సంగీత నృత్యాది సమస్త లలిత కళలు వర్ధిల్లాలి. మద్రాసు నగరానికి వచ్చే ఏ కొత్త యాత్రికుడూ అడయారులోని 'కళాక్షేత్రం' ఒకసారి దర్శించకుండా వెళ్ళడు. మనం ఏర్పాటు చేసుకునే ఆంధ్ర కళాపరిషత్తు కూడా అడయారు కేంద్రంతో సమదీటు అయిన ఆదర్శ కేంద్రంగా విలసిల్లేట్లు చూడాలి. ఇందుకు ప్రభుత్వ సహాయం, ప్రజల ఆదరణ, కళావేత్తల పరస్పర సహకారం లభ్యం కావాలి.

* * *

హాలీ సిక్కా కరెన్సీని, నాణాలను భారత ప్రభుత్వ నాణాలలోకి మార్చుకోడానికి ఇచ్చిన గడువు ఈ నెలాఖరుతో పూర్తి అవుతున్నది. ఆ తేదీ తర్వాత ప్రభుత్వ ఖజానాలు గాని, స్టేట్ బ్యాంకు గాని ఆ నాణాలను తీసుకోవు. మార్చుకోడానికి అవకాశమే వుండదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థికశాఖ ప్రకటించింది. నవాబు పాలనకు స్వస్తి చెప్పిన మనం ఆ పాలనకు చిహ్నంగా మిగిలివున్న వారి నాణాలను కూడా పూర్తిగా స్వస్తి చెప్పడం ఎంతైనా సమంజసమైన విషయం. మాజీ నిజాం పాలనకు స్మృతి చిహ్నంగా ఈ హాలీసిక్కా నాణాలలో



ప్రధాని నెహ్రూ

ప్రపంచసమస్యలపై అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్‌లో చర్చలుజరుపుతున్నారు.

★ శ్రీరామరక్ష ★

ఒక్కొక రకానికీ ఒక్కొకటి చొప్పున రాష్ట్ర రాజధాని మ్యూజియంలోగాని, అలీపూరు టంకశాల (కలకత్తా) మొదలైన స్థలాలలోగాని భద్రపరిచి యాత్రికులకు ప్రదర్శించవచ్చు.

* * *

రాష్ట్ర ఆర్థికమంత్రి శ్రీ కళా వెంకటరావు ఈ నెల రెండవవారంలో ఆలమూరులో ప్రసంగిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక క్లిష్టపరిస్థితుల సర్దుబాటుకు ఒక కొత్త ప్రతిపాదనచేశారు. రాష్ట్రంలో వున్న ప్రజలందరూ ప్రభుత్వానికి సాలుకు తలా ఒక రూపాయి అప్పుగా ఇస్తే, ఆ విధంగా లభించే మూడుకోట్ల ఇరవై లక్షల రూపాయలతో అనేక అభివృద్ధి ప్రణాళికలను అమలు జరపడానికి వీలవుతుందన్నదే ఈ ప్రతిపాదన. మనస్సులో ఎంతో. సోదిలోనూ అంతే అంటారు పెద్దలు. ఇకమీద ప్రభుత్వానికి ప్రజలవద్ద ఏ అప్పుకావలసివచ్చినా ఈ పదతి మినహా గత్యంతరం లేదేమో ననిపిస్తున్నది.

ఎందుచేతనంటే. దాదాపు ఆరువేలకోట్ల రూపాయల వ్యయంతో కూడిన బృహత్పథకాన్ని భారతప్రభుత్వం ద్వితీయ ప్రణాళికలో తలపెట్టింది; ఆరు నూరైనా, నూరు ఆరైనా ప్రణాళికను అనుకున్న ప్రకారం అమలు జరిపి తీరవలసిందేనని పట్టుదల చూపుతున్నది. ఆర్థికంగా దేశ శక్తిసామర్థ్యాలు ఏపాటివనే ఆలోచనకే స్థానం ఇవ్వడంలేదు. ఫలితం ప్రజలమీద, వ్యాపారస్థులమీద పన్నుల భారాన్ని ఎక్కువ చేయడమే. శ్రీ చింతామణి దేశముఖ్ స్థానే కేంద్ర ఆర్థిక శాఖపై ఆధ్వర్యం వహిస్తున్న శ్రీ కృష్ణమాచారి దిగుమతి సుంకాలను పెంచారు; ఎప్పుడో ఏడేళ్ళ క్రితమే విరమించిన పెట్టుబడి లాభాల పన్నును పునరుద్ధరించారు; భవనాలు మొదలైన స్థిరాస్తి క్రయ విక్రయాలమీద పన్ను హెచ్చించారు; కంపెనీ డివిడెండ్ల మీద పన్నులు కూడా అర్థాంతరంగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వేశారు. ఏమిటీ ఇంత దారుణంగా కొత్త పన్నులు విధించడమంటే, ద్వితీయ ప్రణాళిక అమలు జరగాలని ఆర్థికమంత్రి బదులు చెప్పారు. అట్టే మాట్లాడితే, ఇంకా పెంచవలసి వస్తుందంటున్నారు. ఇంతాచేస్తే ఈ కొత్త పన్నులన్నిటిద్వారా సాలుకు వచ్చే రాబడి 16 కోట్లకు మించదని తేలుతున్నది. మొత్తం మీద దేశ ఆర్థికపరిస్థితిని "అలవిమాలినపథకం; శక్తికి మించిన పన్నులు" అని ఒక్క ముక్కలో వర్ణించవచ్చు. మంచికో చెడ్డకో మిశ్రమ ఆర్థిక వ్యవస్థను పాటించవలచిన ప్రభుత్వం బుదిపూర్వకంగా సొంతవ్యాపార వ్యవస్థపై ఈ పన్నుల ద్వారా దెబ్బతీయడానికే ప్రయత్నిస్తున్నదని చెప్పవలసి వస్తున్నది ఈస్థితిలో ఇకమీద ప్రైవేట్ పెట్టుబడి వ్యవస్థ విస్తరించే అవకాశమే వుండదేమో ననిపిస్తున్నది; ప్రభుత్వం సేకరించే కొత్తఋణాలకు ధనం లభ్యమవుతుందో కాదో కూడా చెప్పలేము. ఆంధ్ర ఆర్థికమంత్రి చెప్పినట్లు, "తలకొక రూపాయి అప్పు" పద్ధతే శరణ్యమవుతుందేమొ!

* * *

"ప్రజలు వేరు ప్రభుత్వం వేరు" అన్నది పాతమాట అన్నారు, రాష్ట్ర మద్యనిషేధ,రహదారుల శాఖమంత్రి శ్రీమండుముల నరసింగరావు గారు, ఈ మధ్య కడపజిల్లాలో ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు మొదలైన ప్రాంతాలలో పర్యటిస్తూ. వీరు పాత ఆంధ్రజిల్లాలలో పర్యటించడం ఇదే మొదటి సారి. కడపజిల్లా ప్రజలు ఘనమైన స్వాగతం ఇచ్చి వీరిని సన్మానించారు. "మీ సమస్యలు నాకు తెలియవు. వాటిని తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నాను. ఈ ప్రాంతానికి నేను కొత్త," అన్నారు. తెలియని విషయాలు తెలియవని చెప్పడంలో నామర్దా ఏమీ లేదు.

మద్యనిషేధశాఖను నిర్వహించడంలో తమ విచిత్రానుభవాన్ని కూడా శ్రీ నరసింగరావుగారు ఇలా వ్యక్తంచేశారు:

"మద్యనిషేధం అన్నది విచిత్రమైన శాఖగా తయారైంది. ఆంధ్రప్రాంతంలో మద్యనిషేధాన్ని అమలు పరచడం, తెలంగాణాప్రాంతంలో అదనపు రాబడికోసం సారాదుకాణాలను వేలంవేయడం ఈ రెండు కార్యక్రమాలు నా పాలిటే పడినవి. పరస్పర విరుద్ధమైన ఈ రెండు బాధ్యతలను ఎలా చూసుకోవాలో, నాకే సరిగా బోధపడకుండా వున్నది."

ఇది నిజంగా సందిగ్ధపరిస్థితే. ఒకజిల్లాకు వెళ్లి పానశాలలను ప్రోత్సహించడం, మరొక జిల్లాకువెళ్లి మద్యనిషేధం అమలు జయప్రదంకావాలని ప్రబోధించడం చిక్కుతో కూడినపనే. ఒక్క మద్యనిషేధ శాఖామాత్యుడికేగాక, మంత్రిమండలిలోని మిగతా వారికికూడా ఈవిధంగా "రెండు నాల్కలతో" వ్యవహరించడం చిక్కుతోకూడినపనే. దీనికి విరుగుడు కొంపలుకూల్చే "పాపపు డబ్బు" కోసం ఆశించకుండా, తెలంగాణా జిల్లాలలో కూడా సాధ్యమైనంత త్వరలో మద్యనిషేధం అమలుజరపడం ఒక్కటే మార్గం.


18-12-56 —భార్గవ]



విల్లివాకం ఆంధ్రసంఘం పంచమ వార్షికోత్సవసందర్భంలో డిసెంబరు 2వ సినిమాదర్శకుడు శ్రీబి ఎన్. రెడ్డి సమక్షాన 'జేబుదొంగలు' అనే నాటికను సభ్యులు ప్రదర్శించారు. జేబుదొంగగా శ్రీఏ.కృష్ణారావు, కుంటితాతగా శ్రీ రామకృష్ణ చక్కగా నటించారు. నాటిక రచయితలు: పచ్చారు; కే. శి. బాబు.

గమనిక

గత వారం ఆంధ్ర వారపత్రికలో ప్రచురింపబడిన "తాసిల్దారు" కథ శ్రీ వినాయకరావు విద్యాలంకార్ రచించిన హిందీ కథకు అనువాదమని పాఠకులు గ్రహింప ప్రార్థన.




బుడుగు! చిచ్చుల పిడుగు

ఎప్పుడూ అంటే అసలు ఎప్పుడూ నిజం చెప్పకూడదని కాదు. అస్తమానం ఎప్పుడూ అని అర్థం అన్నమాట.

ఇప్పుడు. నేనున్నానా. బాబాయి ఉన్నాడా... బాబాయీ నేనూ ఎప్పుడేనా అలా షైరు వెళ్తామా. అక్కడ ఇంకొందరు అప్పలు కుర్రాళ్లు ఉంటారా. అప్పుడు, రెండుజడల అమ్మాయో, ఒక్క జెడల అమ్మాయో రోడ్డు మీంచి నడిచి వెళ్ళిపోతోందిగదా

అప్పుడు ఈ బాబాయీ, వాడి ఫ్రెండ్లూ ఈల వెయ్యాలిగదా. వాళ్లకి పాపం రాదుగదా. అప్పుడు నన్ను ఈలవేసి పెట్టమంటారు.




నేను ఖయ్‌మని ఈల వేస్తా. నాకు బాగా వచ్చు. రౌడీల దగ్గర నేర్చుకున్నానులే. రౌడీలు బీడీలు కాలుస్తారు. నేను కాల్చననుకో. అయినా నా దగ్గిర కొన్ని వున్నాయి. జటకా బండి తోలినప్పుడు చెవిలో పెట్టుకోవాలిగా అందుకు.


బీడీలు ఇంకోందుకు కూడా మంచివి. అమ్మ లేనపుడు బామ్మ దగ్గిరికి వెళ్ళి మీద పడేస్తానంటే, కాణీ ఇచ్చేస్తుంది. అందుకు.

యేం. అప్పుడు నేను యీలవేస్తే బాబాయి వాడి ఫ్రెండ్లూ కలిసి, ఓ కాణీయో పదణాలో ఇచ్చేస్తారు నాకు. ఇపుడు నేను ఆ కాణీయో పదణాలో పట్టుకుని ఇంటికి వస్తానా. అమ్మ నా జేబులు తమిడి ఎక్కడివిరా బుడుగూ కాణీయో పదణాలో అంటుంది. తమిడి అంటే జేబులు వెతికి కాణీలు లాక్కోడం. అప్పుడు నేను ఆ కాణీ ఎక్కడిదో చెప్పాననుకో కొట్టేస్తుంది. ఇంకెప్పుడూ అలాంటి పని చెయ్యకేం జులాయి వెధవా అంటుంది. అందుకని ఇంకోసారి నిజం చెప్పకూడదు. ఎప్పుడేనా సరే ఓసారి మొట్టికాయ తింటే, రెండోసారి నిజం చెప్పకూడదు.

అయినా యీ పెద్దాళ్లకి అన్ని గొడవలూ కావాలి. నేను మొగాడ్ని గదా. వీధిలోకి వెళ్ళి కాణీ సంపాదించుకు వస్తే ఎక్కడిదీ అని ఎందుకు అడగడం. ఎందుకు మన







బుడుగు! చిచ్చుల పిడుగు!

“పనీపాటూ లేకుండా రోడ్డు వెంట తిరిగే సోమరులకు నేను దమ్మిడీ కూడా ఇవ్వను.”

“బావుంది. తిరగడం కూడా మానేసి ఆఫీసు పెట్టుక్కూర్చుంటే పట్టుకొచ్చి ఇస్తారా?”

సీత అనవసరంగా నిజం చెప్పడం! మళ్ళీ కొట్టడంను? అందికే నాకు కోపం. అన్ని గొడవలూ వీళ్ల కెందుకని.

ఆఖరికి బాబాయి సీతకి లొట్టెట్టు రాసినా వీళ్లకే కావాలి. లొట్టెట్టు అంటే నాకు తెలీదు ఇవి బాబాయి దగ్గర ఉంటాయి. బోల్డు ఉంటాయి. రాసి మళ్ళీ చింపేస్తాడు. మళ్లీ రాస్తాడు.

ఏం. ఓసారి బాబాయి ఈ లెట్రు (చూట్టానికి అచ్చు ఉత్తరంలా ఉంటుందిలే) నా చేతికిచ్చి, సీత చేతికిచ్చి రమ్మన్నాడు. నేను వెళ్లేసరికి సావిట్లో సీత నాన్న కూర్చున్నాడు. వాడికెందుకు చెప్పు అన్ని గొడవలూను.

ఎవరికిరా ఆ ఉత్తరం అన్నాడు.

ఎవరికో నీ కెందుకురా అన్నాను నేను.

భడవా ఇలారా అనేసి వాడు నన్ను గభుకుని పట్టేసుక్కున్నాడు. చేతులో ఉత్తరం లాక్కు చూశాడు. చూసి హుఁ అన్నాడు.

హేం పొగరు. రాస్కెల్. నా కూతురికి ఉత్తరం రాస్తాడా? చెప్తా ఉండు. అన్నాడు వాడు.

లేకపోతే నీకు రాస్తాడా అన్నాను నేను.

అసలు బాబాయి ముందరే చెప్పాడు వాళ్ల నాన్నకి చచ్చినా ఇవ్వద్దని మరి వీడు లాక్కున్నాడు గదా. ఎలా? వీడు, మా నాన్న అందరూ కలిసి బాబాయికి ప్రవేటు చెప్పేస్తారని నాకు అవమానం వేసింది జాలి కూడా వేసింది. వీళ్లమీద కాదు. బాబాయి మీద.

వేశాక, అప్పుడు ఒకలా అనుకున్నా. బాబాయిని రక్షించాలని.


నేను ఇలా అందర్నీ బోల్డుసార్లు రక్షిస్తాను. రక్షించడం అంటే కాపాడ్డం. అంటే నాకు తెలీదు.

ఏం. సీత నాన్న ఆ ఉత్తరం పట్టుకుని ధాం ధూం అంటున్నాడు కదూ. అది లాక్కు పారిపోవా లనుకున్నా. కాని అందదే. వాడు చాలా ఎత్తుగదా.

ఓసారి నన్నెత్తుకోవూ అని అడిగాను.

ఛప్ నోర్ముయ్యి. నిన్నూ మీ బాబాయినీ కూడా చితకొట్టేస్తాను అన్నాడు. అప్పుడు నేను కొంచెం దూరముగా నిల్చున్నాను.

బాబాయిని రక్షించడం ఇంకెలా......



అప్పుడు ఇంకో ఉపాయం వచ్చింది. ఉపాయం అంటే అబద్ధం.

"ఒరేయ్ సీత నాన్నా! మరేం, ఆ ఉత్తరం బాబాయి కాదూ. నేనే రాశా ఓచ్చి" అనేసి పరిగెరు కెళ్ళిపోయా.

అయినా లాభం లేదనుకో. వాడు మా యింటి కొచ్చేశాడు. అప్పుడు బాబాయి వంటింట్లో దాంగున్నాడు. నాన్నా వాళ్లూ సీత నాన్నతో మాట్లాడారు. తరవాత సీతకీ బాబాయికీ పెళ్ళి చేసేద్దాం అన్నారు. చివరికి నన్ను కొట్టారనుకో.


నేను ఇంకోసారి ఇలాగే నాన్నని రక్షించాను. నాన్న ఆ వేళ అద్దం కిందపడేసి బద్దల కొట్టేశాడు. అమ్మ చూస్తే కోప్పడేస్తుందని భయపడుతున్నాడు.


అప్పుడు నేను అమ్మదగ్గిరికెళ్ళి అదం నేనే బద్దలుకొట్టానని అబద్ధం చెప్పేశాను. యలాగా నన్ను అల్లరివెధవా అంటారుగదా ఇది కూడా నేనే చేశానంటే నష్టం యేమిటి.

అప్పుడు నాన్నేమో, అమ్మ చూడకుండా నన్ను ముద్దు పెట్టుకుని అర్ధణా కాణీ ఇచ్చేశాడు. మాకావా అబద్ధం చెప్తే ఎంతలాభమో.

అమ్మ కూడా నవ్వేసి ముద్దు పెట్టుకుంది. మళ్ళీ పెంకిఘడవా అంది.

యెంగుకో నరి నేను మేలుకుని ఉన్నపుడు ఇలాగే తిట్టారు అందరూ నిద్రపోతున్నపుడు నేను యెంతో ముద్దొస్తానటమరీ యెంచాతో!





"ఏది ముఖ్యం? ఏద ముఖ్యం?"

చిల్లరపద్దులకు కోట్లలుగా ఖర్చు

"భావిభారతభాగ్యోన్నతి ద్వితీయ పంచవర్ష ప్రణాళిక పైననే ఆధారపడియున్నది" అనేది సరికొత్తగా బయల్దేరిన నినాదం. భావి భారతం ఎట్లా ఉండబోయేదీ శ్రీ టి. టి. కృష్ణమాచారి వెల్లడించారు. ప్రణాళిక మొత్తం వ్యయం రూ. 6000 కోట్లదాకా పెరగబోతోంది. ప్రణాళిక సైజును ఏమాత్రం తగ్గించరాదని శ్రీ కృష్ణమాచారి ఖచ్చితంగా చెప్పేశారు. భారీఎత్తున లోటుబడ్జెట్ పద్ధతి అనుసరించడం కూడా తగదని ఆయన తేల్చివేశారు. మరెలాగయ్యా ధనం సేకరించడం? కొత్త పన్నులు వేయడం, దేశంలోనో, విదేశాలలోనో ఋణం చెయ్యడం.

కొత్తపన్నులు అంటే, ప్రజల కొనుగోలు తగ్గిపోతుందన్నమాట. పన్నులు హెచ్చించేముందు ధనసేకరణకు అన్ని మార్గాలూ అవలంబించామనీ, గత్యంతరం లేకనే అదనపు పన్నులు వేస్తున్నామనీ ప్రభుత్వం నిరూపించుకోవాలి. ప్రజాస్వామ్య లక్షణం అది. విమర్శలనుంచి తప్పించుకోవడానికీ, ప్రజాధనాన్ని వ్యర్థంగా ఖర్చుపెడుతూ ఆ ఖర్చును సమర్థించుకోవడానికీ, గంభీరంగా ధ్వనించే కొన్ని మాటల్ని—విస్తృతమవుతున్న ఆర్థిక

శ్రీ కృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

వ్యవస్థ, చైతన్యశీలమైన ఆర్థిక పరిస్థితి, ప్రతివాడికీ ఉద్యోగం—ఈబాపతు పదజాలాన్ని కల్పించారు. కోటలుదాటే ఈ మాటల్ని చేతలుగా మార్చడానికి ఇంతదాకా ఖచ్చితమైన చర్యలేమీ తీసుకోలేదు.

ఒక ఉదాహరణ చెబితే సరిపోతుంది. ఢిల్లీలోని వేరువేరు ఆఫీసులను దేశంలో నలుమూలలకూ మార్చాలని చేసిన ఆలోచన ఏమైంది? ఢిల్లీలో ఆఫీసులకు, ఉద్యోగులనివాసాలకు గాను కోట్లకొలది ధనం ఖర్చుచేస్తున్నారు. సిమెంటు, ఉక్కు కొరతగా ఉన్నా ఈ భవన నిర్మాణం సాగిపోతూనే ఉంది. మరోవంక సిమ్లా, నాగపూర్, రాజస్థాన్, తదితర ప్రదేశాలలో కోట్లరూపాయల విలువచేసే భవనాలు శిథిలమవుతున్నాయి. వీటిని కాపాడడానికి మరికొన్ని కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి. కేంద్రమంత్రులు తమ తమ దర్బారులలో కొన్ని కొన్ని భాగాలను ఇతర ప్రదేశాలలో నెలకొల్పుకొనేట్లు చేయడానికి కేంద్ర ప్రభుత్వపు కమిటీఒకటి ఎనిమిదేళ్లనుంచీ తంటాలు పడుతోంది. ప్రధానమంత్రి కలుచుకుంటేగాని దుబారా ఖర్చును అరికట్టడం సాధ్యంకాదని కేంద్రమంత్రి ఒకాయన ఇటీవల అన్నారు.

ప్లానింగ్ అంటే, ఏది ముందు, ఏది వెనక, ఏది ముఖ్యమైన అవసరం, ఏది ముఖ్యంకాని అవసరం అని ప్రణాళిక తయారుచేసుకోవడం. న్యూఢిల్లీ "క్వీన్స్ వే"లో నేషనల్ మ్యూజియం, నేషనల్ థియేటరు, నేషనల్ లైబ్రరీ స్థాపించాలని విద్యాశాఖ ఆలోచిస్తోంది. మ్యూజియముకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. భవనం తయారులో ఉంది. తరవాత వంతు నేషనల్ థియేటరుది. ఈ రెండూ ఎంతైనా వాంఛనీయమైనవే. అయితే ఇవిలేకపోతే భారతదేశం అభివృద్ధికావడం మానేస్తుందనా ద్వితీయ ప్రణాళికలో చేర్చారు? వీటికి అయ్యే ఖర్చు కొదనీ, మహా అయితే రెండుకోట్ల రూపాయలవుతుందనీ చెబుతున్నారు. మరి శ్రీ టి. టి.

కె. ఆచారి ప్రకటించిన ఒకానొక పన్ను ద్వారా ఈ ఏడాదికి ఎంత డబ్బు వస్తుందట? అదీ రెండుకోట్ల రూపాయలే. ఈ రెండుకోట్ల రూకలు వసూలు చెయ్యడం కోసం, ఇంతమంది విమర్శకు గురిఅయిన పన్ను ఎందుకు వెయ్యాలిట శ్రీ కృష్ణమాచారి? కోటి సంఖ్యనుకూర్చి అదేమంత పెద్దమొత్తం కాదన్నట్లు మాట్లాడడం మన దేశపు స్తోమతకు, ఆర్థిక విధానానికి గాంధీ సిద్ధాంతాలకు తగినపని కాదు.

ఇంకో ఉదాహరణ. భారతప్రభుత్వమూ ప్లానింగ్ సంఘమూ "బోయింగ్" విమానాలనబడే జెట్ ప్రయాణీక విమానాలను కొనాలని నిశ్చయించారు. ఇవి 1960 నాటికి లభ్యమవుతాయి వీటి ఖరీదు $11\frac{1}{2}$ కోట్ల రూకలు. 1960 నాటికి ఇప్పుడు భారత దేశంలో పనిచేస్తూఉన్న బి. ఒ. ఎ. సి., పాన్ అమెరికన్, కె. ఎల్. ఎమ్. కంపెనీలన్నీ "బోయింగ్" విమానాలంత పెద్దవాటినీ, వేగమైన వాటినీ తెచ్చుకుంటాయి. మరి యింత పెద్దవిమానాలను భరించడానికి తగినంత విమానాశ్రయాలను ఏర్పాటు చేసుకోవాలి గదా? ఢిల్లీ, కలకత్తా, బొంబాయి, ఈ మూడు అంతర్జాతీయ విమానాశ్రయాలను కొత్తఅవసరాలకు తగినట్లుగా మార్పుచెయ్యడానికి ప్లానింగ్ సంఘము ప్రణాళికలో ఏర్పాట్లేమీ చెయ్యలేదు. అసలు ప్రణాళిక ప్రకటించిన తరువాతనే "బోయింగ్" లను కొనడానికి నిర్ణయం జరిగింది.
కొనడం నిశ్చయమైన తరవాత పైమూడు విమానాశ్రయాలను మార్పుచెయ్యడం విధిగా జరగాల్సిన పని. నేషనల్ థియేటరు ముఖ్యమా, విమానాశ్రయాలను మార్పు చెయ్యడం ముఖ్యమా? ఈ ప్రశ్న ఎందుకు వచ్చిందంటే, మనదగ్గర బోలెడు బోలెడు డబ్బు లేదుగనక.

ప్లానింగ్ సంఘం మన ఆర్థిక పరిస్థితిని ఒక్క రవ్వ అతిశయోక్తులతో చిత్రించిందని తోస్తుంది. 1955-56 సం॥ పన్నుల లెక్కప్రకారం ప్రస్తుతాదాయంలోని మిగులు ధనం 350 కోట్ల రూ॥లదాకా ద్వితీయ ప్రణాళికకు పనికొస్తుందని ప్లానింగు సంఘం అభిప్రాయపడింది. అలా అభిప్రాయపడిన దరిమిలాను, దేశాభివృద్ధికి అనావశ్యకమైన తాత్కాలికావసరాలకు దాదాపు రూ. 400 కోట్ల ధనవ్యయాన్ని ఆమోదించారు. అంటే ద్వితీయ పంచవర్ష ప్రణాళిక 350 కోట్ల రూ. మిగులు ధనంతో కాదు, 50 కోట్ల రూ.ల లోటుతో ప్రారంభమైందన్నమాట.

4800 కోట్ల రూ.ల వ్యయం అంచనా

★ న్యూఢిల్లీ లేఖ ★

ఆధారం చేసుకుని ప్లానింగ్ సంఘం, ప్రజల వద్ద 1200 కోట్ల రూ॥లు ఋణం చెయ్యాలని, 450 కోట్ల రూ॥లు అదనపు పన్నుల ద్వారా వసూలు చెయ్యాలని, ఇతర బడ్జెటరీ విధానాలద్వారా 400 కోట్ల రూ॥లు, విదేశాల నుండి ఋణంగా 800 కోట్ల రూ॥లు, లోటు బడ్జెట్ ద్వారా 1200 కోట్ల రూ॥లు సేకరించాలని సంకల్పించింది. ఇందులో చాలా మటుకు ఊహాగానం ఉండడం అటుంచి, ఈ ఊహాగానంలో కూడా మరొక 400 కోట్ల రూ॥లు భర్తీచేయడం ఎలాగో చెప్పకుండా ఊరుకున్నారు. ఈలోగా చాలా కొత్త సంఘటనలు జరిగాయి. లోటు బడ్జెట్ విధానంవల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని అదృష్టవశాత్తు ప్రభుత్వం గుర్తించింది. ప్రణాళికను అమలు చెయ్యడానికి ఈలోటు పద్ధతి పనికిరాదని ఆర్థికమంత్రి నిర్ణయించారు. ఒకవేళ లోటుపద్ధతిని అవలంబించినా ప్లానింగ్ సంఘం ఊహించినంత అధికంగా ధనం సమకూడదు అయిదేళ్ళకీ మహా అయితే 600 కోట్ల రూ॥లు సమకూడవచ్చు. అంటే 400 కోట్ల రూ॥ల నుంచి 1000 కోట్ల రూ॥ల దాకా భర్తీ కాకుండా మిగిలిపోతుందన్నమాట.

ధరలు పెరగడం మరొక కొత్త పరిణామం. ధరల పెరుగుదలవల్ల ప్రణాళిక అంచనా నూటికి కనీసం పదివంతులన్నా పెరుగుతుందంటే అతిశయోక్తి కానేరదు అంటే 480 కోట్ల రూ॥లన్నమాట. దీనితో భర్తీకాని లోటు 1480 కోట్ల రూ॥ల దాకా పెరుగుతుంది. మొత్తం ప్రణాళిక అంచనా 5280 కోట్ల రూ॥లదాకా పెరుగుతుంది.

ప్లానింగ్ సంఘం తెలిసో, తెలియకో కొన్ని కొన్ని అంశాలకు తక్కువ అంచనాలు తయారుచేసింది. వీటికి డబ్బు సర్దవలసి ఉంటుంది. బూయింగ్ విమానాలకుగాని, బూయింగ్ విమానాశ్రయాలకుగాని, ప్రణాళికలో ఏర్పాటు చెయ్యలేదు. వీటికి కనీసం 20 కోట్ల రూ॥ల దాకా అవుతుంది. పెట్రోలు అన్వేషణకు, అస్సామ్ ఆయిల్ కంపెనీల పెట్టుబడిలో వాటాలకు కనీసం మరో 50 కోట్ల రూ॥లవుతుంది.

బొగ్గుఉత్పత్తి, ఉపాధ్యాయులకు సబ్సిడీ, అణుశక్తి, ఉత్పత్తి భారత జాతీయ అభివృద్ధి కార్పొరేషను క్రింది ప్రాజెక్టులకు చాలాధనం సర్దవలసిఉంటుంది. వీటన్నిటికీ 400 కోట్లనుంచి 500 కోట్ల రూ॥లదాకా పట్టవచ్చునని ఆర్థికమంత్రి ఉజ్జాయింపుగా లెక్క వేశారు. మొత్తం ఇదంతా చేరి భర్తీకాని లోటు 1900 కోట్లనుంచి 2000 కోట్ల దాకా పెరుగుతుంది. అదనపు పన్నుల ద్వారా వస్తుందనుకున్న 450 కోట్ల రూ॥లు కూడా దీనికి చేరిస్తే ఇక చెప్పనక్కర్లేదు.

1957 సం॥పు ప్రణాళిక తయారు చేస్తూ ప్లానింగ్ సంఘము ఇప్పుడు కొనసాగుతూ ఉన్న స్కీములకు తగినంత డబ్బు కేటాయించిన తరవాతనే కొత్తస్కీములకు ఏర్పాట్లు చెయ్యాలని నిశ్చయించింది. స్కీములను గూర్చి నిర్ణయాలు చేసేటప్పుడు సిమెంటు, ఉక్కు, బొగ్గు, రవాణా సదుపాయాలెంతవరకూ లభ్యమవుతాయో పరిశీలించుకుని మరీ చేయాలి. డబ్బుకొరత అలా ఉంచి, పై సదుపాయాలు కూడా కొరత కావడంచేత ముఖ్యంకాని కొన్ని కొన్ని స్కీములను విరమించక తప్పదు.

ప్రణాళిక నిర్విఘ్నంగా కొనసాగేందుకు, సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో, అన్ని వర్గాల ప్రజలమీద న్యాయమైన నిష్పత్తిలో వ్యయభారం పడే పద్ధతిలో, ప్రణాళికను కొనసాగించేందుకు - అన్నిటికీ ఆర్థిక మంత్రిదే భారం.

* * *

భూలాభాయ్ దేశాయ్, సత్యమూర్తిగార్ల ప్రతిపక్ష నాయకత్వం రోజుల్లో పార్లమెంటులో ప్రశ్నాకాలం ఉత్సాహంగా ఉండేది. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత రోజుల్లో కూడా బాగానే ఉండేది. ఇప్పుడు ఆఉత్సాహం లేదు. పూర్వంకంటె బహుశా ఎక్కువ కాలాన్ని ప్రశ్నలకు కేటాయిస్తున్నారనుకుంటాను వయోజన వోటింగ్ అమల్లోకి రావడంతో శ్రద్ధగా, కష్టపడి పనిచేసే సభ్యులు కరవైనారని కూడా అనిపిస్తుంది ప్రశ్నల కాలం మాత్రం దిగులుగా, నీరసంగా ఉంటోన్నమాట నిజం.

పార్లమెంటులో వేస్తున్న ప్రశ్నలెటువంటివి? తేనెటీగల కేంద్రాలు భారతదేశంలో ఎన్ని ఉన్నాయని ఒక సభ్యుడడిగాడు. భారత్ సేవక్ సమాజం పంజాబులో ఎన్నిచోట్ల పనిచేస్తోందని మరొక సభ్యుడడిగాడు.

వచ్చిన బాధేమిటంటే, ఏ చెత్తప్రశ్నలో ఓ చెత్తప్రశ్నలు అడిగితే అడిగారు ఆ ప్రశ్నలకు సమాధానాలిచ్చే సమయంలో స్పీకరు ఆ ప్రశ్నలు వేసిన సభ్యుల పేర్లను పిలిస్తే సభ్యులు గైరుహాజరులో ఉంటారు. సగటున ఒక్కొక్క ప్రశ్నకు సమాధానమివ్వడానికి 60 రూ॥లు ఖర్చవుతుంది. సమాచారం తెలుసుకోడానికి ఒక్కొక్కసారి

(56-వ పేజీ చూడండి)

గ్రీకుపురాణ గాథ

అటలాంటా పరుగుపందెం

ఆర్కేడియా రాజు జాసస్‌కు ఏ లోటూ లేదు. అతని రాజ్యంలో అందరు పాడి పంటలతో హాయిగా కాలక్షేపం చేస్తున్నారు. కాని జాసస్ రాజు కేమీ సుఖం లేదు కారణం: అతని కెంతకాలానికీ సంతానం కలగలేదు.

కొంతకాలానికి అతని రాణీ క్లైమిన్‌కు సంతానంకలిగింది. గాని ఆ పుట్టింది ఆడపిల్ల. ఆమాటవిని రాజు మరింత బెంగపెట్టుకున్నాడు. ఆ పిల్ల పేరు అటలాంటా.

ఆ తిరవాత అతనికి మరి సంతానం కలుగుతుందనే ఆశ కలగలేదు ఏమైనాసరే ఆపిల్లనింటో ఉండనియకూడదని అనుకున్నాడు. అడవిలో దిగవిడిచి రావాలని నిశ్చయించాడు.

ఒకనాడు అర్ధరాత్రి వేళ పాపం ఆపిల్లను తీసుకువెళ్ళి అడవిలో విడిచిపెట్టి వచ్చాడు. ఇక మళ్ళీ ఆ పిల్ల మొహం చూడకూడదని అనుకున్నాడు.

అయినా వెళ్ళిపోయేముందొకసారి అటలాంటాకేసి చూశాడు. పాల వెన్నెలలో ఆ పసిపిల్ల బంగారం బొమ్మలా మెరిసిపోయింది. తిరవాత జాసస్ రాజు తిరిగి తన రాజ్యానికి వెళ్లిపోయాడు.

ఎంతగా మరిచిపోవాలని అనుకున్నా ఆ పిల్లమాట మరిచిపోలేక పోయాడు.

తరవాత ఆ పసిపిల్ల నింటికి తీసుకురావాలని ఆ అడివి ఎంత గాలించినా అటలాంటా జాడ కనిపించలేదు.

కాని అటలాంటా అడవిలో చనిపోలేదు. ఒక ఆడ ఎలుగుబంటి ఆ పసిపిల్లను తనగుహలోకి తీసుకుపోయి అతి జాగ్రత్తగా పెంచింది. అటలాంటా ఎలుగుబంటి పిల్లలతో కలిసి మెలిసి తిరుగుతూ క్రమంగా పెరిగి పెద్దదైంది.

పశువుల కాపరులు కొందరటలాంటాను చూచి తమఇంటికి తీసుకు వెళ్లిపోయారు. కొంతకాలం ఆమె పశువులకాపరులతోనే కలిసి మెలిసి తిరిగింది.

అటలాంటా క్రమంగా ఆ ప్రాంతంలో అంతటా అంతటి అందగత్తెలేదని పేరు పొందింది. పరుగుతీయడంలోకూడా ఆమెతో పోటీకి నిలబడగల వారెవరు. కనిపించలేదు. పసువుల కాపరులతో ఉన్నంతకాలము ఆమె వారితో కలిసి పరుగుపందాలు వేస్తూండేది. ఎంత గొప్పగా పరిగెత్తేవాళ్లు వచ్చినాసరే, చివరికి గెలుపు ఆమెదే! క్రమక్రమంగా పరుగులో ఆమె పేరు ప్రపంచం అంతటా పాకిపోయింది.

“వినాయక”

ఆ పేరు ప్రఖ్యాతుల మూలంగానే అటలాంటాకు కొంతకాలానికొక గొప్పవేటలో పాల్గొనే అదృష్టం పట్టింది.

క్లేడన్ రాజు ఒకప్పుడు డయానాదేవత యెడల గొప్ప అపచారం చేశాడు. ఆమెకతనిమీద పట్టరానికోపం వచ్చింది. అతని రాజ్యంలోని పంటలన్నీ పాడుచెయ్యడానికొక పెద్ద ఎలుగుగొడ్డును పంపించింది. అది క్లేడన్ రాజు రాజ్యంలో పంటలన్నీ ధ్వంసం చేసింది.

అతనికొడుకు మెలియాజర్ ఆ ఎలుగుగొడ్డును చంపివెయ్యాలని నిశ్చయించి వేటగాళ్లలో గొప్పవాళ్లందరినీ ఒకచోటికి జేర్చాడు. అటలాంటా పరుగు నేర్పు విని ఆమెనుకూడా పిలిపించాలని అనుకున్నాడు. ఆలోగా అటలాంటాయే అక్కడికి వచ్చింది.

ఆ వేటలో అటలాంటా ఎలుగుగొడ్డు వెనక వెనకే పరిగెత్తి దానిమీద ముమ్మరంగా బాణాలు వేసింది. వాటివల్ల దానికెన్నో గాయాలుతగిలాయి. చిట్టచివరికి మెలియాజర్ దానిని బల్లెంతో పొడిచి చంపేశాడు. అటలాంటా అద్భుతశక్తికి మెచ్చుకుని ఆమెకు దానిచర్మం బహుమతిగా ఇచ్చాడు. ఆమెను మనసారా ప్రేమించాడు. గాని అటలాంటా ఆ ధోరణి చూసీ చూడనట్టుగా మాట్లాడకూరుకుంది.

తరవాత ఒకనాడు జాసస్ రాజు అటలాంటాను చూచాడు. అతనికి పాతకథ



మిలానియన్ ఇంకొక ఆపిల్ విసిరాడు.

★ అటలాంటా పరుగుపందెం ★

అంతా ఒక్కసారిగా జ్ఞాపకం వచ్చింది. వెంటనే ఆమె తన కుమార్తే అని గుర్తించి తన రాజభవనానికి తీసుకుపోయాడు.

2

కాని అటలాంటా కా రాజభోగాలేవీ రుచించలేదు. మళ్ళీ తిరిగి అడివిలోనికి వెళ్ళిపోవాలని ఉవ్విళ్లూరుతూండేది. ఆమెకు రాజభవనంలో సుఖంగా నృత్యం చేసుకోడానికి గాని, అడవిలోలాగ ఆటలాడుకోడానికి గాని వీలుదొరికేదికాదు. పెద్ద పెద్ద సామంతులెవరైనా పలకరించడానికి వస్తే ఆమె ఉన్నచోట నిలబడకుండా తుర్రుమని పారిపోయేది.

ఎంతమంది రాజకుమారులామెను వివాహం చేసుకుందామని ముందుకువచ్చినా ఆమె దానికి ఒప్పుకోలేదు. ఒకనాడు తండ్రి ఆమెతో ఆ రాజకుమారులలో వచ్చినవారి కెవరికైనా పెళ్ళిచేసుకోమని చెప్పాడు. ఎంతచెప్పినా ఒప్పుకోకపోతే పరుగుపందెం ఏర్పాటుచేసి అందులో నెగ్గినవారిని వివాహం చేసుకోమని సలహా ఇచ్చాడు.

ఆమాట చెప్పగానే ఆమె అలాగే అని ఎగిరి గంతేసింది. అయితే జానస్ రాజు ఇంకొక విధంగా చాటింపు వేయించాడు. పరుగుపందెంలో ఓడిపోయినవారిని తక్షణం ఉరి తీయించివేస్తానని ప్రకటించాడు. అది విని చాలామంది ఆమెతో పరుగుపందానికి సిద్ధపడలేదు. కొంతమంది ఆమెతో పందెంలో పాల్గొన్నా వెంటనే వారి తలకాయ లెగిరిపోయేవి!

అలాగ వారిని చంపవద్దని ఆమె బతిమాలుకొనేది. కాని ఆమె తండ్రి దాని కంగీకరించలేదు.

కొంతకాలానికి 'మిలానియన్' రాజకుమారు డామె అందంవిని పందెంలో పాల్గొనడానికి వచ్చాడు. అతన్ని చూడగానే అటలాంటా తలవంచుకొని క్రీగంటి చూపులతో చిరునవ్వులు నవ్వింది.

మిలాయనియన్ ఆమె అభిప్రాయం పసిగట్టాడు. ఎలాగైనా పందెంలో నెగ్గితీరాలని నిశ్చయించుకొన్నాడు.

ఒలింపస్ పర్వతం పైనున్న వీనస్ దేవత దగ్గరికి వెళ్లాడు. ఆమె ప్రేమకు సౌందర్యానికి అధిదేవత.

వీనస్ అతని పరిస్థితి చూచి చాలా జాలిపడింది. మూడు బంగారు ఆపిల్ పళ్లతని కిచ్చింది:

"మిలానియన్! నీవు అటలాంటా పరిగెత్తినంత వేగంగా పరిగెత్తలేక పోవచ్చును తగిన సమయంలో ఈ ఆపిల్ పళ్ళుపయోగించావంటే తప్పకుండా ఈపందెంలో నెగ్గుతావు. ఈపళ్లు జాగ్రత్తగా వాడుకో!"

అని సలహా చెప్పింది రహస్యంగా అతనికి ఆ పళ్లు ఉపయోగించే ఉపాయం కూడా చెప్పింది.

3

మరునాడు మిలానియన్ అటలాంట తండ్రి దగ్గరికి వెళ్లి పందెం వేయించమని సవాలు చేశాడు. తానాపందెంలో నెగ్గితీరతాననీ వెంటనే పందెం ఏర్పాటుచేయించమనీ అన్నాడు.

అటలాంటాకు అతన్ని చూడగానే చాలా జాలివేసింది. లోలోపల అతనిపై ప్రేమ, మమకారం ఎక్కువైనా యథాప్రకారంగానే పరుగుతీయాలని నిశ్చయించింది.

కాని ఎంతగా ప్రయత్నించినా పూర్వం మోస్తరుగా లేడిపిల్లలాగా పరిగెత్తలేకపోయింది. మిలానియన్ బాగా ముందుకు వెళ్లిపోయినా చూసీచూడనట్లూరుకుంది.

(55-వ పేజీ చూడండి)

ఈ జీవితమే...సఫలమూ!

"శ్రీమతిగారు చీర సింగారించేటప్పటికి ఊరు మాటుమణుగుతుంది! రావు అసలే పంక్చ్యువాలిటీ పాటించే మనిషి! మనం నిక్కినీల్గి ఆలస్యంగా వెడితే ఖాళీ గిన్నెలు నెత్తిమీద బోర్లించగలదు, రావు భార్య!" అంటూ శ్రీమతిగారి ఆలస్యానికి చిందులు త్రొక్కటం ప్రారంభించాడు శ్రీధర్!

"ఔను పొరుగింటి పుల్లకూర రుచి అని నేనూ చూస్తాగా రావుభార్య చురుకుతనం! అయినా ఈ మొగాళ్ళంతా యెప్పుడూ యింతే!...పరభార్యలు పంచదారతో సమానం!" ఒక్కసారిచిన్న జల్లు చిలకరించి చురచురా చూసుకుంటూ మెట్లుదిగి వెళ్ళిపోయింది శ్రీమతి.

హరి, భగవంతుడా! తెల్లవారిలేచి తను ఎవరిమొహం చూశాడో కానీ! ఎంతపని జరిగిందీ! ఈ ఆడవాళ్ళకి అసూయ అరవైపాళ్ళు పెట్టినట్టున్నాడు! కొంపదీసి, మా శ్రీమతిగారుకూడా ఆ అలివేలు మంగమ్మలా కొండదిగి వెళ్ళిపోదుగదా! తీరా అంతపనీ జరిగితే! తనగతేంకావాలి? తనేమన్నా తిరుపతి వెంకటేశ్వరుడు కనకనా! రోజూ ఏడు కొండలూ దిగి, గుంజీలుతీసి లెంపలేసుకుందుకు! అయినా ఈ ఆడవాళ్ళంతా ఎప్పుడూ ఇంతే! వీళ్ళతో భర్తే ప్రయాణం పెట్టుకోకూడదు. అప్పుడు తెమలమంటే అర్నెల్లకి తయారవుతారు! వీళ్ళతో ప్రయాణం పెట్టుకోవటమంత బుద్ధిపొరపాటు అదేగానీ, ఇంకోటిలేదీ మొగాళ్ళకి! శాస్తి! అయినా ఇలా తను ఎన్నిసార్లు లెంపలు వాయించుకోలేదూ? ఎప్పటికప్పుడే పరగడుపు! పోనీ కాలం అదేమైనా మన అధికారంలో ఉండే వస్తువా?

పోని, ఈ మందగమనల్ని మరిపించి, ఏసినిమాకో పోతే, రాత్రంతా చిటపట చినుకులు ... అనుకుంటూ తలుపులదగ్గర పడికాపులు పడి పడి పడి, తెల్లవారూ తపస్సు చెయ్యాలి! మళ్ళీ అలకతీర్చడానికి అవతారమే ఎత్తాలి! తాతాచార్యులవారి ముద్రలా తలదాల్చాల్సిందే! కానీ, తప్పించుకుందామంటే మాత్రం తప్పుతుందా! నిజానికి తనకిమాత్రం తప్పించుకుందామని ఉందా? కానీ ఆవిడిగార్ని బయలుదేరదీయడమంటేనే తలనొప్పి! అక్కడే వచ్చింది చిక్కంతాను! టాయిలెట్ బాక్సుముందర కూర్చుంటే, తరాలుకూడా గడిచిపోతాయి! ఇంక అలంకరణతో ఆయుస్సు నిండుతుంది!! గట్టిగా గదమాయిస్తే, నీళ్ళకుండ నెత్తిమీదే ఉంటుంది. ఉరుముల వర్షంకురిపిస్తే, మూర్ఛపోయినంత పనిఅయి, ముక్కోటి దేవతలు దిగిరావాల్సి ఉంటుంది! ఇంక వీళ్ళుబయటికి బయలుదేరితే, బాడీగార్డ్సు ముందరే అడుగులకి మడుగులొత్తుకుంటూ,—మధ్యలో వారిమీద ఈగవాలితే; చెప్పులేసుకుంటూ... సురక్షితంగా తీసుకొనివెళ్ళి, మళ్ళీ నిరపాయంగా ఇల్లుచేరాల్సిందే!...

అందులోనూ కొందరుంటారు. వారు కాలచక్రంతోపాటే తన జీవితచక్రాన్ని జతచేసుకుంటూ పోతారు! మరికొందరు జీవితాలతరబడి గంటలతో యుద్ధంచేసినా, గమ్యస్థానాన్ని చేరుకోలేకపోతారు! ఈ విభిన్న దృక్పధాలుగల స్త్రీపురుషులిరువురి దాంపత్యంలో ఇంట్లోకీచులాట చూడ్డానికి వినోదంగానే ఉంటుంది. ఈ విషయం శ్రీధర్ దాంపత్యంలో పదహారణాలా ప్రత్యక్షమవుతూనే ఉంటుంది! అందుకని, శ్రీధర్ కి మందగమనకి మేలుకొలుపు పాటలు పాడటం బాగా అలవాటైపోయింది! "ఫస్టుషో" ఆరుగంటలాటకి ఎప్పుడైనా ఏడు గంటలకి ముందరవెడితే ఒట్టు! లేకపోతే, సెప్టెంబర్ ఆఖరి ఆదివారమేమైందీ? "కమల్ టాకీసు"లో బాలసన్యాసమ్మ కెళ్ళాలని బలవంతంచేసింది. కాదనడానికి అధికారమేదీ? అయినా, ఈ ఆడవాళ్ళకి ఇంట్లో పనుండదు గనక, ఏటాకీస్ లో ఏ ఆటలుంటాయో కంఠోపాఠమే అనుకుని అలవాటుప్రకారం అరగంట ఆలస్యంగా వెళ్ళికూర్చుంటే, అనార్కలీలో అంజలి "ఈజీవితమే సఫలమూ!" పాడుతూంది లేకపోతే, ఈ ఆడవాళ్ళని నమ్మడమేమిటి? కుక్కతోకతో గోదావరీదినటే! వీళ్ళున్నారే ఈ మొగాళ్ళని ఉత్త పిచ్చసన్యాసుల్ని చేసి మరీ వదిలిపెడతారు! ఐదు

వి. రత్నావళి

రూపాయలూ హారతివెలిగించి ఖాళీజేబుతో కొంప చేరుకున్నాడు, మాటినీ నుంచి! "ఈజీవితమే సఫలమూ!" అంటూ తన్ని మరిపించడానికి శ్రీమతిగారు మధురమైన కాఫీ ఇచ్చి కోపమంతా ఇట్టే పోగొట్టేసింది.

వీళ్ళంతా...ఉ...త్త గారడీ గాళ్లు! కరిపిస్తారు...మరిపిస్తారు కూడాను, అంటూ మర్నాడు ఆఫీసుకి బయలుదేరి వెడుతూంటే త్రోవలో వాల్ పోస్టర్ లో కమల్ టాకీస్ లో 27 తే॥ "బాలసన్యాసమ్మ విడుదల" అని దెయ్యంలా అక్షరాలు తనమీదికి యుద్ధానికి బయలుదేరే సిపాయీలలా నిలబడ్డాయి! చెంపలు వేసుకుని, చేటంత ముఖంతో క్షమార్పణ కోరుకోక తప్పలేదు!

ఇంక ప్రయాణాలంటే ప్రళయాలే జరగాలి! బ్రహ్మ ముహూర్తంలో ప్రారంభిస్తే, బండికూత కూసి, గార్డ్ విజిల్ వేసి, బండి బయలుదేరేసమయానికి అందులో పడడం గగనమై పోతుంది! బండి తప్పిపోవడం బాగా పరిపాటైపోయిన విషయమే!...

ఆ సూర్యభగవానుణ్ణయినా ఓ గంట ముందు ఉదయించమని ప్రార్థించగలంగానీ, మా శ్రీమతిగారిముందుమాత్రం అలాంటివేవీ చెల్లవు. తను గడియారానికెప్పుడూ యుద్ధకాలమే! అది ఒకగంట ముందుగానే నడవాలి! తన శ్రీమతిగారికన్నా అదే నయం! చెప్పినట్లు వింటుంది!

ఆఖరికి ఆఉపాయం కూడా ఉప్పెనలా కొట్టుకు పోయింది!—తన శ్రీమతిమాత్రం ఏమంత తెలివితక్కువదనీ? తనకంటే ఏడాకులెక్కువగానే చదువుతుంది! తనకన్నా గడియారం గంటముందుకే నడుస్తూందన్న సంగతి పసికట్టేసి—తను బయటకు వెళ్ళగా చూసి, మళ్ళీ గంట ముందుకే వచ్చేట్లు రిపెయిర్ చేసేసింది! ఆవేళ తత్ఫలితంగా తను కోర్టుకి గంట లేటుగా వెళ్ళాడు! తను శ్రీమతిగారి మనస్తత్వాన్ని రిపెయిర్ చెయ్యాలనుకుంటే, ఆవిడ తన్నే దుకాణంలో గిన్నెల్లా మార్చేస్తూంది! ఇప్పుడు శ్రీమతిగారి కా విషయంలో. చివాట్లుకూడా శృంగారంలో ఒకటైపోయింది!

వ్యక్తుల వ్యతిరేక స్వభావాల్ని వెలుపరచగల తను మనస్తత్వశాస్త్రమంతా మననం చేసి, తర్కించి, బ్రహ్మని తిమ్మనిచేసి

కోర్టులో కొంపలుముంచే తను గృహిణి ముందు గుంజీలు తీయవల్సినంత పని అవుతూంది!

ఆవేళకూడా మళ్ళీ అలాంటి సమస్యే ఎదురైంది! ఆవేళ "ఆంధ్రప్రదేశ్ అవతరణ గదా" అని రావు వాళ్ళింటికి విందుకు రమ్మన్నాడు. పదింటికల్లా "పంక్చువల్"గా రమ్మనమని మరీ మరీ చెప్పాడు. శ్రీధర్ ఇంట్లో పాతపాట ప్రారంభించాడు. కానీ

ఏం ప్రయోజనం? ముందురోజే రావొచ్చి "చూడు మరదలు పిల్లా! రేపు పదింటికల్లా వచ్చెయ్యాలిసుమా!" అని ఆహ్వానించి, మరీ వెళ్లాడు! "మీ తమ్ముడుగారు ఎనిమిదింటికల్లా తయారవమని హెచ్చరించినపుడే, అనుకున్నా! పదింటికి ప్రయాణమని!" రావుతో అంది, నాకేసి గోముగా చూస్తూ.

"అప్పటికైనా తయారవగలిగితే ధన్యులమే! అనుకుని ఆవేళ తెల్లవారినదగ్గర నుంచీ హెచ్చరించడం ప్రారంభిస్తే, పదికంటలకల్లా తనమీద పోటీగా పందెం వేసినట్లు "ఏమండీ! ఈ వెల్వెట్ జాకెట్ మీదికి మైసూరు క్రేపు రంగుచీర బాగుంటుందా? లైటుకలర్ కట్టుకోనా?" అని ఒయ్యారమంతా ఒలకబోస్తూ అడుగుతూంది, చిరునవ్వుతో.

నరసింహావతారం ఎత్తడానికి తయారుగానున్న తన హృదయం శ్రీమతిగారి చిరునవ్వుతో చిత్తయిపోయి, "రంభలాగున్నావ్!" అని గడియారంకేసి మళ్ళించాడు తన దృష్టిని, తొందరగా తెమలమన్నట్లు తెలపడానికి సీరియస్‌గా మొహం పెట్టడానికి ప్రయత్నిస్తూ.

"ఔను! నేనేదడిగినా మీకు హాస్యంగానే ఉంటుంది! మళ్ళీ మార్చుకుంటూ కూర్చుంటే, ఆలస్యం అవుతుందనిగానీ, లేకపోతే ఇలాంటప్పుడు ఇంత ముదురురంగుచీర లెవ్వరూ కట్టుకోరు! ... అయినా శ్రీవారు అరగంటముందునుంచీ అనవసరంగా హడావిడిపడి అలుగుతారు!...సరిగ్గా పదింటికల్లా తయారవలేకపోతే అనండీ! అంటూ దయచేసింది అక్కడినుంచి. ఇంక ఎక్కువమాట్లాడితే ఇంటిమీద పెంకు లుండవని తనకి తెలుసు! ... అందులోనూ ప్రొద్దున్నే జరిగిన పొరపాటుకే లెంపలేసుకున్నంత పని జరగడం జ్ఞాపకం వచ్చింది! ఇప్పుడు అగ్నిపర్వతం బ్రద్దలవడానికి—ఆలస్యమేం లేదు!—అందులోనూ ఇంట్లో రేగిన గాలిదుమారచిహ్నంగా దుమ్ము కొట్టిన ముఖకవళికలు అక్కడ నలుగురిలోనూ వాచ్యం చెయ్యగలవని భయమేసి... వెంటనే టేబిల్ మీదవున్న పత్రిక చదవడం ప్రారంభించాడు. కానైతే దాన్ని ప్రొద్దునే శ్రీరస్తుదగ్గరనుంచి...చిత్తగించవలెను దాకా చదివి పారేసినదేఅయినా, ఈ అపాయపరిస్థితుల్లో అది అమోఘంగా అదునుకొచ్చింది! అది చదివేసిన పేపరవడంచేత కాలం గడపడానికి చదవలేక పేజీలు తిరగేస్తూన్న అతనికి ఒక అమోఘమైన ఆలోచన బుఱ్ఱలో మెఱుపులా మెరిసింది. దానితో కొంత హడావిడిచేసి, అప్పటివరకు తయారు కాకుండా అలంకారంలోనే నిమగ్నమైవున్న శ్రీమతిగారికి గడియారం తిప్పేసి పదిగంటలూ చూపించి, నిలుచున్న మనిషిని నిలుచున్నట్లు బయలుదేరదీయాలని లేచి. గబగబ "టాంగా" పిలిపించి తయారుగా పెట్టించి అంతఃపురంలోకి వెళ్ళేప్పటికి, శ్రీమతిగారు చిత్రకాలలో సిల్కుచీర కట్టుకుని, శృంగారంగా ప్రియునికోసరం నిరీక్షిస్తూన్న రవివర్మబొమ్మలా — కూర్చుని, ఎన్ని నిముషాలనుంచో నిరీక్షించి, నిరీక్షించి, నిరీక్షించి.....నిరుత్సాహపడుతూన్న మొహంపెట్టి కూర్చుంది సోఫాలో, పోగ్గా! ఇంతకీ ఆలస్యమంతా నీదేసుమా అని నిరూపిస్తూను!

"ఈవేళ మా శ్రీమతిగారి శృంగారంలో ...ఏదో లోటు...కనిపిస్తున్నట్లుందే!" అని అంటూ నాలుక కఱచుకున్నాడు. తయారుగా నున్నందుకు మనస్సులో సంతోషిస్తున్నా.

"చివాట్లు లేవనా?"—అన్నట్లు మొహం చిట్లించుకొని, చుర చురా చూసింది, కళ్ళల్లోకి అట్టే అలగకుండా మృదుమధురకర పల్లవాలని పట్టుకుని లేవదీసి టాంగా ఎక్కించి స్థిమితపడ్డాడు. బయలుదేరింది మొత్తానికి టాంగా.

ఈ హైదరాబాదులో బస్సుల నిరీక్షణలోవున్న బాధ భగవంతుడికే తెలియాలి! అందులోను బస్సుస్టాండు గుమ్మంలో ఉంటుందా ఏమన్నానా? అరమైలు నడవాలి! అంతదూరం తన సుకుమారమైన శ్రీమతిగారు నడవగలదా! వేసుకున్న పౌడరంతా కరిగిపోయి, ముఖమంతా కందిపోయి, తోటకూరకాడలా వేళ్ళాడి పోకుండా "టాంగా" కట్టించాడు తను.

తమరిద్దరూ ఎక్కగానే 'టాంగా' వాలా ఒక్కసారి కళ్ళాల్ని కదిలించి, గుర్రాన్ని గదమాయించి, ఒక్క కొరడా దెబ్బ తగిలించాడు. దాంతో గుర్రం మరీ మొరాయించి మొండికేసింది. శ్రీధర్ కి ఛుఱుమంది: "ఏమయ్యా! కొంపదీసి మీ గుఱ్ఱం మొండిది కాదుగదా!" అన్నాడు. శ్రీమతిగారి మొహంకేసి చూస్తూ, వెటకారంగా

"కొతుకొద్దీ గుఱ్ఱం బాబా! దాని నడక మనచేతుల్లో ఉంది!" అంటూ ప్రకృతినంతా పగ్గాల్లో బంధించినట్లు గట్టిగా పట్టుకులాగి ఒక్క కొరడా దెబ్బ తగిలించాడు గుఱ్ఱాన్ని గర్వంగా టాంగావాలా.

తస్సాదియ్యా! కాలాన్ని కళ్ళాల్లో కట్టేసుకున్నట్లు కబుర్లు చెబుతున్నాడు గర్వంగా. తనకంటే వాడేనయం! తను తన శ్రీమతిగారి దగ్గరే కాకుండా చివరకి 'టాంగా'వాలా దగ్గర కూడా, "హాతోస్మి"

అనుకోవలసి వచ్చినందుకు తలవంచుకుని, టైంచూసుకున్నాడు. పావు తక్కువ పది అయిపోతూ ఉంది! మహావేగంగా వెళ్ళగలిగితే, పదిన్నరకి చేరుతారు. సరిగ్గా అరగంటే లేటు! — అది అలవాట్లో పొరపాటేగా! ......

కానీ వచ్చిన చిక్కేమిటంటే, గత ఆదివారము రావుతో తను 'పంక్చ్యువాలిటీ'ని గురించి పందెం వేసుకున్నాడు. తను ఇండియన్ 'పంక్చ్యువాలిటీ'ని గురించి ఒక లెక్చర్ దంచేశాడు. అతనంతా విని "జోనయ్యా! మన మొగవాళ్ళల్లో 'పంక్చ్యువాలిటీ' మోతాదుగానే ఉంటుంది. కానీ, చూశావూ! మన వెనక్కాలే తగిలించుకునే తింటాలుంటాయే — రామ....రా...మ... ఆ బ్రహ్మదేవుడికైనా ఒద్దురాబాబూ!" అనిపిస్తుంది. - ఇంకా లింకుల్లా వాళ్ళ వెనక్కాలే....పిల్లా ... పీచూ ... పీక్కుతింటూంటే!... ఒద్దురా పెళ్ళామూ!... అనిపిస్తుంది," అని అరగంటసేపు అక్కడున్న వాళ్ళందర్నీ నవ్వించి పారేశాడు!- కానీ తను ఒప్పుకోడుగా! "మీదంతా ఉత్త మెతకవేళం! రౌతుకొద్దీ గుఱ్ఱమని! అదంతా మన డ్రైవింగులో ఉంది! మా శ్రీమతిగారు నేను అనుకున్న టైముకన్నా ఒక్క... రెండు .... మూడు నిముషాలు రావడం ఆలస్యమైతేచాలు,— ఆ వేళల్లా అలిగి కూర్చుంటుంది"

ఆ మాట కడ్డంవచ్చి, "అరే మా మరదలు మాణిక్యం సంగతేం చెబుతావు! చదువుకున్న పిల్ల కాబట్టి గంటల మీదే నడుస్తుంది గాబట్టి సరిపోయింది! లేకపోతేనా?...కొరడాతో కొట్టి కాలాన్ని కదపాల్సి వచ్చేది!" అన్నాడు హాస్యంగా నవ్వుతూ.

అలాంటప్పుడు తను ఆలస్యంగా వెడితే రావు ఏమనుకుంటాడు? మా వదినగారిచేత ఆరిపోయిన చద్దన్నం పెట్టించి, మా సుకుమార శ్రీమతిగారి...ఆ ఉన్నమతి కాస్తా కూడా లేకుండా చేసెయ్యగలరని భయమేసి, ఒక్కసారి ఆవిడగార్ని ఆనందంగా చూసుకొని మురిసిపోయాడు శ్రీధర్!...

శ్రీమతిగారు గుఱ్ఱంవడకని గమనించడం, బండివాణ్ణి బెదిరించడం, కుంటి గుర్రాన్ని కూకలెయ్యడం!—రావుతో ఆలస్యానికి అక్షింతలు వేయించుకోవడం,-అన్ని బాధ్యతలు - తనవేం గానట్లు నిశ్చింతంగా!...హృదయం మీద దెబ్బకొట్టి, నీవేనన్నట్లు చూస్తూ కూర్చుంది

అయితే, తన ఈ కోపమంతా ఎవరిమీద చూపిస్తున్నట్లు? గుఱ్ఱంమీదా? బండివాడిమీదా? భార్యమీదా?...

తన హెచ్చరిక అందుకుని బండివాడు, కొరడా క్రింద పెట్టి, కళ్ళాల్ని కదలించి గుఱ్ఱాన్ని గదమాయించాడు! అప్పటికే ఆలస్యానికి తన ఆగ్రహం అవధులు దాటుతూంది!

ఆ సమయంలో తనేం చేస్తున్నాడో తనకే తెలియని స్థితిలో కొచ్చాడు! "ముద్దు ముద్దుగా కళ్ళెంతో కదిలిస్తే కదులుతుందా! తగలనీ వాలుగు! పట్టలేని అహంకారంతో అన్నాడు తను! బండివాడికా మాటలు ఎలా తగిలాయో కానీ! "బాబా! మనుష్యులైనా, మృగాలైనా హెచ్చరించకపోతే, ఎదురు తిరుగుతారు! దాని, తీరు, స్వభావమే అంత తీయినపుడు, కొరడాతో కొట్టి పులుసులోకి ఎముక లేకుండా...చావగొట్టి చెవులు మూసి...పప్పుచేస్తే మాత్రం...ప్రయోజనమేమిటి? మంచిని విషమైనా త్రాగించగలంగానీ పగని పాలుకూడా త్రాగించలేము. బలిమిని పనులు జరుగుతాయా బాబయ్యా! ఒక్కమాటలో సైకాలజీ అంతా కూడా చెప్పేశాడు. ఆ మాటలు తనమీద గారడీలా పని చేశాయి! దాని స్వభావమూ, నడక తీరు అంతేఅయితే, ... కొరడాతో కొట్టి పులుసులోకి ఎముక లేకుండా పప్పు చేస్తే మాత్రం ప్రయోజనమేమిటి?

ఈ ఒక్కమాట ఒక గొప్ప మహానదికి ఒక చిన్న ఆనకట్ట చేసినంతపని చేసింది! తన హృదయం ఆలోచిస్తూన్నా చూపులు శ్రీమతిగారిమీదే ఉన్నాయి. ఆవిడ కాంతివంతమైన కళ్ళల్లోంచి అరుణ కిరణాలు ఒక్కసారి మెరిశాయి! ఆవిడ సుందరవదనారవిందం. అరమోడ్పు అరవింద దళాయతాక్షులు...భావి భారత పౌరుని ప్రసాదించగల చిహ్నాలు చిందేటి టిష్యూ చీరచాటు సిరులు...ఒక్కసారి తన హృదయమంతా పొంగింది. కానీ మళ్ళీ టైము చూసుకుంటూంటే భయమేసి కోపాన్ని రూపొందించుకుని గడియారం కళ్ళల్లోకి చూశాడు వేగంగాతిప్పి-ఈలోపుగానే రావు ఇల్లుచేరారు. బండి దిగుతూన్న కొద్దీ, ఆలస్యానికి రావుచేసే హంగామా అంతా జ్ఞాపక మొచ్చింది. అసలేరావు పోలీసువాడు. "ఆలస్యానికి" అరెస్టు అనేస్తే—శ్రీమతిగారు ఏమైపోవాలి? తల్చుకుంటూంటే నెపోలియన్ నెమరు కొచ్చాడు. ఒకసారి నెపోలియన్ బోనా పార్టీ తన ప్రధాన సేనాపతి పార్టీకి పది నిముషాలు ఆలస్యంగా వచ్చినందుకు కబుర్లతోటే కడుపు నింపేశాడుట! అలాగే శ్రీమతిగారికి కూడా మూతికాలిన పిల్లిలా బుద్ధిరావాలి! అనుకుంటూ లోపలికిఅడుగు పెట్టేటప్పటికి సరిగ్గా పదిన్నర అయింది.

రేడియో టైము ప్రకారమూను...అరగంటే లేటు...

రావు దంపతుల్ని గౌరవించి లోపలికి తీసికొని వెళ్ళాడు. శ్రీధర్ ముందరే భుజాలు తడువుకుంటూ, "ఈ బండివాడు మమ్మల్ని బలే దగాచేశాడు. ఆ గుఱ్ఱంకూడా — ఉ...త్త...మొండిది! ... లేకపోతే, అరగంట ముందరే. — అంతేవాళ్ళం!" అని ఆయాసపడుతూ క్షమార్పణ చెప్పుకున్నాడు.

"ఈ నిరీక్షణ ఉందే! ఉ...త్త నిర్మొహమాట మైనది సుమా!" అని తెగనవ్వడం ప్రారంభించాడు రావు.—

నవ్వుతూనే ఉన్నాడు.—ఇంకానవ్వుతూనే, "పద! సెహభాష్...పదవయ్యా బాబూ! అది ఎంతనిర్మొహమాటమైన వస్తువో.... ఇప్పుడు తెలుస్తుంది.!... తెలుస్తుంది. అడుగు...పో!..వంటింట్లో మీవదినగార్ని!—అదుగో! చూడు...ఇప్పుడే... మడిగట్టుకొని ఎసట్లో బియ్యం పోస్తూ ఉంది!...ఏంఫర్వాలేదులే! అప్పటివరకు మీవదినగారి ధర్మమా—అని, కడుపుని... చిలక్కొయ్య కేసుకొని...నెహ్రూని చూచి వద్దాం!....ఈలోపుగా మీవదినగారు వండి, వడ్డిస్తుంది ... వేడివేడిగా మరిదిగారికి!... అంటూ చెయ్యిపట్టుకొని ఇవతలకి తీసికొని వచ్చాడు. తనకు తెలియకుండానే చెంపల కతుక్కుపోయిన చేతులు పట్టుకుని, "భయం లేదులే నాయనా! బండెలా బహద్దూరున్నాగా!" అంటూ భుజం తట్టి ఈలోపుగా శ్రీమతిగారు ఏం కారాలు మిరియాలూ నూరుతూందోనని భయంవేసి చూసుకుంటూ "తెలుసుకున్నాలే నీగుట్టంతా అన్నట్లు ముఖం పెట్టి కొంటెగా నవ్వుతూండగానే, ఇద్దరు మెట్లుదిగి వెళ్ళారు.

కానీ, శకునంచెడి వెళ్ళినపని వెంటనే అవడంచేత వెనక్కి వచ్చేశారు నెహ్రూ "స్పీచ్" ఆరింటిదాకా లేదని తెలిసి.

శ్రీమతిగారు "అయిందా శాస్త్రి!.... ఇక్కడ భోజనమూ తయారుకాలేదు; అక్కడ నెహ్రూనీ చూడలేదు! లేకపోతే ఆడవాళ్ళని అలుసుచేసి తీసికొనివెళ్ళక పోతే? ఏమవుతుందీ? అన్న ముఖంతో ఏకంగా నవ్వుల పువ్వులవర్షం కురిపించేస్తుంది శృంగారంగా తన్ను చూసి! ఆ చూపుతో తన కోపమంతా సర్కస్సు గుఱ్ఱం లాగా కొరడాతో కొట్టినట్టే కొండెక్కిపోయింది!

"ఈ జీవితమే...సఫలమూ!" అనుకుంటూ ఆరింటికి ఆవిడగార్ని వెంటపెట్టుకుని, శృంగారంగా నెహ్రూగారి దర్శనంకోసరం దయచేస్తే...ఆయనగారు అప్పుడు అవగించారు.

★

స్త్రీకి చదువెందుకు?

సాయంకాల మయింది మిల్లులన్నీ పనివాళ్లను ఇళ్లకు పొమ్మని సైరన్లు కొట్టేశాయి మేకలు 'మే మే' మంటూ మందలు మందలుగా గొల్లవీధికి చేరుకుంటున్నాయి. పొలాల్లో ఊడ్పులకు వెళ్లిన స్త్రీలు జట్లు జట్లుగా ఇళ్లకు వస్తున్నారు పార్కులో రేడియోలోంచి సంగీతం విన్పిస్తోంది.

వీనుల విందుగా విన్పడుతున్న ఆ సంగీతానికి లయ వేస్తూ ఒకమూల అరుగుపై కూర్చున్నాడు గంగారాం.

ఎంత కమ్మగా ఉందా కీర్తన. ఆ పాడుతున్న ఆమె కంఠం గూడ కీర్తనకు తగినట్లుగానే ఉంది ఇంత కమ్మగా పాడుతున్న ఆ అమ్మాయి ఎంత అందంగా ఉంటుందో? అనుకుంటూ ఆనందిస్తున్న గంగారాం, ఎదురుగా వస్తున్న రామారావుని గమనించలేక పోయాడు

రామారావు దగ్గరికి వచ్చి అతని కెదురుగా నవ్వుతూ నిల్చున్నాడు గంగారాం చప్పున రామారావుని చూసి తన ఆలోచనా ప్రపంచం నుండి తేరుకున్నాడు

"అరె! రామారావుగారా? రండి, కూర్చోండి; మీరు రావటం నేను చూడనే లేదు" అన్నాడు ప్రక్కనున్న స్థలం చూపిస్తూ

రామారావు నవ్వుతూ "ఏదో ఆలోచిస్తున్నట్లున్నారు?" అన్నాడు ప్రక్కన కూర్చుంటూ

"అబ్బే! ఆలోచించట మేమీ లేదండి సంగీతం వింటున్నాను ఇంతకీ మీరు మీ ఊరినుండి ఎప్పుడు వచ్చారు?" ప్రశ్నించాడు గంగారాం.

"మధ్యాహ్నం వచ్చానండి ఇప్పుడే నిద్రనుంచి లేచి షికారుకని బయలుదేరి మీ రూముకి వెళ్లాను. తాళం వేసి ఉంది. ఇక్కడ ఉంటారనుకుని వచ్చాను" అంటూ సిగరెట్లు తీసి అందించాడు రామారావు. ఇద్దరూ సిగరెట్లు ముట్టించారు.

"ఆ, అయితే ఏమిటి విశేషాలు; మీరు వెళ్లిన పనేమైంది కాయా పండా?"

"సందిగ్ధంలో పడింది" అన్నాడు రామారావు సిగరెట్టు పొగ వదులుతూ.

"అంటే?"

"ఇద్దరి పిల్లలను చూపించారు. నాకే పిల్ల నచ్చితే ఆపిల్లను చేసుకో మన్నారు. ఒక పిల్ల తండ్రికి ఆస్తి ఉంది. కాని పిల్లకు చదువు పూర్తిగా రాదు. పిల్ల అందంగా ఉంది రెండో పిల్ల తండ్రికి ఆస్తి లేదు కాని పిల్లను నాల్గవ ఫారం వరకు చదివించాడు ఎక్కువ అందకత్తె కాదు, అట్లా అని కురూపి కూడ కాదు. ఒక్క మాదిరిగా బాగానే ఉంది."

'అయితే ఏ పిల్లను పెళ్ళి చేసుకో దలిచారు?"

"ఏ పిల్లను చేసుకునేది నేను ఆలోచించి ఉత్తరం వ్రాస్తానని చెప్పి వచ్చేశాను ఇప్పుడు ఈ విషయంలో మీ అభిప్రాయం చెప్పాలి."

గంగారాం కొంతసేపాలోచించి,

"మీరా రెండవ పిల్లనే చేసుకోవటం మంచిదని నా అభిప్రాయం" అన్నాడు.

"మా ఇంటిదగ్గరకూడ ఇలాగే అన్నారు కాని ఆ మొదటి పిల్ల నెందుకు చేసుకో కూడదు?"

"ఇదుగో ఇటు చూడండి రామారావు గారూ! మీరు చదువుకున్నారు దానికి తోడు ఉద్యోగం చేస్తున్నారు అటువంటప్పుడు మీరు చదువుకున్న అమ్మాయిని చేసుకుంటే మీ సంసారం సుఖంగా వెళ్ళిపోతుంది."

ఈ మాటకి రామారావు నవ్వేడు.

"నవ్వుతున్నారేం?"

"మీ అభిప్రాయం వింటుంటే నవ్వు వచ్చింది. చదువుకున్న పిల్లల సంసారాలే చక్కగా ఉంటాయని, చదువులేని పిల్లలు కాపురాలు చెయ్యలేరని మీ ఉద్దేశం కాబోలు? వంట ఇంట్లో కూర్చునే స్త్రీకి చదువెందుకండీ; వాళ్ళేం ఉద్యోగాలు చెయ్యాలా, ఊళ్ళేలాలా?" హేళనగా అడిగాడు రామారావు.

తన సలహాను అంత హేళనగా చూసినందుకు గంగారాంకి కొద్దిగా కోపం వచ్చింది.

"కాపురాలు చెయ్యలేరని నేననలేదు

కొండపల్లి సాంబమూర్తి

స్త్రీకి చదువుండటం మంచిది. అందువలన పురుషుని మనస్తత్వం అర్థంచేసుకొని సంసారంలో ఎటువంటి కలతలు రాకుండా సుఖప్రదం చేసుకోగలరని నా అభిప్రాయం. పిల్లల పెంపకంలో కూడ వారిద్దరికీ పూర్తి వ్యత్యాస ముంటుంది. చదువుకోవటం ఒక్క ఉద్యోగం గురించే కాదు రామారావు గారూ! లోక జ్ఞానం కొరకు ప్రతి వ్యక్తి ఆడ మగ అనే భేదం లేకుండా చదువుకోవాలి. పిల్లలకు చదువు నేర్పుతున్న మీరు, చదువుకు ఉన్న ప్రాముఖ్యాన్ని చెప్పవలసింది, కాని మీరే చదువెందుకండీ అంటే ఇంక ఇతరుల మాటేమిటి?"

గంగారాంకి కోపం వచ్చిందని తెలుసుకొని రామారావు నొచ్చుకున్నాడు. "క్షమించండి గంగారాంగారూ! ఈ మాత్రం దానికే మీకు కోపం వస్తుందని నే ననుకోలేదు" అన్నాడు రామారావు.

"నా కెందుకండీ కోపం; అందులో మీ పెళ్ళి విషయంలో సలహా లివ్వటానికి నే నెవర్ని?" అన్నాడు

రామారావు మౌనం వహించాడు

క్రమక్రమంగా చీకటి పడుతోంది. పార్కులో జనం కూడ తగ్గిపోసాగేరు. ఇద్దరూ లేచి ఎవరి గదికి వాళ్లు వెళ్ళిపోయారు.


ఈ సంభాషణ జరిగి రెండు సంవత్సరాలైంది. అప్పటినుండి గంగారాం, రామారావుకి సలహా లివ్వటం మానేశాడు రామారావు చదువులేని, ఆస్తిఅందంగల 'లక్ష్మి' పెళ్లి చేసుకున్నాడు. లక్ష్మి కాపురానికి వచ్చి వారం రోజులయింది పుట్టింటినుండి తెచ్చుకున్న సామాను సర్దుకోవటంతోనే ఈ వారం రోజులు గడిపిందామె

2

ఉదయం వేగం కాఫీ తయారుచేసి ఇచ్చి రామారావుని స్కూలుకి పంపించి, తను వంట ప్రయత్నం చేస్తోంది లక్ష్మి చాకలి బట్టలకొరకు వచ్చింది

"ఏమే, ఈవేళప్పుడొస్తే నీకు బట్టలెలా వెయ్యడం?" అంది లక్ష్మి

"ఇప్పుడు బట్టలు వెయ్యటానికేం ఆటంక ముందమ్మగారూ?"



ఇటీవల మద్రాసులో జరిగిన రష్యన్ సర్కస్ ప్రదర్శనంలో ఒకదృశ్యం. ఈ సర్కస్ వారు మద్రాసులో 1 35,000 రూ ల పైగా వసూలుచేసి భారతప్రధాని జాతీయ సహాయ నిధికి సమర్పించారు

★ స్త్రీకి చదువెందుకు ★

"పద్దు ఎవరు వ్రాస్తారు?" తీవ్రంగా ప్రశ్నించింది లక్ష్మి.

అప్పటికిగాని లక్ష్మికి చదువురాదని చాకలిదానికి తెలియలేదు "పోనీలెండమ్మగారూ! రేపు రేవుకి వెళ్తున్నాను అంగు వలన ఎల్లుండి వస్తాను" అంది చాకలి

"ఎల్లుండి వస్తే బట లెప్పుడు తెస్తావు? అసలే ఆయనకు బట్టలులేవు తొడుక్కున్న జతమాసిపోతే స్కూలుకి శలవు పెట్టాలేమో అంటున్నారాయన పద్దు వ్రాయటానికి ఈ చుట్టుప్రక్కల చదువుకున్న వాళ్ళెవరూ లేరాయె. వెళ్లి...పద్దు వేయటానికి ఆయన్నే పిలు స్కూల్లో వుంటారు" అని చెప్పింది లక్ష్మి.

చాకలి మెల్లగా కదలి స్కూలువైపు బయలుదేరివెళ్లింది. స్కూలంతా నిశ్శబ్దంగా ఉంది పిల్లలందరూ ఉపాధ్యాయులు చెప్పుతున్న పాఠాన్ని శ్రద్ధగా వింటున్నారు. ఉపాధ్యాయుల కంఠాలన్నీ ఒకదాని వెంబడి ఒకటి వినిపిస్తున్నాయి.

రామారావు బోర్డుమీద లెక్క వేసి చెప్తున్నాడు గంగారాం ప్రక్కనున్న గదిలో ఉన్నాడు పిలలకు ఒకలెక్క ఇచ్చి, దానిని చేయమని చెప్పి గదిలో పచార్లు చేస్తున్నాడు గంగారాం.

లెక్క చేస్తున్న రామారావుని చూసి

"బాబుగారూ!" అని పిలిచింది చాకలి,

రామారావు 'ఏం?' అన్నట్లు తలెత్తి చాకలివైపు చూచాడు.

"పద్దు వేయటానికి అమ్మగారు రమ్మంటున్నారు" అంది చాకలి

పిల్లలంతా గొల్లుమని నవ్వేశారు

"పోవే పోపో," అని కోపంగా అరచాడు రామారావు.

రామారావు కోపానికి కారణం తెలియక చాకలి బిక్కమొగం వేసుకొని వెళ్లిపోయింది.

గంగారాం తన గదినుండి బైటకువచ్చి రామారావుని చూచి చిన్న చిరునవ్వు నవ్వేడు.

"స్త్రీకి చదువెందుకుండాలో తెలిసిందా?" అన్నట్లు ప్రతిధ్వనించిందా నవ్వు.

మెల్లగా వచ్చి కుర్చీలో కూలబడ్డాడు రామారావు. పిల్లలు రొదచేస్తున్నారు. అయినా వారిని అదలించేశక్తి ఆసమయంలో అతనికి లేదు.

ఎంత అవమానం? నలభైమంది విద్యార్థుల దగర, అందులో తోటి ఉపాధ్యాయునివద్ద అవమానం అతనికి సహింపరానిదయింది. తనని చూసి గంగారాం నవ్వుతున్నాడు. తననిచూసి విద్యార్థులంతా నవ్వుతున్నారు. ఇంకేమేమో ఆలోచిస్తూ తలపట్టుకొని కుర్చీలో కూర్చుండిపోయాడు రామారావు.

"పాపం, మాస్టరుగారి భార్యకు చదువు రాదు కాబోలు"లంది ప్రక్క బెంచీలో కూర్చున్న ఒకమ్మాయి

"మనకి చదువు నేర్పుతున్నారుగాని, ఆయన భార్యకు చదువు నేర్పలేరు కాబోలు" లని చిన్న నవ్వునవ్వింది ఇంకొకమ్మాయి

"ఉష్. ఊరుకోండమ్మా ఆయనకు వినపడితే బాగుండదు" అని మందలించింది మరో అమ్మాయి.

ఈ మాటలన్నీ రామారావు చెవుల్ని దూసుకుంటూ గాలిలో కలసిపోయాయి. కొంతసేపటికి బెల్ కొట్టేరు. రామారావు మెల్లగా బైటకు నడచాడు.

ద్వారం దాటుతూండగా "చాకలి పద్దు మాష్టారు వెళ్ళిపోతున్నార్రోయ్" అని వెనక బెంచీలోనుండి ఓ విద్యార్థి కేక వేశాడు.

అసలే మతిస్థిరంలేక బాధపడుతున్న రామారావుకి ఈ బిరుదు వినడంతో తల గిర్రున తిరిగింది. భూమి క్రుంగిపోతున్నట్లుగా అనిపించింది మెల్లగా రీడింగ్ రూమ్ లోనికి వెళ్ళిపోయాడు.

స్కూలు విడిచిపెట్టగానే ఇంటికి వెళ్ళి లక్ష్మిమీద విరుచుకుపడ్డాడు. "నీకేం బుద్ధి లేదా?" అని.

కారణం లేకుండా భర్త ఇలా అనడం చూచి లక్ష్మి నిర్ఘాంతపోయింది. "నేనేం చేశాను?" అంది కొంచెం తమాయించుకొని.

"ఏం చేశావని అడుగుతున్నావా? . . ఆ చాకలి దాన్ని స్కూలుకెందుకు పంపించావ్?" అన్నాడు కొంచెం స్వరం హెచ్చించి.

"లేకపోతే పద్దు ఎవరు వ్రాస్తారేమిటి" అనడిగింది లక్ష్మి

"ఎవరూ వ్రాయటానికి లేకపోతే రేపు రమ్మని చెప్పకోవాలి" అతని కంఠంలో ఇంకా కోపం ప్రతిధ్వనిస్తోంది.

"ఆ.. ఇప్పుడు రేపు కాదు ఎల్లుండి వస్తుంది" అంది లక్ష్మి వెటకారంగా.

"ఏంటి?" అనడిగాడు కొంచం స్వరం తగ్గించి.

"రేపు రేవుకి వెళ్తుందట, ఎల్లుండి వస్తానని చెప్పివెళ్ళిపోయింది"

"మరి నా బట్టల మాటో?" అన్నాడు అయోమయంగా.

"అదేమో నాకేం తెలుసు? మీరు బట్టలు గురించి తొందరపడుతున్నారని స్కూలుకి పంపాను. దాన్ని తిట్టి పొమ్మన్నారట మీ బట్టల విషయంలో మీకు లేని తొందర నాకెందుకు?" "నా ఖర్మకొద్దీ దొరికావ్" అనుకుని కాళ్ళీడ్చుకుంటూ చాకలి ఇంటికి వెళ్ళాడు ఆమెని బ్రతిమిలాడి తీసుకువచ్చి బట్టలు వేసుకున్నాడు. లేకపోతే బట్టలు లేని కారణంగా అనవసరంగా స్కూలుకు శెలవు పెట్టవలసి వచ్చేది.

తిరిగి చాకలి బట్టలు ఉతికి తెచ్చేటప్పుడు తనకు కబురు పంపకుండా ఉండటానికి రామారావు ముందే జాగ్రత్త తీసుకున్నాడు. "చాకలి ఇచ్చిన బట్టల్ని లెక్కపెట్టుకుని తీసుకో, నేను వచ్చిన తర్వాత పద్దు చూస్తాను" అని భార్యకు చెప్పి చాకలిని పంపివేశాడు.

చాకలి వెళ్ళిపోయిన తర్వాత,

"ఇవన్నీ ఏమిటండీ, ఇవెందుకు పనికి వస్తాయి?" అనడిగింది లక్ష్మి, గదిలో గుట్టలు గుట్టలుగా పడి ఉన్న కాగితాల కట్టలను చూస్తూ.

రామారావు చిన్న నవ్వు నవ్వి,

"నా ఉద్యోగం ఏమిటో తెలుసా?" అని అడిగాడు.

"అయ్యవారి ఉద్యోగం"

"అవి విద్యార్థుల అన్సరు పేపర్లు"

"ఇవన్నీ అమ్మివేయకూడదూ?"

"అవి అమ్మితే విద్యార్థులు బ్రతకనిస్తారనుకున్నావా? మాస్టారికి కాఫీకి డబ్బులేకపోతే మన ఆన్సరు పేపర్లు అమ్మేశాడని దండోరా వేస్తారు"

"ఇవెందుకూ పనికిరావన్న మాట?"

"...పుస్తకాలు తప్పించి మిగతా కాగితాల్లో ఒక్క కాగితం కూడ పనికిరాదు" అంటూ భోజనానికి లేచాడు రామారావు.

"అయితే, కట్టెలు లేనప్పుడు వీటిని పొయ్యిలో పెట్టుకున్నారా?"

"నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో, ఆకలేస్తుంది వేగం వడ్డించు" అంటూ వంటగది వైపు నడిచాడు రామారావు. లక్ష్మి అతన్ననుసరించింది.

3

రెండు రోజుల తర్వాత చాకలి బట్టలు తీసుకొని వచ్చింది. లక్ష్మి వాటి నన్నిటినీ లెక్కపెట్టుకొని తీసుకుంది. తన బట్టలు తనకు తెలుసు. అందువలన తన బట్టలన్నీ ఉన్నాయో లేదోనని చూసుకుంది. అన్నీ సరిపోయాయి. రామారావు బట్టలు వేరే ఉంచింది.



రష్యన్ సర్కస్‌లో మరొక అద్భుత దృశ్యం.

రామారావు బట్టలు పెట్టుకోటానికి పెట్టె నొకదానిని కేటాయించింది. తన బట్టలు పెట్టుకోటానికి బీరువా తెరచింది. ఆ బీరువా రామారావుది. దానిలో టాయిలెట్ సామానులు, కాగితాలు, పుస్తకాలు మొదలైనవన్నీ పెట్టుకున్నాడు రామారావు. వాటినన్నిటినీ తీసి కిటికీపై ఉంచింది. బీరువా అడుగున కొన్ని కాగితాలున్నాయి.

"హు... బీరువాలో కూడా చెత్త కాగితాలే" అనుకుంటూ వాటిని తీసి క్రింద పారవేసి, బీరువా శుభ్రంగా తుడిచింది. లక్ష్మి తన బట్టలను బీరువాలో సర్దుకుంటుండగా ఇల్లు ఊడ్వటానికి పనిమనిషి వచ్చి గది ఊడ్వటం మొదలు పెట్టింది. క్రిందపడి ఉన్న కాగితాలను చూస్తూ,

"ఇవెందుకూ పనికిరావా అమ్మగారూ?" అని ప్రశ్నించింది పనిమనిషి.

"ఎందుకూ పనికిరావు పారవేయ్" అంది లక్ష్మి.

"పారేయటమెందుకమ్మగారూ, పొయ్యి రాజెయ్యటానికి పనికొస్తా"యంటూ వాటిని తీసుకొని వెళ్ళి పొయ్యి ప్రక్కన పెట్టింది.

* * *

స్కూలు విడిచి పెట్టగానే ఇంటికి రాకుండా పార్కులోనికి వెళ్ళి కూర్చున్నాడు రామారావు. అతని మనస్సేమీ

★ స్త్రీకి చదువెందుకు? ★

బాగుండటం లేదు. అనవసరంగా వచ్చిన ఆ "చాకలిపద్దు మాస్టారు" అనే బిరుదు తలపుకు వచ్చినప్పుడల్లా అతనిగుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. తల కొట్టివేసినట్లుగా బాధపడుతున్నాడు దానిని విద్యార్థులనోటి నుండి రాకుండా చెయ్యటం ఎట్లా? అని ఆలోచిస్తూ కూర్చున్నాడు.

దీనికి మూలకారణం లక్ష్మి. లక్ష్మికి చదువు లేకపోవడం వల్లనే ఇదంతా వచ్చింది. ఉదయం తను, గంగారాం రీడింగ్ రూంలో ఉండగా ఒక కుర్రవాడు చీటీ తెచ్చి గంగారాంకు ఇచ్చాడు. అది అతని భార్యవద్దనుంచే నని తనకు తెలుసు. తన కటువంటి భాగ్యం కలగనందుల కెంతో విచారించాడు. లక్ష్మికి చదువు లేకపోయినా తనను సంతోషపెట్టటాని కెన్నో పనులు చేస్తూంది. అమాయకమైన ఆమె ముఖంచూస్తే తనకు ఎంత కోపం వచ్చినా ఇట్టే దిగజారిపోతుంది. ఏది ఏమయినా, తను మొదట లక్ష్మికి చదువు రాదని తెలిసుండే పెళ్లి చేసుకున్నాడు. అందువలన ఎటువంటి తప్పులొచ్చినా ఆమెను నిందించడం భావ్యంకాదనుకున్నాడు.

కొద్దిగా చీకటి పడగానే ఇంటిముఖం పట్టేడు. రామారావు ఇంటికి వచ్చేసరికి గది శుభ్రంగా వుంది. సామానులన్నీ శుభ్రంగా తుడిచి పెట్టబడి వున్నాయి. లక్ష్మి శుభ్రతకు మెచ్చుకుంటూ దుస్తులు మార్చుకుని కూనిరాగం తీస్తూ కుర్చీలో కూర్చున్నాడు. ఎదురుగా లక్ష్మి బట్టలతో నిండుగా కనపడ్డ బీరువాను చూసి ఆశ్చర్యపోయాడు.

"లక్ష్మి...లక్ష్మి. " అని కేక వేశాడు. పిలుపు విని లక్ష్మి వంటగదిలో నుండి వచ్చింది.

"బీరువాలోని సామానులన్నీ ఎక్కడ పెట్టేవ్?" ఆతృతగా అడిగాడు రామారావు.

"ఇవిగో ఈ కిటికీమీద ఉంచాను " అని చూపించింది లక్ష్మి. రామారావు కుర్చీలో నుండి లేచి కిటికీ వద్దకు వెళ్ళి పుస్తకాలన్నీ ఓసారి గాలించాడు.

"ఏదీ, తాళాలోసారి ఇవ్వు" అనడిగాడు

లక్ష్మి ఇచ్చిన తాళాలు అందుకుని బీరువా తెరచి బట్టలు తొలగించి అడుగున వేటికోసమో వెతకటం మొదలు పెట్టేడు. తను కష్టపడి సర్దుకున్న బట్టల నతడలా చిందర వందర చేస్తుంటే లక్ష్మికి చిరాకెత్తింది

"ఏమిటలా వెతుకుతున్నారు? దానిలో మరింకేమీ లేవు" అన్నది చిరాకుగా

"ఇక్కడ కొన్ని కాగితాలు పెట్టేను, అవి లేవే?"

"కాగితాలా...ఓ, అవా! పారేశాను."

"ఎక్కడ?" గాభరాగాఅడిగాడు రామారావు అతని గాభరా చూసి లక్ష్మి కొద్దిగా జడిసింది.

"ఎక్కడ పారవేశావ్?" గద్దించి అడిగాడు రామారావు.

రామారావు కోపం చూసి లక్ష్మి బిత్తరపోయింది.

"మాటాడవేం?" గర్జించాడు.

లక్ష్మికి పెదిమలు తడబడ్డాయి "కా...ల్చే.. శా.. ను" అంది తడబడుతూ.

రామారావు దెబ్బ తిన్న వాడిలా తల పట్టుకొని కూలబడి పోయాడు.

"అవి పనికివచ్చే కాగితాలా?" మెల్లగా జంకుతూ ప్రశ్నించింది లక్ష్మి

"అవి డిగ్రీ సర్టిఫికేట్లే.. " అంటూపిచ్చివానిలా జుట్టు పీక్కున్నాడు రామారావు.

★

గాఢానురాగం

(గతసంచిక తరవాయి)

౯

ఇంతవరకు అతిశ్రద్ధగా కథ విన్న రత్నావళి ఆత్రంగా అడిగింది

ఆ తరవాత ఏమి జరిగింది?"

అపరాజిత రత్నావళివైపొకమారు పరిశీలనగా చూసి మిగిలిన కథ పూర్తి చేసింది.

"రత్నావళీ! ఇక జరగడానికేమి ఉంది! విక్రమవర్మ భవంతిలోపలి గుమ్మంలో అడుగు పెడుతూనే కాంచనమాలా చంద్రవర్మల మృత శరీరాలకేసి చూసి క్షణకాలం నిశ్చలంగా నిలబడిపోయాడు!

నేనతడు కూడా ఏదైనా సాహసానికి పాల్పడతాడేమోనని అక్కడ నిలబడిన వారందరితోను కొంచెం అతన్ని జాగరూకతతో కనిపెట్టి చూస్తూండవలిసిందని మెల్లిగా హెచ్చరించాను

కాని వారెవరు నా మాట లక్ష్యపెట్టలేదు "పరాయిపురుషుని ఒడిలో ప్రాణాలు విడిచిన భార్య కోసం అంత ప్రాణాలు విడవవలసినంత అగత్యం ఏమి వచ్చింది!"

అని నా మాటని స్సాకారంగా ఈసడించి వేశారు.

నేనప్పుడు వారన్నది నిజమేననీ విక్రమవర్మ కంతగా సాహసించవలసినంత అగత్యమేమీ లేదనీ అనుకొన్నాను అప్పటికి నా మనస్సు కొంచెం కుదుటబడింది

విక్రమవర్మ వైఖరిలో కూడా పెద్దమార్పేమీ గోచరించలేదు. తరవాత ఒకటి రెండు గడియలు గడిచిపోయేసరికతడు కేవలం తటస్థ వైఖరే అవలంబించినట్లు కనిపించాడు

ఒకరిద్దరు దగ్గిర బంధువులతని మీద విరుచుకు పడిన ఆపదకతన్నెంతో ఆప్యాయంగా ఓదార్చబోయారు కాని అతడు వారి ఓదార్పులన్నిటికి చిక్కని చిరునవ్వులతోనే సమాధానాలు చెప్పాడు పైగా అతడే వారినందరినీ ఓదార్చడం మొదలు పెట్టాడు. జరిగినది తనకేమి పట్టనట్టుగా నిర్లిప్తంగా మాట్లాడాడు.

ఇంకొక విచిత్రం! మధ్య మధ్యన మాటల సందర్భంలో ఛలోక్తులు కూడా విసరడం ప్రారంభించాడు భవంతిలో ఉన్న వారంతా కాంచనమాలా చంద్రవర్మల దుర్మరణాలు తలుచుకొని గొంతెత్తి విలపిస్తూంటే స్వయంగా తానే వారినందరినీ ఓదార్చాడు

అతని ధోరణిచూచి నేను నా కళ్ళే నమ్మలేక పోయాననుకో! ఒక్క నేనన్నమాటేమిటి? అక్కడికి వచ్చిన ఇరుగుపొరుగు వారంతా అతని గుండె నిబ్బరం చూచి ఎంతైనా ఆశ్చర్యపోయారు.

చివరికి విక్రమవర్మే స్వయంగా కాంచనమాలా చంద్రవర్మల మృత శరీరాల దహన సంస్కారాలకు కావలసిన ఏర్పాట్లన్నీ చేయించాడు. అవ్వన్నీ అయిపోయిన తరవాత కూడా అతనిలో మార్పేమీ కనిపించలేదు ఆ తరవాత తరవాత అతడు మరింత నిర్లిప్తుడుగా ఉన్నట్లు కనిపించాడు. పరామర్శించడానికి వచ్చిన వారందరితోను నవ్వుతూ మాట్లాడాడు. అంతే గాని ఆ రోజంతా చివరికొక చిన్ని నిట్టూర్పైనా విడిచి పెటలేదు!

"రత్నావళీ! మగవారెంతకైనా తగినవారే! అతడు కనక అలాగ కొండంత

ప్రాచీన గాథాలహరి

ధైర్యంతో నిలబడ్డాడు గాని మరెవరైనా అయితే ఆ క్షణంలోనే గుండె పగిలి చనిపోవలిసిందే! అసలే మగవారిది రాతిగుండె! అందులోను విక్రమవర్మ సంగతి మరి వేరే చెప్పనే అక్కరలేదు!

ఆ వేళ సాయంత్రం మరి భోజనాలెవరికి పయిస్తాయి! అయినా విక్రమవర్మ తన తల్లిదండ్రులు మిగిలిన బంధువులు ఏదేనా కొంచెం ఫలహారమైనా చేసేదాకా విడిచి పెటలేదు ఆనాడు రాత్రి వారంతా విశ్రమించిన దాకా అతడు లోపలికి వెళ్లి విశ్రమించనే లేదు!

అందరు విశ్రమించిన తరవాత నేనుకూడా ఆ భవంతిలో ఒకమూల కొంగు పరుచుకొని పడుకున్నాను నాకారాత్రి తెలవార్లూ నిద్రపటనే లేదు! ఆ వేళ జరిగిన బీభత్సం

పి. గణపతిశాస్త్రి

అంతా నా కళ్లకెదురుగా జరిగిపోతున్నట్లు కనిపించింది

అందులోను విక్రమవర్మ గుండెనిబ్బరం తలుచుకున్న కొద్దీ నాకు మరింత ఆశ్చర్యమేసింది. తరవాత తెల్లతెల్లవారే వేళ నాకొక కోడి కునుకు పట్టింది అలా ఎంత సేపు కన్నుమూశానో నాకే తెలియదు.

హఠాత్తుగా నాకొక పెద్ద మూలుగు వినిపించింది. ఉలిక్కిపడి లేచాను. మొట్టమొదట ఆ మూలుగెక్కడనించి వచ్చిందో తెలియలేదు అంతలో ఆ మూలుగు మరింత దారుణంగా వినిపించింది. అది ఆ పక్క గదిలోనించే బయలుదేరినట్లు వినిపించింది నేనా గదిలోకి పరుగెత్తాను.

అంతలో భవంతిలోని వారంతా ఆ మూలుగువిని అక్కడికి పరిగెత్తుకువచ్చారు. మా కళ్ళకెదురుగా విక్రమవర్మ రక్తం మడుగులోపడి అటు ఇటు దొరలుతున్నాడు గుండెలో దంతపు పిడివరకు అతని చేతిబాకు గుచ్చుకుపోయింది క్షణంలో మాకందంతా భోధపడిపోయింది.

కొందరు తొందర తొందరగా వైద్యులకోసం పరుగులు పెట్టారు మరికొందరు కాళ్లాడక అక్కడే కూలబడిపోయారు

విక్రమవర్మ తల్లిదండ్రులిద్దరు అతనిమీదికి ఒరిగి కంటికీ మంటికీ ఏకధారగా విలపించడం మొదలు పెట్టారు పాపం అతని తల్లి అతని దారుణ సాహసానికెంత విలపించిందని!

"నాయనా నీవింతపని చేస్తావని కలలో కూడా అనుకోలేదురా!" అని ఏమేమో జ్ఞాపకం తెచ్చుకొని అనేకవిధాల వలవలా వాపోయింది నేనామె పక్కన కూర్చుని ఎన్నోవిధాల ఓదార్చాను.

పాపం! విక్రమవర్మ కంతవరకు శరీరం మీది స్పృహ తప్పిపోలేదు. అలాగే కళ్ళప్పగించి కొంతసేపటివరకు రెప్పవాల్చకుండా తల్లివైపు చూచాడు తరవాత లోలోపలికి మునిగిపోతున్న క్షీణస్వరంతో ఆమె నోదార్చాడు. తరవాత ఒక్క నిట్టూర్పు విడిచి పెట్టాడు:

"అమ్మా! కాంచనమాలే లేకపోయిన తరువాత మరి నేను బ్రతికినా ప్రయోజనమేమిటి?"

ఆ తరవాత అతని కనుగొలుకులలో రెండు

కన్నీటిబిందువులు జారాయి అతని చుట్టూ ఉన్నవారా మాటలు విని అతనికి సంధిం చిందని అనుకున్నారు.

తరవాత క్రమక్రమంగా అతనికి స్పృహ తప్పిపోయింది. వైద్యులువచ్చి శాయశక్తులా వైద్యాలు చేశారుగాని అప్పటికే శరీరం లోని రక్తం అంతా బాగా క్షీణించి పోయింది. వైద్యులు వచ్చిన తరవాత అతి డ్తోక అరగడియకన్న ఎక్కువసేపు జీవించ లేదు.

నేను నాచేతులారా పెంచిన కాంచన మాల జీవితంఅంతా చిట్టచివరికి అవిధంగా తెల్లవారిపోయింది ఆ ఇద్దరకూడా చివరి కలాగ దారుణ మృత్యువుపాలై పోయారు.

౧౦

అని అపరాజిత ఒక్క వేడినిట్టూర్పు విడిచి రత్నావళి ముఖం కేసి చూస్తూ కూర్చుండిపోయింది. అలాగ ఒక నిమిషం సేపు మౌనం అవలంబించి మెల్లిగా అడి గింది:

"రత్నావళీ! నేను చెప్పినకథఅంతా తు. చ. తప్పకుండా జాగ్రత్తగా విన్నావా?"

"ఆ విన్నాను."

"అయితే అడగనా ?"

"ఏమిటది?"

"కథ చెప్పినతరవాత నిన్ను కొన్ని ప్రశ్న లడుగుతానని అన్నానుగా! అప్పుడే అదంతా మరిచిపోయావా ?"

ఆ మాటతో రత్నావళి వెన్నుపై ఎవరో గట్టిగా చరిచినట్లయింది అంతవరకు అత్యా సక్తితో ఆ కథ ఆలకిస్తున్న రత్నావళికి కథా ప్రారంభానికి మొట్టమొదట అనుకున్న విష యాలన్నీ హఠాత్తుగా స్ఫురణకువచ్చాయి:

"ఔనౌను! మరిచిపోయాను. అన్నట్లు ఈ ప్రశ్నలన్నీ ఎంతసేపు పడతాయి?"

"ఎంతోసేపా ? అసలు నిన్నింక అడిగేది ఒకేఒక ప్రశ్న. అంతే!"

"అయితే నేను పరీక్షలో నెగ్గినపక్షంలో నీ వన్నమాట తప్పకుండా నిలబెట్టుకోవాలి మరి!"

అని రత్నావళి బింకంగా అపరాజితకేసి చూసి గట్టిగా రొక్కాయించింది:

"ఓ అలాగే! తప్పకుండా నామాట నిల బెట్టుకుంటాను నేను మాట ఇచ్చినట్టుగా స్వయంగా నిన్ను నాగరక్షేషి శయ్యా గారం ద్వారందాకా తీసుకుపోతాను ఒక వేళ ఈ పరీక్షలో ఓడిపోయిన పక్షంలో నీవు నీవన్నమాట నిలబెట్టుకుంటావా?"

"అందుకు సందేహమేమిటి? తప్పకుండా అలాగే నిలబెట్టుకుంటాను."

"ముమ్మాటికీ నిశ్చయమేనా ?"

అపరాజిత మరింతగా రొక్కాయించి అడిగింది.

"ఆ ముమ్మాటికీ నిజమే !"

"అయితే పరీక్ష చెయ్యనా?"

"చెయ్యి!"

అని రత్నావళి మేలిముసుగు నఖశిఖపర్యం తము కప్పుకుని బింకంగా కూర్చుంది. అపరా జిత పరీక్షించింది:

"రత్నావళీ! నేను చెప్పినకథ అంతా జాగ్రత్తగా విన్నావుగదా! కాంచనమాలా చంద్రవర్మ విక్రమవర్మల అనురాగాలలో ఎవరిది గాఢానురాగమో కొంచెంఆలోచించి సమాధానం చెప్పగలవా?"

"చెబితే!"

"నీ పరీక్ష అయిపోయిందన్నమాటే! నీది గాఢానురాగమన్నమాటే! నీవే పరీక్షలో నెగ్గావన్నమాటే!"

"అంతేనా?"

"అంతే!"

తరవాత రత్నావళి ఒక క్షణకాలం ఆలో చించి పకపకా నవ్వింది.

"ఎందుకలాగ నవ్వుతావు?" అని అపరా జిత ఎంతో ఆశ్చర్యంగా అడిగింది. రత్నా వళి సమాధానం చెప్పింది:

"ఏమిలేదు! ఇంత చిన్న ప్రశ్నకోసం నీవు చేసిన ఆర్భాటం తెలుసుకుంటే నాకు నవ్వాగలేదు!"

"నిజమే! నీవన్నట్టు నేనడిగింది చాలా చిన్న ప్రశ్నే పోనీ దానికేనా సమాధానం చెబితే చాలులే! త్వరగా సమాధానం చెప్పాలి మరి!"

రత్నావళి కనురెప్పపాటు లేకుండా అపరాజితకేసి చూస్తూ సమాధానం చెప్పింది:

"దీనిలో అంతలోతుగా ఆలోచించవల సింది ఏముంది. ఆ ముగ్గురి అనురాగాల లోను కాంచనమాలదే గాఢానురాగం! అవునా?"

"ఎందుచేత?"

అపరాజిత సూటిగా అడిగింది.

"ఎందుచేతేమిటి? ముందుగా నేను చెప్పిన సమాధానం అవునో కాదో తేల్చి చెబితేనే గాని నేను నా కారణం చెప్పదలుచు కోలేదు! ముందుగా నే నడిగిన దానికి సమాధానం చెప్పు" అని అపరాజిత సమాధానం చెప్పేదాక రత్నావళి అలాగే బుంగమూతి పెట్టుకుని కూర్చుంది.

అపరాజిత ఒక్క నవ్వు నవ్వి క్షణ కాలం అలాగే మౌనం అవలంబించి సమా ధానం చెప్పింది

"వెర్రి దానా! నీవు చెప్పినవానికి కారణ మేదో చెప్పనిదే నీది సరియైన సమాధానం అవునో కాదో నిరయించడ మెలాగ?అందు చేత నే ముందుగా నిన్ను కారణం చెప్పమని అడుగుతున్నాను! తెలిసిందా?"

అని గద్దించి అడిగింది రత్నావళికిక సమాధానం చెప్పక తప్పలేదు

"ఓహో! అలాగా అయితే ,చెబుతున్నాను వినుమరి! ఇంకొకరి మీద ఎంతటి అనురాగం కలిగినా మనం అదంతా అతిగుంభనగా దాచివేసుకుంటాము. కాంచనమాల వంటి శీలవతి తన భాగ్యభోగ్యాలు గౌరవ మర్యాదలు, అన్నీ విడిచివేసి చంద్రవర్మనావిధంగా వలచింపంటే అది ఎంతో గొప్ప గాఢానురాగమై ఉండాలి

అదిగాక అంతఆప్యాయంగా చూచుకునే భర ఉన్నా చంద్రవర్మపై అనురాగం కొదీ పంచప్రాణాలు అలాగ తృణప్రాయంగా విడిచివేసిందంటే, అది ఎంతో గొప్పఅనురాగమై ఉండాలి అందుచేతనే అమ్మగ్గరిలోను అమెదే గాఢానురాగమని అన్నాను దానికేమిగాని,నిజంగా కాంచనమాల చాలా అదృష్టవంతురాలు! మనసారా వలచిన వారి ఒడిలో హాయిగా కళ్లు మూసే మహాభాగ్యం ఎంతమందికి కలుగుతుందీ!"

అని రత్నావళి ఇంకా ఏదో మాట్లాడబోయింది. అంతలో అపరాజిత హఠాత్తుగా ప్రశ్నించింది

"రత్నావళీ! సరేలే! దానికేమి! పోనీ నీహృదయంలో నాగరశ్రేష్ఠిమీదఅంతగొప్ప గాఢానురాగము కలిగిందని గుండె మీద చెయ్యివేసుకుని చెప్పగలవా?" ఆప్రశ్నతో రత్నావళి కెక్కడలేని ఉక్రోషము పొడుచుకొచ్చింది.

"అదేమున్నమాట! ఎవరి అనురాగం వారిది? దీనిలో ఒకరితో సాపత్య మేమిటి? .. దానికేంగాని ముందుగా నేనడిగినదానికి సమాధానం చెప్పు! నేను నీ పరీక్షలో గెలిచానా? లేదా?... లేనిపోని ప్రశ్నలతో కాలయాపన చెయ్యాలని చూస్తున్నావా? నేనామాత్రం గ్రహించలేననుకొన్నావా? ముందుగా నా ప్రశ్నకు సమాధానం చెప్పు!"

అపరాజితకిక సమాధానం చెప్పక తప్పలేదు.

"రత్నావళీ! నీ సమాధానం తప్పిపోయింది! నీవుపరీక్షలో పూర్తిగా ఓడిపోయావు!"

"ఎందుచేత?"

"కారణం చెప్పి అది నీచేతే ఒప్పిస్తాను! చెప్పమన్నావా?"

★ గాఢానురాగం ★

అని అపరాజిత మరింత బింకంగా రత్నావళిని బెదిరించింది.

ఆ బెదిరింపుతో రత్నావళి బాగా కంగారు పడిపోయింది ఎలాగో అలాగ నెగ్గి తీరాలనే తొందరలో బాగా ఆలోచించకుండా గబగబా నోటికి వచ్చినట్లు మాట్లాడింది

'అపరాజితా! అన్నట్టు కంగారుపడిపోయాను. కాంచనమాలది గాఢానురాగం కాదు చంద్రవర్మదే గాఢానురాగం. మొదటే చెప్పవలసిందిగాని కొంచెం పొరబాటు పడిపోయాను ”

అని అపరాజిత చేతులు పట్టుకుని బతిమాలింది అపరాజిత పకపకా నవ్వింది.

“రత్నావళీ! పోనీ అనుకుంటే ఈ సమాధానంలో కూడా తప్పిపోయావు! చంద్రవర్మదికూడా గాఢానురాగం కానేకాదు! ఆ ముగ్గురిలోను విక్రమవర్మదే గాఢానురాగం!”

రత్నావళి ఆ సమాధానంతో అప్పుడే నిద్రమేలుకొన్నట్లుగా నిర్ఘాంతపోయింది.

“ఎందుచేత? సరియైన కారణం చెబితేనే గాని నేను నీమాట నమ్మేదిలేదు!”

“సరియైన కారణమే చెబుతాను! అది నీచేతే ఒప్పిస్తాను అంతలోనే కంగారు పడిపోతావెందుకు! ఆ కారణం చెబుతున్నాను విను

“నిజంగా నీవు చెప్పినట్లు కాంచనమాల అనురాగం చాలా గొప్పదే! చంద్రవర్మ అనురాగంకూడా ఇంచుమించుగా అలాంటిదే

కాని వారిద్దరికీ చిన్నప్పటినించీ ఒకరొకరిమీద బాగా అనురాగం కలిగింది. అందుచేత వారిద్దరు ఒకరొకరికోసం ప్రాణత్యాగం చెయ్యడంలో అంతగా విడ్డూరమేమీ లేదు!

మరి విక్రమవర్మమాట! అతనికి మొట్టమొదట కాంచనమాలకు తనపై అంతగా అనురాగంలేదన్నమాట తెలుసును! అయినా అతడామెనే వివాహంచేసుకోవాలని పట్టుపట్టాడు

తరవాత రుగ్మతిసమయంలో కాంచనమాలకు చంద్రవర్మపై కలిగిన మమకారం అంతా అతనికి స్పష్టంగా తెలిసిపోయింది. అయినా అతని అనురాగం అణువంతైనా తగ్గిపోలేదు

చివరికామె చంద్రవర్మకోసం ప్రాణాలు విడిచివేసినా అతని అనురాగం పిసమంతైనా తగ్గలేదు పైగా ఆమె లేకపోతే అతనికిక జీవితమే దుర్భరమని అనిపించింది కాంచనమాల చంద్రవర్మపై ఎంతటి మమకారం చూపించినా విక్రమవర్మ ఎన్నడు విసుక్కోనైనా విసుక్కోలేదు! బ్రతికి ఉన్నంతకాలము ఒక్కనాడు ఆమె మనస్సు నొప్పించలేదు

రత్నావళీ! కాంచనమాలా చంద్రవర్మల వంటి వారిప్రపంచంలో ఎంతమందైనా కనిపిస్తారు కాని విక్రమవర్మలాగ భార్యయెడల అనూయాలేశమైనాలేని అకళంక ప్రేమతో ప్రవర్తించేవారు చాలా అరుదుగాఉంటారు అందుచేతనే అతనిది అందరికన్నా ఘనమైన గాఢానురాగమని అన్నాను తెలిసిందా? ఇంతకీ నేను చెప్పిన కారణంనీకు నచ్చిందా?”

అది విన్నతరవాత రత్నావళి వంచిన తల మరి మళ్లీ పైకెత్తలేదు చిట్టచివరికొక నిట్టూర్పు విడిచిపెట్టింది.

“అపరాజితా! నీ వన్నది నిజమేగాని నేనక్కడికి వెళ్ళకుండా చెయ్యడానికే నీ వింత పెద్ద పన్నాగం పన్నావు! ఆ పన్నాగం అంతా నాకీక్షణంలో తెలిసి పోయిందిలే ”

అని రుసరుసలాడింది. అపరాజిత దానికి కూడా వెనువెంటనే సమాధానం చెప్పివేసింది:

“రత్నావళీ! నీ వన్నట్లు నేను నిన్ను మోసగించడానికే ఈ కథ చెప్పి నిన్నలా పరీక్షలో ఓడించాననుకో! నిజంగా నీ మనస్సులో నాగరశ్రేష్ఠిమీద అంత వల్లమాలిన మమకారమే కుదిరితే చిన్నపిల్లలాగ నేను చెప్పే కథంతా ఇలాగ వింటూ కూర్చుంటావా? నామాటవినకుండానెంటనే అక్కడికి పరిగెత్తి ఉందువు! అగ లేక పోవడం వల్లనే అలాగ ఈ కథ అంతా చెవులొగ్గి వింటూ కూర్చున్నావు అంతే!”

దానితో రత్నావళికిక తిత్తో పెట్టి గుండెల్లో పొడిచినటయింది

నిజమేగాని 'నాకు నీవు చెప్పినదంతా వినగానే ఈక్షణంలోనే బయలుదేరి నాగరశ్రేష్ఠి భవంతికి వెళ్లిపోవాలని సంకల్పం బయలు దేరింది. ఇక నీవేమి చెప్పినాసరే! నేనన్న మాట తప్పినా సరే! నేనిప్పుడే బయలుదేరి వెళ్లిపోతున్నాను ”

అని రత్నావళి తటాలున లేచినిలబడింది. అపరాజిత అలాగే కూర్చుని ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని కలకలా నవ్వింది.

రత్నావళి ఆశ్చర్యపోయింది

“ఎందుకలాగ నవ్వుతున్నావు!”

“ఏమీ లేదు స్వామి కల్యాణమహోత్సవం అంతా అయిపోయింది ఆ పైన మంగళసూత్రధారణం కూడా జరిగిపోయింది. నీ సంకేత సమయం దాటి పోయి అప్పుడే అరగడియ కావచ్చింది అయినా నీవీ విషయం గమనించనే లేదు! దీన్నిబట్టి కూడా నీ అనురాగం ఎలాంటిదో తెలిసిపోయింది కాని నీ మాటలు చూస్తే మాత్రం కోటలు దాటిపోతున్నాయి అదిగో స్వామి కళ్యాణమహోత్సవం ఊరేగింపప్పుడే మన ఇంటి ఎదటికివచ్చి వేసింది! అదిగో చూడు! ఇంత మంది జనంలోను, ఈ కాగడాల వెలుతురులోను ఇంకెక్కడికి వెడతావు!”

ఆ ఉత్సవం చూచి రత్నావళి అలాగే అపరాజిత దగ్గరకూలబడిపోయింది

“పోనీలే! ఇంత మాత్రంతో మించిపోయిందేముంది? ఈ వేళ కాకపోతే మరొకప్పుడు!” అని బింకంగా మూతి బిగించి ఆ ఉత్సవంకేసి చూసింది అయినా అపరాజిత అంతటతో విడిచిపెటలేదు.

“రత్నావళీ! మీ ఆయన నాలుగైదు రోజులలో ఎటంట అడుగుపెట్టే సరికి ఇవ్వన్నీ ఇట్టే మరిచిపోతావు! ఇంత వరకు నేను చెప్పినదేదీ తప్పిపోలేదు! చివరికి ఇకే అంతే అవుతుంది!”

అని వ్యంగ్యంగా రత్నావళికేసి చూచి నవ్వింది

రత్నావళి పూర్తిగా పరాజయం పొందినా పైకి అపరాజితలాగే నటిస్తూ ఊరుకుముని గట్టిగానిట్టూర్చింది.

క్షణంలో స్వామి కళ్యాణోత్సవం కాగడాలవెలుగుతో వారిద్దరి ముఖాలమీదజాజ్వల్యమానంగా వెలుగుతూ తళతళా మెరిసిపోయాయి

—అయిపోయింది.

స్కెచ్:

ఆడబడుచులూ-ఆడంబరాలు

"సుజనశ్రీ"

"ఆ దేమిటమ్మా! అసలు మన పెద్దాడబడుచుకు మొగుడు పొద్దుపోయి ఇంటికివస్తే సరిగా ప్రక్క వేయటంకూడా తెలీదు!"

"రెండో ఆవిడమాత్రం తీసిపోయిం దేమిటి? మొగుడికి సెలవు దొరక్కపోతే తనొక్కతే చక్కావచ్చేసింది!"

"ఆఁ అసలా ఆడసంతానమంతా అంతే. ఆ మూడో ఆవిడమాత్రం చూడరాదూ! రెండురోజుల ముందరొస్తే పని చెయ్యాల్సి వస్తుందని ఎత్తువేసింది సరిగ్గా గృహప్రవేశం ముహూర్తానికి అరగంట ముందుగా దిగింది"

తోడికోడళ్లిద్దరూ మంచినీళ్ళబావిదగ్గర బిందెలు చంకన పెట్టుకుని గుసగుసలు చెప్పుకుంటూ ఇంటిత్రోవపట్టారు. దోవలో వంటమనిషి వెంకాయమ్మ ఎదురుపడింది

"ఏం రాజమ్మా! మీఇంట్లో ఇవాళ వంటకి రమ్మంటుందేమో మీ అత్తగార్ని కనుక్కుని చెప్పమ్మా!" అన్నది

"సరేలే!" అని ఆవిడ దాటిపోయిం తర్వాత ఇద్దరూ మాటలు విరుచుకుని పగలబడి నవ్వుకున్నారు

"నలుగురు తోడికోడళ్ళూ, ముగ్గురు కూతుళ్లు కలిసి అత్తగారిఅలుసు వంటబోతుంటే, నువ్వుకూడా కలయబెట్టాలేం!" అన్నది పెద్దకోడలు కాంతమ్మ.

"బాగా చెప్పావు!" అని చటుక్కుతిరిగి వెంకాయమ్మవేపు చూసి ఒక్క నవ్వు నవ్వింది రాజమ్మ కాంతమ్మకూడ ఆమెతో శ్రుతికలిపింది.

ఇద్దరూ ఇంటిగడపలో అడుగు పెట్టంగానే రెండో ఆడబడుచు స్వాగతం పలికింది. "రండమ్మా రండి! మీ కోసమే చూస్తున్నాను బోలెడన్ని అంట్లుపడి ఉన్నాయి తోమాల్సినవి"

ఇద్దరిముఖాలు నల్లబడినై ఒక్కసారే "మాకోసం కాచుకుని కూర్చోకబోతే తోమటం మొదలెడితే ఈపాటికి సగమైపోయేవిగా!" అన్నది కాంతమ్మ

"ఇంకా ఇద్దరూ ఏంచేస్తున్నట్టు పని అంతా మాకే పెరపెట్టకబోతే!" అన్నది కాంతమ్మ

ఇంట్లో ఒకమూల ఏదోపనిచేస్తున్న మరిద్దరు కోడళ్లుకూడా నోరుచేసుకున్నారు.

"మేమేం ఊరికే కూచోవటం లేదమ్మోయ్ మేమూ మీకంటె ఎక్కువగానే ఒళ్లువిరుచుకుని పనిచేస్తున్నాం!" అన్నారిద్దరూ పందపాళీలో కూర్చుని పేపరుచదువుకుంటున్న పరంధామయ్యకూ, ఆయన నలుగురు కొడుకులకూకూడా కష్టమేసింది వీళ్ళసాధింపులు వినేసరికి

"సరేలే! సాయంత్రం తీరిగ్గా తిన్నదరిగేదాకా పోట్లాడుకోవచ్చుగాని పని కానివ్వండి. కాంతమ్మొదినా నువ్వూ రాజమ్మా పెద్దచెల్లెలు, మీరు ముగ్గురూ అంట్లపని చూడండి ఇదిగో విజయలక్ష్మీ నువ్వు ఇల్లు సర్దేసి ఆపైన బూజు ఊడ్చెయ్యి ఇక సీతమ్మా, నువ్వేమో మడిబట్టలు ఉతికి ఆరెయ్యి నేనూ శకుంతలా వంటపని చూస్తాం!" అని అందరికీ పనులు పురమాయించి తరూతీర్చి అందర్నీ తలో మూలకి పంపింది ఇంటి పెద్దకూతురు శ్యామల. ఆమె తను తమ భార్యలమీద పెత్తనం చేస్తూంటుం వింటుంటే నలుగురి కొడుకుల మనస్సులు ఎంత బాధపడ్డయ్యో ఆదేవుడికెరుక. కట్నం డబ్బు పూర్తిగా రాలేదనీ, పండగ మామూలు ముట్టలేదనీ, మామగారు కనీసం తనకు వులెన్ సూటు కుట్టించలేదనీ, పెళ్ళిలో రేడియో కొనివ్వని కారణంగానూ తమ భార్యల్ని ఒకానొక సమయంలో బాధవన్నిన కుమారులకు ఈనాడు తమభార్యలు ఇంట్లో పనిచేసి అరిగిపోతున్నారే అనే బాధ కలిగిందంటే అది ప్రకృతి సహజమే మరి

దొడ్లో అంట్లుతోమే చోటకోడళ్ళిద్దరూ ఒకచోట కూర్చుని ముచ్చటలాడుకుంటూ మెల్లిగా అంట్లు తోముతున్నారు ఇది రెండో కూతురు వరమ్మకు కంటకమయింది. చివరికి ఉండబట్టలేక "కానివ్వండమ్మా! తర్వాత చెప్పుకోవచ్చు ముచ్చట్లు అవతల తొందరగా ఉంది!"

"అబ్బో ఏం దెప్పుతావులే వదినా! నీకు మల్లె మాకు పని చేతగాదుగా మరి!"

"మీకు పని చేతగాదని నేనన్నానా? పని కానివ్వండంటే అంత ఉలుకెందుకు!"

"ఉలుకులేదు ఏంలేదు. అసలు మేమేం చేశామని అంటం! మేం మాత్రం అంట్లు తోమటంలా?"

ఇంతలో ఇంటి యజమానురాలు పరంధామయ్యగారి సతి మంగాయమ్మ అటు వచ్చింది.

"ఇదిగో మీరు పెద్దవాళ్లుగదా, ఇంటికి పెద్ద కోడళ్ళుగదా, ఇల్లు చక్కదిద్దాల్సింది పోయి మీరే పోట్లాడితే ఎలా? ఏదో అది చిన్నది అన్నదే అనుకోండి!"

కోడళ్ళిద్దరూ మూతి బిగించుకుని మసి కూడా సరిగా పోకుండా అంట్లు తోమి అవతల పెట్టి, జారుకున్నారు ఇంట్లో ఒక మూలకి

"అది సరేగాని అక్కయ్యా! మరి సత్యనారాయణ వ్రతానికి పీటలమీద ఎవరు కూర్చుంటారు?"

"అదే తెలీకుండా ఉన్నదమ్మా అదిగో పెద్దొదిన ఇటు వస్తున్నది అడుగుదాం ఉండు ఇదిగో వదినా పీటలమీద ఎవరు కూర్చుంటారు?"

"ఎవరేమిటి? ఇంటికి పెద్దలు మా అమ్మా నాన్ననూ!" అని మళ్ళీ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"అయితే వాళ్ళిద్దరే కూర్చుంటారన్న మాట!" అని నోరు నొక్కుకున్నది రాజమ్మ.

'మావారికి బొత్తిగా ఆలోచనే లేదు. రెండు నెలలక్రితం మొక్కుకున్నాం. మావారికి ప్రమోషన్‌వస్తే సత్యనారాయణ వ్రతం చేసుకుంటామని ఆ మొక్కుబడి ఇప్పుడే చెల్లించుకుంటే ఖర్చులో ఖర్చు కలిసొస్తుందిగా!" అన్నది పెద్దకోడలు కాంతమ్మ.

"నాకూ మనసుగానే ఉందమ్మా! అసలీ వ్రతం నా పెళ్ళప్పుడే చేసుకోవాలనుకున్నాం. అడుగుతానుండు మామరదిగార్ని" అని కిటికీదగ్గరకు వెళ్ళింది. బయట మంచం మీద కూర్చున్న రెండోకొడుకు భార్యను చూసి లోపలికి వచ్చాడు దొడ్లోకి వెళ్ళి చిక్కుడుచెట్టు చాటుకి తీసుకెళ్ళి తనకోరిక వెలిబుచ్చింది రాజమ్మ.

★ ఆడబడుచులూ-ఆడంబరాలు ★

"దానికి నన్నడిగితే ఏంలాభం? మాఅమ్మ నడుగు. నేనుమాత్రం మానాన్నను అడగను" అన్నాడు.

రాజమ్మ ముఖం చిట్లించుకుని లోపలికి వచ్చేసింది. రెండోకొడుకు కాంతారావు వెళ్లి మళ్లీ మంచంమీద కూలబడ్డాడు. ఇంతలో ఇంటి యజమానురాలు మంగాయమ్మ మధ్యహాలులోకి వచ్చింది.

"ఇదుగో అత్తయ్యగారూ! మాఇద్దరికీ గూడ పీటలమీద కూర్చోవాలని ఉంది ఇద్దరికీగూడ మొక్కుబళ్లున్నయ్యండీ!" అన్నది రాజమ్మ

"మరి మీరిద్దరు కూర్చుంటే మిగతా ఇద్దరి సంగతేమిటి?"

ఈ సమావేశాన్ని చూసి మిగతా ఇద్దరు కోడళ్లుగూడ వచ్చారు.

"నాకూ మొక్కుబడి ఉన్నదండీ మీ అబ్బాయిగారికి నల్గొండకు ట్రాన్స్‌ఫర్ కాకుండాఉంటే వ్రతం చేసుకుంటానని మొక్కుకున్నానండీ!"

"నేనూ మొన్న మీ అబ్బాయిగారికి 104 డిగ్రీల జ్వరం వస్తే ఆభయంలో మొక్కుకున్నానండి వ్రతం చేస్తామని"

ఇద్దరూ తమతమ మొరలు విన్నవించుకునే లోగా పెద్దకూతురు, ఇంటి మేనేజిమెంటు అధికారిణి అయిన శ్యామల వచ్చింది "ఏమిటీ సమావేశం అంటూ!"

"ఎట్లా, ఇప్పుడు నలుగురు కోడళ్లకూ మొక్కుబళ్లున్నయ్యట"

"సరే ఇది మరీబాగుంది. నాకూ, నా చిన్నచెల్లెలు శకుంతలకీ ఇద్దరికీ బయటుండే నెల. మీరంతా పీటలమీదజేరి మేమిద్దరం బయటజేరామంటే ఉంటుంది తమాషా!" సమస్యా పరిష్కారం చేసింది శ్యామల

నలుగురుకోడళ్ళ ముఖాలు వాడిపోయినై. శ్యామల వంటింట్లోకి వెళ్ళిపోయింది. మంగాయమ్మ వ్రతానికి కావాల్సిన సరంజామా సిద్ధంచేయటంలో నిమగ్నురాలైంది. కోడళ్లుమాత్రం ఎట్లాఉన్నవారు అట్లాగే ఉండిపోయారు

"అరేయ్! ఎవరో ఒకరువెళ్ళి పురోహితుణ్ణి కేకేసుకురండిరా! "పేపర్లో పేజీ తిప్పుతూ అన్నాడు పరంధామయ్య.

"సుబ్బులూ వెళ్లిరారా" పెద్దకొడుకు! తండ్రి అజ్ఞను చిన్నతమ్ముడికి అందించాడు. ఉరుము ఉరిమి మంగలంమీద పడ్డట్టు భార్య అరిగిపోతున్నదేమో-కనీసం ఇప్పటికి సగమైపోయి ఉంటుందేమో - అనే ఆలోచనలో ఉన్న సుబ్రహ్మణ్యం అయిష్టంగానే లేచి బయలుదేరి వెళ్లాడు

ఇంటిముందుగా పోతున్న ఆసామీ ఒకడు నోట్లోనుంచి చుట్టతీసి "గృహప్రవేశమైనా రేమండీ!" అనడిగాడు,

"ఆ. ఆ ..తెల్లవారుజామున నాల్గుగంటలకు కొంచెం సేపైన తర్వాత వచ్చిపోతీరిగ్గా ఉంటే!" అన్నాడు పరంధామయ్య "ఓ! దానికేంలెండి!" అంటూ వెళ్ళిపోయాడతడు

*　　*　　*

భోజనాల ముందునుంచి ఆడబడుచులూ, వదినెలూ లేచేసరికి మధ్యాహ్నం రెండైయింది. ఎంగిళ్లెత్తేసి తలా ఒక మూల చాప తీసుకుని నడుంవాల్చారు. కూతుళ్ళంతా గురకపెట్టి నిద్రపోతుంటే, మరో మూల కోడళు నలుగురూ ముచ్చట్లు చెప్పుకున్నారు. వాకిట్లో పరంధామయ్య గుర్రుపెటి నిద్రపోతుంటే కొడుకులు నలుగురూ సాయంత్రం ప్రోగ్రామేమిటో నిర్ణయించుకుంటూ కూర్చున్నారు. ముగ్గురికి మాత్రం మనసులో సినిమాకు వెళ్ళాలనే ఉంది కాని అది బయటకు వెళ్లగక్కితే మిగతావారి టిక్కెట్ల ఖర్చంతా తాను భరించాల్సి వస్తుందనే భయంతో ఎవరికివారు గప్‌చిప్‌గా ఊరుకున్నారు. ఏదో నెపంతో సతీసమేతంగా ఇంట్లోనుంచి బయటపడితే ఆపైన సురక్షితంగా హాల్లో కుర్చీలో కూలబడవచ్చు అనుకున్నారు ఆ ముగ్గురూ. కాని రెండో కొడుక్కుమాత్రం వీళ్ళంతా ఇంట్లోంచి వెళ్లిపోయి తనూ, తన భార్య మిగిలిపోతే బాగుం

(43 వ పేజీ చూడండి)

మంత్రం, మందు - ఏదిముందు ?

ఆంధ్రపత్రిక వారపత్రికలో (5-12-56) "మంత్రాలు-నమ్మకాలు" అన్న శీర్షిక క్రింద శ్రీ నమశ్శివాయ గారి లేఖ చూశాను. డిఫ్తీరియా మంత్రాలతో పోగొట్టారని అనగానే నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

మంత్రాలతో జబ్బులు బాగు చేయవచ్చునని అంటారు, సరే! కాని మంత్రగాళ్ళ దగ్గరికి వచ్చేముందు ఇంకేవయినా మందులు పుచ్చుకున్నారేమో గమనించరు గమనించినా, వారి దగ్గరకు మంత్రాలకి వచ్చేవాళ్లలో ఎంతమంది బ్రతికారు, ఎంతమంది మరణించారు—అది చెప్పరేం? ఏదో వచ్చిన వాళ్ళందరిలోను ఒకరో ఇద్దరో (ఏదో కారణంగా) బతికినందువల్ల "చూశారా—మంత్రాలవల్ల జబ్బు తగ్గింది" అనడం అవివేకం

శ్రీ నమశ్శివాయగారు చెప్పిన కేసులో అంటిడిఫ్తీరిక్ సీరమ్ ఇచ్చారని వారే చెప్తున్నారు. (అది దగ్గర దగర 20 రూ॥ ఉంటుంది) అది ఇస్తే ఎలాగూ 5, 6 రోజుల్లో తగుతుంది. ఆ మందు ఇచ్చి, ఆ మర్నాడు మధ్యాహ్నం మంత్రం వేసి చూశారా మంత్రం మహిమఅంటే—ఏం చెయ్యగలం? డిఫ్తీరియా నిమిషాల మీద ప్రాకిపోయే అంటువ్యాధి. అందుకనే రోగిని ఆస్పత్రిలో కూడా ఉండనివ్వరు. దానికి అంటిడిఫ్తీరిక్ సీరమ్ ఇవ్వకుండా మంత్రాలతో తగ్గించగలవారు ఉంటే—అంతకన్నా కావాల్సిందేముంది? అలా డిఫ్తీరియా మంత్రాలతో తగ్గేవ్యాధి కాదు. నేనావిషయం మాత్రం నమ్మకంగా చెప్పగలను. అనాది నుంచి వస్తున్న ఆయుర్వేదంలో కూడా మంత్రచికిత్స గూర్చి ప్రస్తావన లేదు. మంత్రాలు మానవుడిమీద మానసికంగా మాత్రం పనిచేస్తాయి. (అందుకనే వాటిని నమ్ముతున్నాం) అంతేగాని వారు చెప్పినట్లు డిఫ్తీరియాల్ని, క్షయలని, కాన్సర్లని తగ్గించలేవు. అథవా పని చేసినా యనుకొన్నా మంత్రాలకి వచ్చినవారిలో ఎంతమంది బ్రతికారో తెలియపరిస్తే సంతోషిస్తాను.

మోచర్ల అనిరుద్ధరావు,
—మద్రాసు.

* * *

మా నాన్నగారి మంత్రాలు

మంత్రాలకి చింతకాయలు రాలవనే సామెతలో ఏమీ యథార్థం లేదు. అందుకు నిదర్శనం ప్రతిరోజూ మా యింటికి మంత్రాలకోసం మా నాన్నగారి దగ్గరకు వచ్చే అసంఖ్యాకమయిన ప్రజా సమూహమే సాక్షి.

మా నాన్నగారు (శ్రీ కూచి సత్యనారాయణ శాస్త్రి) మంచి మంత్రవేత్తని మా చుట్టు ప్రక్కల గ్రామాలకి పెద్దపేరు. ఒక రోజు ఒక ఆడమనిషి చేయి బాగా వాచి పోయి వచ్చింది. ఆ సలుపుతో చాలా బాధ పడుతూంది. ఎంతమంది డాక్టర్లకి చూపించినా మంత్రం వేయించమని చెప్పేరట మా నాన్నగారు వంట ఆముదము మంత్రించి ఆ వాచినచోట పోశారు. కొద్దిసేపటికే సలుపు, పోటు తగ్గిందని ఆమె చెప్పింది ఇంకొంతసేపటికి ఆ వాచినచోట ఒక చీలికయేర్పడి టప్పున బద్దలయి ధారాపాతంగా చీము కారి ఆ వాపంతా క్షణంలో మాయమైంది అది చూచినవారంతా మంత్రములో ఎంత మహిమ వుందని ఆశ్చర్యపోయారు. ఇది నా కళ్ళారా చూచినవిషయం. ఆ వాపు పేరు "మాద" అని అక్కడున్న వారికి మా నాన్నగారు చెప్పేరు. ఇలాగే పాడపాము మనిషిని ఊదినా, కరచినా మనిషి వళ్ళంతా దద్దుర్లు తేలి దురదతో బాధ పెడతాయి. అటువంటి వాటికి మా నాన్నగారు ఆముదం మంత్రించి రాస్తే నిముషంలో దురదంతా మాయమవుతుంది ఇల్లాగే మా నాన్నగారు మంత్రాలచే బాధపడేవారికి ఏ పెన్సిలిన్ ఇంజక్షను తగ్గించలేని వ్యాధుల్ని ప్రతిఫలాపేక్ష లేకుండగా ఆముదంతో తగ్గించి అనేకమందికి నయం చేశారు చేస్తున్నారు. మా వూళ్ళొ తేలుకు మంత్రం, దిష్టిమంత్రం ఆడవాళ్ళుకూడా వేస్తారు.

కె. ఎల్. ఎన్. శాస్త్రి,
అయినాపురం (తూ.గో.జిల్లా)

* * *

మంత్ర శబ్దార్థం

'అమంత్ర మక్షరం నాస్తి' అను వాక్యము చేత మంత్రముగాని అక్షరమే లేదని తెలుస్తోంది. అసలు మంత్ర శబ్దార్థం ఏమిటయ్యా అంటే మన=జ్ఞానే-అను ధాతువువలన మన్యతే ఇతి మంత్రః అని చెపుతున్నారు. అనగా తలచబడునది, స్వాభీష్ట సిద్ధికై నిశ్చలమైన మనస్సుతో నిరంతరము ధ్యానము చేయబడునది. కావుననే వేదోక్త గ్రంథమున—

శ్లో॥ మకారో మానసం ప్రాహుస్త్రకారో
బుద్ధిలక్షణః।
మనోబుద్ధి సమాయోగో
మంత్ర ఇత్యభిధీయతే॥

అనీ, మరొక గ్రంథమున—

శ్లో॥ మకారో జీవశబ్దశ్చ
త్రకారో ఆత్మ సంజ్ఞకః।
జీవాత్మనో స్సమైకత్వం
మంత్ర మిత్యభిధీయతే॥

అనీ చెప్పారు. కావున ఎలా చూచినా దృఢవిశ్వాసముతో ఆత్మశక్తిని సంపాదించుటకు మనపూర్వులు మంత్రమును వాడారు. మననము చేయువానిని త్రాయతి (రక్షించునది) గాన మంత్రమన్నారు. ఇటే శక్తినే నవీనులు 'మెస్మరిజం', 'విల్ పవర్' అని వాడుతున్నారు.

నా అనుభవములోని ఒక చిన్న విషయము విన్నవిస్తాను. దాదాపు 30 సం॥లకు పూర్వము నేనూ, నా స్నేహితు లొకరూ గ్రామాంతరం వెళ్లవలసి పగలు 10గం॥ ప్రాంతమున భోజనం చేసి పడవ యెక్కాము. ఏదో ప్రసంగముతో ఒక గంటపై చిలుకు వెళ్ళుచున్న పిదప పడవలోని వారెవరో బాధపడుతున్నటు, ప్రక్కవారెవో ఉపశాంతి వచనములు చెప్పుతున్నట్లు వినవచ్చినది అది విని నేను లోనికిపోయి విచారించగా 40 సం॥ల ప్రయాణీకుడు ఎదటికో పోతూ ఇంటినుంచి అన్నము వగైరా తెచ్చుకొని అలవాటైన వలమందు మరచి వచ్చినాడని, అన్నం వేళకు అది లేనందున అన్నం లోనికి పోలేదని తెలిసింది. కాళ్ళు, చేతులు పీకుతున్నవి నడుము నిలవటం లేదు. తలనొప్పి కడుపు ఉబ్బు, పండుకొనలేదు, కూర్చొనలేదు నానాబాధా పడుతున్నాడు.

(30-పేజీ చూడండి)


మాంత్రికుడు
మాండ్రేక్
కల్పన-రచన:
....లీ ఫాక్. ఫిల్ డేవిస్....
నార్దాఅనేపిల్ల కారులోఒంటరిగా వెళ్తోంది.
అరె! టైరుపేలింది! ఈ శ్మశానం పక్కనే పేలాలా? పైగా అర్థరాత్రి వేళ! ఊరుచేరడానికి రెండుమైళ్లు నడవాలికాబోలు....హుం.
అబ్బ! హోరుగాలి! ..
కొన్నా... ఇవాళే
అబ్బ. ఈ చీకటొకటి. నా పాలిటి జీబూతంలా....
ఐనా చీకటికి జడవడమేమిటి మరీను....ఇంతకీ ఈ టోపీ ఎక్కడపడిందో
హమ్మయ్య.


.అయ్యో నా టోపీ !నిన్న
ఏదమా కర్మ !
ఏమైనాసరే .ఆ టోపీవెతికితీరాల్సిందే, దెయ్యాలున్నా దేవతలున్నా ...హుం ఇప్పుడు కనక మాండ్రేక్ ఉంటే ఎంతబాగుండును!
3
గో ఆ గోరీమీదఉంది. ష్ .అంతా నిశ్శ
ా అయినా నేనుభయపడ్డంఏమిటి మాం
గా...
న..వ్వతా..బా..బోయ్
దె ..దెయ్యపుచెయ్యి '
6
CONTINUED-
5-10

(ఇంకా ఉంది)

★ మంత్రాలు, నమ్మకాలు ★

[27 వ పేజి తరువాయి]

అక్కడ ఎవ్వరూ నల్లమందు వాడేవారు లేరు. ఇది చూచి తిరిగి టాపుమీదకు వచ్చి నా స్నేహితునితో యీవిషయం తెలిపాను.

ఇది విన్న రెండు నిమిషములలో ఆయన లోనికి వెళ్లి ఆ ప్రయాణీకుని సమీపించి 'ఇదిగో, నా వద్ద ఒక మాత్ర ఉన్నది. నేను మాపటికని తెచ్చుకొన్నాను. నా సంగతి తరువాత విచారిద్దా'మని ఆయనకు మాత్ర యిచ్చి పైకివచ్చి కూర్చున్నాడు. ఒకపావు గంటకు ఆ ప్రయాణీకుడు మా వద్దకువచ్చి 'బాబూ, నన్ను బ్రతికించారు. అని దణ్ణాలుపెటి ఎంతో వినయంతో చాలా సేపు మాట్లాడి వెళ్ళినాడు ఆయన వెళ్ళిన తర్వాత ఏమిటని విచారిస్తే ఆయన నవ్వుతూ, పడవకున్న తారును చూపినాడు· నాకు చాల ఆశ్చర్యము వేసినది. కావున నే.

"మంత్రే తీర్థే ద్విజే దైవే
దైవజ్ఞే భేషజే గురౌ।
యాదృశీం భావనం
కుర్యాచ్ఛిద్ధిర్భవతి తాదృశీ॥

మంత్రమునందు, తీర్థమునందు, బ్రాహ్మణునియందు, దైవునియందు, దైవజ్ఞుని యందు, ఔషధమునందు, గురువునందు, నీవు ఎలా తలుస్తావో నీకు అలా ఫలము సిద్ధిస్తుందన్నారు. ఇది అంతయు ఒక మాటలో చెప్పాలంటే కుదిరితే గాని గుణం కుదరదు

ముత్తేవి అనంతపద్మనాభాచార్యులు,
—విజయవాడ.

* * *

"అడిగినానని చెప్పు"

మా ఊళ్ళో నారాయణస్వామి, రఘుపతి గార్లను యిద్దరు మంత్రవేత్తలున్నారు. అందులో మొదటివారు తేలుమంత్రంలోను, రెండవవారు పాముమంత్రంలోను గొప్ప వారు.

నారాయణస్వామిగారి తేలు మంత్రం విచిత్రంగా ఉంటుంది ఏమిటంటే ఆయన మంత్రం మామూలుగా చదివితే తేలుకుట్టిన బాధ తగ్గుతుంది. అదే మంత్రం క్రిందనుండి పైకి చదివితే తేలుకుట్టిన బాధ ఎక్కువవుతుంది. మంత్రం వేసిన మూడు నిమిషాలలో బాధ తగ్గుతుంది ఇది నేను స్వయంగా చూశాను అందువలన మంత్రాలంటే నమ్మకంలేని నాకు నమ్మకం కలిగింది.

ఇంక రఘుపతిగారు పాముమంత్రంలో గొప్పవారు గ్రామానికి ఆయన అనుమతి లేనిదే ఏ పాములవాడువచ్చి పాములను ఆడించడానికి వీలులేదు ఒకనాడు ఒక పాములవాడు ఆ గ్రామానికి ఆయన పర్మిషన్ లేనిదే వచ్చి పాములను ఆడిస్తున్నాడు ఆ సంగతి రఘుపతిగారికి తెలిసి ఏదో మంత్రం ఉచ్చరించారు ఆ మంత్రప్రభావం చేత పాములవాడి పాములన్నీ వారిదొడ్లో ఉన్న పొట్లపాదుకు పొటకాయలవలె వ్రేలాడుతున్నాయి. పాములవాడు ఆసంగతి తెలిసి ఆయనను బ్రతిమాలి పాములు తీసికొని ఆరోజే ఆ గ్రామం విడిచి వెళ్ళిపోతూ, ఆ గ్రామంలోని ఒక మనిషితో రఘుపతి గారిని "అడిగినానని చెప్పు" అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ మనిషి ఆమాట చెబుదామని రఘుపతి గారివద్దకు వచ్చాడు. రఘుపతిగారా సంగతిని మొదటే తెలుసుకొని ఆ వచ్చినమనిషితో నీవు నాతో చెప్పబోయేమాటను ఆ చెట్టుతో చెప్పిరమ్మని చెప్పనారు. వాడు అట్లే చేశాడు అంతే ఆ చెట్టు కొద్దిరోజులకు మాడిపోయింది. పాములవాడు చెప్పమన్న మాటలలో మంత్రం ఉన్నదని తరువాత ఆయన చెప్పారు.

కస్తూరి వెంకటచలపతి,
—రాజోలు.

* * *

జరుగుతున్న చరిత్ర

గుడివాడ తాలూకా దోసపాడు గ్రామంలో వీరభోగ వసంతరాయలు గుడి ఒకటి వుంది. ఆ గుడిలో పూజించబడే దైవం సజీవుడైవున్న ఒకరి విగ్రహం. ఆ సజీవమూర్తిది విజయవాడ నివాసం. పేరు కాళిదాసు ఆయనకు కాళికా ప్రసన్నం వుందని లోక ప్రతీతి. ఆయన యందుండే భక్తివిశ్వాసాలవల్ల శ్రీ సాంబశివరావుగారు కాళిదాసుగారి విగ్రహాన్ని దోసపాడులో నే ప్రతిష్ఠాపన చేసారు. కాళిదాసుగారు కాళికా మంత్రాన్ని ఈయనకే ఉపదేశించారు.

ఆనాటనుంచి శ్రీ సాంబశివరావుగారిలో ఏదో దివ్యశక్తి ప్రవేశించింది. ఆయన చేతితో ముట్టుకొన్న దల్లా పవిత్రమై పోతోంది. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలనుంచి పూజలో కూర్చుంటారు. అప్పుడు వారు మాట్లాడేవి మనమాటలు కాదు. కాళికాదేవి ఏమి చెపితే అది. అటువంటి సమయంలో ఎంతోమంది దూరగ్రామాల నుంచివచ్చి తమకున్న వ్యాధి, బాధలను ఆమెతో ఏకరువు పెట్టుకుంటారు. ఆయనలో మూర్తీభవించివున్న ఆ తల్లి ప్రజల బాధలన్నింటినీ తొలగించివేస్తోంది. ఆవిధంగా బాగుపడినవారెంతోమంది వున్నారు. ఇక దెయ్యాలు పట్టినవని వచ్చేవారి సంగతి లెక్కలేదు. ఎన్ని వందలమంది దెయ్యాలను వదిలించారో చెప్పలేము తీరని వ్యాధులతో బాధపడేవారెంతోమంది ఆ చల్లని తల్లి చేతులతో చక్కదిద్దబడ్డారు చుట్టుపట్ల గ్రామాలనుంచి మాత్రమే గాకుండా దూర దూరగ్రామాలనుంచి ఎంతమంది వస్తున్నారో చెప్పలేము ప్రతిరోజూ సాయంత్రానికల్లా దాదాపు వందమందివరకు వస్తూ వుంటారు. ఆ గుడిలో ఇచ్చే బండారు (పసుపు కుంకుమ కలిపినది) నొసటను ధరించితే ఎన్నోరోగాలు, పాపాలు హరించి పోతాయని ప్రతీతి ఏడుస్తూవచ్చి ఎంతమంది నవ్వుతూ వెళ్తున్నారో చెప్పలేము. ఆపదలో వున్నప్పుడు మొక్కుకుని కొబ్బరికాయలు, అరటికాయలు మొదలైనవి తెచ్చేవారు లెక్కలేదు దేవీఉపాసనలవల్ల ఇటి మహత్తర కార్యాలు ఎన్నో జరుగుతుంటే మంత్రాలపై నమ్మకాలెలా పోతాయ్ ★

వి సాత్యకిరావు, దోసపాడు.

దక్కింది గొడుగు

అప్పటికే చీకటి పడింది.. సీతారామయ్య బజారుపనులు చక్కబెట్టుకుంటూ, తమ వీధి ముందుకు వచ్చేసరికే, హఠాత్తుగా 'టప టప' మని పది చినుకులుపడి, అతడి బట్టల్ని కొద్దిగా తడిపి పారేశాయి! వేసవికాలంలో టపటప చినుకులు ఒక్కోసారి పడి ఆగిపోవటంవున్నదే అయినా, అతగాడు. "ఛస్. గొడుగుతెచ్చుకుంటే, ఇలా బట్టలు తడిసేవి కావుగదా! పదిరూపాయలు వెచ్చించి ప్రత్యేకంగా కొన్న ఆ గొడుగు-ఇంతవరకూ తిన్నగా ఉపయోగించుకొన్నది లేదు అవసరానికది ఉపయోగపడనప్పుడు — అది నిజంగా అనవసరమే-" అనుకొన్నాడు!

పై విధంగా తలపోసిన సీతారామయ్య, గురించీ అతడు కొనుక్కున్న పది రూపాయల గొడుగు గురించీ-కొద్ది వ్రాయటం అవసరం

యవ్వనంలో వున్న సీతారామయ్య స్వతహాగా పిసినిగొట్టుకాదు. అయితే కాలికి జోడూ, పైకి గొడుగూ యిత్యాదులకు పెద్దగా రూపాయలు వెచ్చించటం, అతడికి స్వతహాగా యిష్టంలేదు అందువల్లనే నిన్న మొన్నటివరకూ, అతడికా రెండువస్తువులూ సమకూడ్డంగూడా జరగలేదు!

గవర్నమెంటు గుమాస్తాగా సీతారామయ్య-నెలకు పది పదులదాకా సంపాదించుతున్నా, ఈలాంటి వస్తువులకు డబ్బు ఖర్చుచేయటం అనవసరమనే తలంపు అతడికి పుట్టుకనుంచీ వుంది. ఏమయితేనేం... కాలం, ఖర్మం కలసిరావటంవల్ల, అతడు పదిరూపాయలు వెచ్చించి ఒక గొడుగు కొన్నాడు! అతడది కొనటం కూడా ఒక కథే!

'వదిన' సినీమా ఆవ్వాళ్ళో విడుదలయింది! ఆ రోజు శనివారం అవటంవల్లా - సీతారామయ్యకారోజు సెలవుదినం అవటంవల్లా-ఆ చిత్రం మ్యాటినీషోతో ప్రారంభమవుతూండటంవల్లా-సినీమాకు అతడు బయలుదేరటానికి ఎటువంటి ఆటంకమూ లేకపోయింది!

సీతారామయ్య మూడు గంటలకు మొదలెట్టబోయే కొత్త సినీమా చూడ్డానికి ఇంటిదగ్గర రెండు గంటలకే బయలుదేరాడు! థియేటరు వూరికి మైలున్నర దూరంలో వుండటంవల్లా-సీతారామయ్య నడిచే అక్కడకు వెళ్ళాలనుకొంటున్నాడు - అలా ఒక గంట ముందు బయలుదేరటం అవసరమే!

అయితే, సీతారామయ్య, వంతెన దగ్గర కొచ్చేసరికి-పాతస్నేహితుడు గోపాలం కనిపించాడు. వాడు ప్రస్తుతం భిలాసపూర్ లో రైలు గార్డుక్రింద పనిచేస్తున్నాట్ట!

గోపాలంతో మాట్లాడుతూ అప్రక్కనే వున్న కాఫీహొటల్లో కాఫీలు సేవించి, అతడ్ని వదలించుకొనేసరికి ఇంచుమించుగా రెండున్నరగంట లయింది! మరో అరగంట వ్యవధే సీతారామయ్యకుంది!

సీతారామయ్య ఇంకా వెళ్ళవలసిన దూరం...ఇంచు మించుగా మైలువుంది .. అతను హడావుడిగా నడుస్తూ బజారు దగ్గర కొచ్చేసరికి — అంతవరకూ నిర్మలంగావున్న ఆకాశం, కాంతితో వెలుగుతున్న సూర్యుడూ మాయమయ్యారు! మేఘాలు వురమటం, పెద్దలెక్కన చినుకులు పడటం-ఒకదాని తరువాత, మరొకటిగా-హఠాత్తుగా జరిగిపోయాయి!

"కొంప మునిగింది...ఇప్పుడెలాగ" — అనుకుంటూ సీతారామయ్య, ఎదురుగా వున్న నేషనల్ ఫాన్సీ ఎంపోరియం వంక ఒక మారుచూచి, వడిగా పరుగెత్తి, అక్కడికి చేరుకొన్నాడు!

ఎంపోరియం — ప్రొప్రయిటరు అప్పారావు సీతారామయ్యకు స్నేహితుడే! అతడు, సీతారామయ్యను, యోగక్షేమం చేసి, అప్పుడే గొడుగు కావాలంటూ వచ్చిన మనుషులకు-తీసిచూపి, ఏమిటో మాట్లాడుతున్నాడు సీతారామయ్య దృష్టి కూడా వాటి వయిపుకు నడిచింది

అప్పారావు అన్నాడు "ఇది ప్లాస్టిక్ హేండిల్ తో-ఆలీఘర్ ఇనుప తీగలతో — నల్లసిల్కు ప్రత్యేక పనివాడితనమైన గుడ్డతో తయారైన గొడుగండీ!" కొలంబియా కాదు-బల్బుమార్కు కాగు ఏకంపెనీ గొడుగులూ దీనికిపోటీగా నిలువలేవు కావాలంటే మాత్రం - లోపలకు నీటిచుక్క ప్రవేసిస్తుందేమిటి? చాలా కట్టుదిట్టం అయిన చత్రం"-అని.

గొడుగును పరిశీలించుతున్న పెద్దలకు అప్పారావు మాటలు నచ్చాయి వాళ్ళు ధర అడిగారు

అప్పారావు గొడుగు ప్రత్యేకతలగురించి మరోమారుచెప్పి, "ఇన్ని లక్షణాలు కలిగి వుండి కూడా ఈగొడుగు ధర పదిరూపాయలే"-అన్నాడు!

ధర అవతల మనుషులకు సబబుగా తోచటంవల్ల కాబోలు, నచ్చిన గొడుగును తీసికొని, డబ్బుయిచ్చి నిష్క్రమించారు!

ఏకధారగా, కురుస్తున్నవాన వంక, అయోమయంగా సీతారామయ్య ఒకమారూ ఎంపోరియంలో గోడ గడియారం వంక మరోమారు చూసి. అమ్మో...రెండూ నలభై"-అంటూంటే వర్తకం చేసుకొనే అప్పారావు మామూలు ధోరణిలో: ఏభై గొడుగులకు ఆర్డరిస్తే - మరో అరడజను మాత్రమే మిగిలాయండి! ఏమయినా యిది గొడుగుల సీజన్ కాదండీ! న్యాయంగా యీగొడుగు పదిరూపాయల విలువ చేస్తుంది" అన్నాడు.

సీతారామయ్యకా మాటలు పెద్దగా రుచించలేదు. అతడేలాగో "అది సరేలేవోయ్! నే సినీమాకు బయలుదేరాను. దార్లో యిలా వానవచ్చి పడింది ఇంక యిరవై నిముషాలే టయింవుంది. ఏదయినా పాతగొడుగువుంటే దయయుంచి యిద్దూ... తిరిగి వచ్చేటప్పుడు యిస్తాను-"అంటూంటే,

అప్పారావు, వ్యాపార ధోరణిలో: మీరు పాతగొడుగు తీసుకు వెళ్ళటం యేమిటండీ? కొత్తదే తీసుకెళ్ళండి! తిరిగి ఇప్పుడప్పుడే ఇటువంటవి రావు"—అన్నాడు కొత్త గొడుగుల్లోంచి, ఒకటి ఎన్నికచేసి, తెచ్చి ఇవ్వబోతూ!

సీతారామయ్యకు ప్రాణం పోయినంత పనయింది; కొత్తగొడుగు కొనటమా ! తీసుకోకుంటే—అప్పారావు తన లోభిత్వానికి నవ్వడుకదా ? ఏలాగో అతడు వనుకాడుతూ, "పుచ్చుకోవచ్చుగానీ దగ్గర డబ్బు లేదోయ్"—అంటూ తప్పించుకోబోయాడు!

—ఆ విధంగా అంటే గొడుగు కొనటం తప్పకుండా తప్పిపోతుందనుకున్నాడు సీతా

'శివరామ'

దక్కింది గొడుగు

రామయ్య; కానీ, పరిచయం- వున్న ఒక గవర్నమెంటు గుమాస్తాను—అప్పారావు లాంటి బిజినెస్ మనిషి తేలిగా వదిలేస్తాడా?

"మీ దగ్గర డబ్బు యెక్కడికిపోతుంది! మీ అభిమానం నామీదవుంటే అంతేచాలు! మీకు వీలయినప్పుడే—రెండు నెలల లోగా డబ్బివ్వండి"—అంటూ అప్పారావు సీతారామయ్య చేతిలో—తాను ఎన్నిన గొడుగును వుంచాడు!

"సీతారామయ్య మరి తప్పించుకో లేకపోయాడు! పైగా టయిం మరో అరునిముషాలు ముందుకు నడిచింది "సరే అయితే గొడుగు మంచిదేగదా? నా పేరు నోటు చేసుకో," అంటూ—ఒకమారు, దాన్ని హడావుడిగా పరిశీలనచేసి, తృప్తిచెంది, గొడుగు వేసుకొని హడావుడిగా థియేటరు వైపు నడక సాగించాడు!

ఏమనుకుంటే ఏం లాభం? రెండుఫర్లాంగులు దూరం సీతారామయ్య—తిన్నగా నడిచాడో లేదో—వాన తుప్పరగానూ, తుక్కరపాడి గాలిగానూ, కొద్దినిముషాలో నె మారిపోయాయి! సీతారామయ్య సినీమా హాలు దగ్గర కొచ్చేసరికి-అంతవరకూ చాటున దాక్కొన్న సూర్యుడుకూడా బయటకు వచ్చి ప్రకాశించటం ప్రారంభించాడు!

ఇదంతా చూసి—సీతారామయ్య కృంగిపోయాడు! కొద్ది నిముషాల వుపయోగం కోసం—అతడు పదిరూపాయలు (ఇవ్వకపోయినా) వెచ్చించవలసి వచ్చింది! కొనేసింతరువాత ఏమనుకుంటే యేంలాభం?

ఏమయితే నేం—సీతారామయ్య సినీమాకు టైంకు అందుకొన్నాడు. అంతే కాదు, కొనటం జరిగిపోయిందిగనుక, "వదిన—సినీమాకు బయలుదేరటంవల్ల దాని ధర్మమా అని గొడుగును సంపాదించుకొన్నాను మరి జోడుకూడా యెప్పుడో కొనుక్కోవాలి"—అని బ్రహ్మాండమైన సంతృప్తి వెలడించుకొని థియేటరులోకి నడిచా డతగాడు!

ఇప్పటి కతడు గొడుగుకొని కొన్నిమాసాలయినా- తిన్నగా వుపయోగించుకొన్నది లేదు! అలాంటప్పుడు—సీతారామయ్య అలా సమయం వచ్చినప్పుడు బాధను వెతల గ్రక్కటంలో తప్పేముంది?

* * *

సీతారామయ్య ఇంట్లోకివచ్చాడు. అతడు తన గదిలోకి నేరుగా ప్రవేశించి, గది చీకటిగా వుండటంవల్ల స్విచ్ వేశాడు తడి-పొడిగావున్న చొక్కావిప్పు—'ఫరవాలేదు' అనుకొని వంకకు తగిలిస్తూంటే—అతడిదృష్టి గొడుగుమీదకు పోయింది! ఆ వంకెకే సీతారామయ్య గొడుగు వ్రేలాడుతూండేది! ప్రస్తుతం అదిమాత్రం అక్కడ లేదు!

చొక్కావిప్పి, వంకకు తగిల్చిన సీతారామయ్య గదిని—తీక్షణంగా పరిశీలిస్తూంటే అతని అర్ధాంగి జానకి చెంబూనీళ్ళతో గదిలో ప్రవేశించింది;

"గొడుగేదీ?"—భార్యవైపు సీతారామయ్య తీక్షణంగా చూశాడు!

"అప్పుడే ఆరావచ్చిందీ, జానకినవ్వింది! ఈలోగాసీతారామయ్య కాళ్ళుకడుక్కొ వచ్చాడు!

"ఏం?"

"మా నాన్నగారు తీసుకు వెళ్ళారండీ"

"ఎందుకు తీసుకెళ్లారూ?—సీతారామయ్య కసిరాడు!

జానకి నవ్వుతూ అంది "ఎందుకండీ అలా కసురుకుంటారు? మా నాన్న మావూరి నుంచి ఇక్కడకు వచ్చి రాజమండ్రం వెడదామని 'సైను బోనుకు' మధ్యాహ్నం బయలు దేరారు

అప్పుడు ఎండ ఎక్కువగా వుంది. అందుకని—స్టేషనుదాకా "ఆమె ఇంకా ఏమో చెప్పబోతూంటే, "నా గొడుగు తీసుకువెళ్ళారన్నమాట" నములాలన్నంత కోపం వచ్చిన సీతారామయ్య మింగుతూ అన్నాడు"

"అంత కోపం దేనికండీ?"--జానకి వెక్కిరింపుగా అంది.

"కొనలేక, కొనలేక నేను గొడుగు కొనుక్కొన్నాను ఎక్కడపారేసుకుంటారో అని—నేదాన్ని తిన్నగా ఉపయోగించుకోటం లేదుకూడాను! ఈ రోజు కేరోజు—నిత్యేపంలాంటి గొడుగువుండగా—వానలో తడిసి రావలసి వచ్చింది మీ నాన్నగారు మాత్రం—మహానుభావుడిలాగ. దాన్ని తీసుకు వెళ్ళారు ఎక్కడవస్తువును అక్కడే మరచిపోయే తత్వం ఆయనది! ఆయన ఎక్కడయినా దాన్ని పారవేస్తే, నాగతేం కానూ? ఎంతయినా మామగారు, ఆయన ఎక్కడో గొడుగు పారేస్తాడు, అంతవరకూ ఖాయం; ఆయన్ను నాగొడుగు నాకు ఇవ్వమని అడగ్గలనా?"

జానకికి రోషం వచ్చింది ఆమె, ఆపరిస్థితిలోనే నవ్వుతూ; గుమ్మడి కాయ దొంగ అంటే, వెనకటి కెవరో భుజాలు తడుముకున్నారట. అలా వున్నాయి మీ మాటలు. మా నాన్న మతిస్థిమితంలేని వాడని మీరా విసంగా అనుకుంటున్నారు! కానీ మీరన్నంత మరుపుమనిషి కాదాయన; అందులోనూ, అది అల్లుడు గారి గొడుగు! మీరు దెప్పిపొడుస్తారని—ఆయనకూ తెలుసు; అందువల్ల మీ గొడుగు విషయంలో ఆయన తగినంత శ్రద్ధతోనే వుంటారు లెండి"

సీతారామయ్య, ఏడ్వలేక నవ్వుతూ అన్నాడు: 'అయితే—నా గొడుగు భవిష్యత్తుగురించి నీ అభిప్రాయం ఏమిటో?"

"మీగొడుగుకు భవిష్యత్తేమిటి? అది జాగ్రత్తగా ఇంటికి వస్తుంది."

"నాకు నమ్మకం లేదు రైల్లో ప్రయాణం చేస్తూ—కంపార్టుమెంటు బల్లమీద పర్సు మరచిపోయిన మహానుభావుడాయన—"

జానకి మరి ఓర్పు వహించ లేకపోయింది "అనవసరంగా ఆయన్ని అనకండి మీ గొడుగు ఎక్కడికీ పోలేదు. ఊళ్ళోనే వుంది"

సీతారామయ్య బ్రతికాననుకొని, "అదేమిటి" - అంటూ భార్యవైపు చూశాడు

"రాజమండ్రం వెళ్ళదామనుకొన్న మా నాన్నగారు వెళ్లలేదు!"

"అయితే మరి గొడుగేదీ?"

"స్టేషనుదాకా వెళ్ళేసరికి - ఎండ తగ్గుముఖం పెటంవట రాజమండ్రం బండిలో వెళ్ళేసరికి యెలాగా సాయంకాలం అయిదుగంటలవుతుంది. ఎండ ఏలాగూ తగ్గిపోతుంది - అందువల్ల మరి గొడుగు అనవసరం పొరపాటున అది యెక్కడయినా పడేస్తే పడవేయవచ్చు కూడా! అందులోనూ - మా అల్లుడు అందరల్లుళ్ళవంటి వాడూ కాడు; చాలా మంచివాడు, వస్తువు పోయిన సంగతి తెలిసింవంటే, మరి జన్మజన్మాలకూ జ్ఞాపకం వుండేటట్లు సాధించుతాడు అందువల్ల ఈ గొడుగు మరినే తీసుకొని వెళ్ళకూడదని" - పాపం ఆయన అనుకొని, అక్కడికక్కడనుంచే గొడుగును మన ఇంటికి పంపించి వేద్దామనే ఉద్దేశంతో, మనిషి కోసం గాలించారట! "ఏంగాయితే నేం - చివరకు అదృష్టవశాత్తూ, మీకోసం తరుచుగా వస్తూంటాడే పేపరు కుఱ్ఱాడు - ఆ కుఱ్ఱవాడి పేరు నాకు తెలియదు .."

"ఎవరూ? మొహాన మచ్చవుంటుంది అతడేనా?" - మధ్యలో సీతారామయ్య ప్రశ్నవేశాడు!

"ఊహూ! అతడు కాదు...నల్లగా వుండే కాపుల అబ్బాయ్"

"ఓహో అతడా? అతడిపేరు వెంకట్రాజు," అన్నాడు సీతారామయ్య

"ఆ..అతడే నండి. ఆ అబ్బాయికి గొడుగు ఇచ్చి మన ఇంట్లో ఇవ్వమని మా నాన్నగారు చెప్పారట. చివరకాయన రాజమండ్రం వెళ్ల నవసరమే లేకపోయిందట! 'సైను బోను' దగ్గిరే ఆయన పని అయిపోయింది. ఆయన తిరిగి ఆ కుఱ్ఱాడికోసం

జతికొరట కానీ కనపడలేదు. అందువల్ల ఆయన మావూరు తిరిగి వెళ్ళిపోతూ, తమ అల్లుడుగారు ఎక్కడ ఖంగారుపడిపోతారో అని చెప్పి, పని కట్టుకు మన ఇంటికి వచ్చి - ఈ సంగతి చెప్పి మరీ వెళ్ళారు. ఇక చాలా - మీ గొడుగుకు వచ్చిన ప్రమాదం ఏమీ రాలేదు కనుక - మీరు ఈ రాత్రి సుఖంగా నిద్రపోవచ్చు - ఎటు వచ్చీ ఆ కుఱ్ఱవాడు, మన ఇంటికి రాలేదు కనుక, మీరు మీరే రేపు ప్రొద్దుట అతడ్ని కలుసుకొని - అవసరం అయితే గొడుగు తెచ్చుకోవలసి వుంటుంది" - అంది జానకి

సీతారామయ్య నవ్వుతూ "చివరకు, వెంకట్రాజు దగరకు గొడుగు వెళ్ళిందన్న మాట? బ్రతికించావ్" - అన్నాడు

జానకి, "మరి భోజనానికి లేవండి అత్తయ్య ఎప్పుడో చెప్పారు ఈ గొడుగు గొడవలో ఆలస్యం అయింది"-అంటూంటే-

"చిత్తం" - అంటూ, బట్టలు మార్చి భోజనానికి లేచాడు సీతారామయ్య!

* * *

ఆ రాత్రి సీతారామయ్య తిన్నగా నిద్రపోలేదని వ్రాస్తే మీరు నవ్వుతారనుకుంటాను. కలత నిద్దుర మధ్యా, కలల మధ్యా సీతారామయ్య ఆ రాత్రి గడిపాడు.

మర్నాడు - ఎనిమిది గంటల వేళ అతగాడు కాలకృత్యాలు తీర్చుకొని, గొడుగు తెచ్చుకోవటం కోసం - స్టేషనుకు బయలుదేరాడు!

అయితే, సీతారామయ్యకు అవసరమైన వెంకట్రాజు ఉదయం తొమ్మిదిగంటలు దాటితే కానీ అక్కడకు రాలేగు అనేక విధాలుగా ఆలోచిస్తూ, అతను ప్లాటుఫారం మీద తిరుగుతూండగా, దూరాన వెంకట్రాజు కన్పించాడు.

సీతారామయ్య పేదకు పెన్నిధి దొరికినట్లుగా సంతోషిస్తూ అతడ్ని కేక వేశాడు ఎదురుగా వస్తున్న వెంకట్రాజు, అతడి కేక విని, తెల్లబోయి, ముఖం చాటు చేసుకొని తప్పించుకు వెళ్ళిపోదామనుకొన్నాడు కానీ సీతారామయ్య ఒకటికి రెండుమార్లు కేకలు వేయటంతో - వెంకట్రాజు మరి కనిపించి, మాటాడటం తప్పదనుకుంటూ "ఏమండీ పంతులుగారూ?" అంటూ, వెలవెలబోయే ముఖంతో యెదురుగా వచ్చాడు.

"ఎన్ని కేకలు వేసినా పలకవేమోయ్?" సీతారామయ్య అడిగాడు

"వినపడలేదండీ," అబద్ధం ఆడ ప్రయత్నించాడతను

"ఈ మధ్య కొత్తగా చెముడు నీకు ప్రవేశించినట్లుంది,—" సీతారామయ్య నవ్వాడు!

"లేదండి"—వెంకట్రాజు ముఖం మరో మారు వెలవెలబోయింది

"మా మామగారు గొడుగునిచ్చింది నీకేనా"

"అవునండి"— సీతారామయ్య ముఖం చూడలేక, వెంకట్రాజు తలదించుకొన్నాడు!

"నువ్వు నిజంగా బ్రతికించావ్! ఆయన మతిమరుపు మనిషి బొత్తిగా ఆయనకు జ్ఞాపకశక్తి తక్కువ; ఎక్కడ పారేశారోనని—రాత్రినుంచి నాకు మనస్సు తిన్నగా లేదు"— సీతారామయ్య నవ్వాడు

వెంకట్రాజు కృంగిపోతూ అన్నాడు. మీ మామయ్యగారు మతిమరుపు మనిషి కారండి; నేనేనండి "

"అదేమిటి అలా అంటున్నావ్"— సీతారామయ్య ఆశ్చర్యపోయాడు

"ఏం చెప్పనండి? ఆ గొడుగు ఎక్కడో పోయింది—"

సీతారామయ్యకు మూర్ఛ వచ్చినంత పనయింది! "పోవటమే! అదేమిటి? ఆయన నీకివ్వలేదా అసలు?" ఏలాగో అతడా ప్రశ్నలను వేశాడు!

"ఆయన ఇచ్చారండి! అది నా చేతులతోనే పారేశానండి" వెంకట్రాజు తప్పు తనదే అన్నట్లుగా చెప్పుకొన్నాడు!

"ఏలా పారేశావోయ్"— కనీతీర— వెంకట్రాజు వయిపు చూశాడు సీతారామయ్య

"ఏం చెప్పనండీ?"— వెంకట్రాజు బిక్కముఖం పెట్టి, చెప్పటం సాగించాడు

"నాకా పని చెప్పింది మరెవరయినా అయితే నే అంగీకరించేవాడిని కాదండి; మీ మామయ్య గారిలాంటి పెద్దవారు గొడుగు—మీ ఇంట్లో ఇచ్చివేయమనటం వంటి చిన్న పని చెప్పినప్పుడు, ఏలా కాదనగలనండి?

"సరే"—అని వారి దగ్గర గొడుగు పుచ్చుకున్నానండి ఆయన ఇచ్చి వెళ్ళిపోయారు. ఆ తర్వాత "సైను డౌను" వచ్చింది అది వెళ్ళిపోటంతోటే, ఏలూరు నుంచి వచ్చిన నా స్నేహితుడు-రామారావనే వాడితో పత్రిక చందాలు వసూలు చేయటానికి బజారుకు బయులుదేరానండి నేను బయులుదేరేప్పుడు-గొడుగు నా చేతిలోనే వుందండి ఇద్దరం వంతెనవరకూ కలిసే వచ్చామండి; మధ్యలో వాడు-తన పనులు చూసుకొని, "మరి నాల్గున్నరకోచికి టయిం అయిపోయిందం"టూ వెళ్ళిపోయాడండి నేను చందాలు వసూలు చేసుకొని, తిరిగి స్టేషనుకు వచ్చి - పేపర్ల జమాఖర్చులు చూసుకుంటూంటే-పుల్లయ్య అనే మా కుఱ్ఱాడొకడు — "పంతులుగారి గొడుగేది?-" అని అడిగాడండి! అంతవరకూ దాని సంగతే నాకు జ్ఞాపకం రాలేదండి. అది ఏమయిందో యెంతో యెంత యోచించినా, నాకు తెలియటం లేదండి-"

వెంకట్రాజు మాట్లాడటం మానేశాడు సీతారామయ్య - మనస్సులో యెంతగానో బాధపడుతూ "నేనుఏం చెప్పను? గొడుగును నే కొనలేక, కొనలేక కొన్నాను. ఈ మధ్యనే గొడుగుబాకీ పదిరూపాయలూ జమ చేయటం కూడా అయింది-" ఈలా గొడుగు కొనటంలో తనకున్న సాధక బాధకాలన్నీ అతడు వివరంగా తెల్పుకున్నాడు

వెంకట్రాజు కూడా బాధను వెలిబుచ్చుతూ "నేను మాత్రం ఎటువంటి హీనస్థితిలో వున్నానో మీకు మాత్రం తెలియదండీ? రాత్రింబవళ్ళు-ఈ పత్రికల దగ్గర తిరిగితే, నాకిచ్చే జీతం పాతిక రూపాలు నాకింక ఇతర ఆదాయాలేమున్నాయండి? ఆ మొత్తంతోటే కుటుంబాన్ని నేను పోషించుకోవాలండి నిజానికా కొద్ది మొత్తంతో— జీవితయాత్ర సాగిస్తూంటే నేను మీకు గొడుగును కొని ఇచ్చే స్థితిలో లేను! ఏమైనా—మీ గొడుగు నే చేతులారా పారేశాను! అది ఏమయిందో నాకు తెలియటం లేదు కనుక, అది పోయినట్టే! అందువల్ల- నే అటువంటి గొడుగు నే మీకు తప్పక కొనియిస్తానండి, బీదవాడ్ని కనుక, కొద్దికాలం ఆలస్యమవుతుంది మరేం అనుకోకండి,"— అంటూంటే,—

వెంకట్రాజు మీద అభిమానం, నమ్మకం కల్గివున్న సీతారామయ్య జాలిపొందాడు! నిజంగా అతను గొడుగు కొనియివ్వలేడు! అయితే "యివ్వలేను పోనీలే"—అని, కొనలేక, కొన్న తన కష్టార్జితపు గొడుగును పోగొట్టుకో కలడా? నిజానికి- చెప్పాలంటే గొడుగు పారేసింది వెంకట్రాజు కాదు— తన మామయ్య! ఆయన పోగొట్టవలసిన గొడుగును ఇంటిదగ్గర ఇవ్వటానికి వెంకట్రాజు, ఉపకారరీత్యా యివ్వ యిష్టపడితే, అది అతడి పాలిట అపకారమైంది! చేత గొడుగు పుచ్చుకున్నంత మాత్రాన, బాధ్యత అతడిదవుతుందా? వెంకట్రాజును పదిరూపాయలు ఇచ్చుకోమనటంలో ఎంత న్యాయం వుంది?

ఏమయినా-తాను తన గొడుగుమీద కల్గివున్నటువంటి హక్కును పోగొట్టుకోటం ఇష్టంలేదు

దీర్ఘకాలం యోచించిన అనంతరం సీతారామయ్య వెంకట్రాజు వంక చూసి "వెంకట్రాజూ? నే నిజం చెబుతున్నాను! ఈ పరిస్థితిలో ఏం చేయటానికి కానీ — ఏం అనటానికీ గానీ నాకు తోచకుండా వుంది. నా నెతో తిరిగి నే గొడుగు కొనుక్కోలేను నువ్వు కూడా కొని ఇవ్వలేవు ప్రస్తుతస్థితిలో నిన్ను గొడుగును

★ దక్కిందిగొడుగు ★

కొని యివ్వమని అడగటంకూడా నాకు సబబుగా తోచటంలేదు. అందువల్ల కొద్ది కాలం ఆలస్యమవుతే అవుతుంది. ....నా గొడుగుజాడలు తియ్యి, ఆలస్యంఅయినా నా గొడుగు ఆకృతి నాకు వస్తే చాలు—" అన్నాడు!

ఈ మాటలు వెంకట్రాజుకు బ్రహ్మానందాన్ని కల్గించినాయ్ "ఆ. ఇంకేమండి! నాకు కొంచెం వ్యవధిఇవ్వండి మావాళ్ళనందరినీ అడిగి దాని ఆరాలుతీస్తాను అప్పటికీ లభ్యంకాకపోతే కొత్త గొడుగు కొనిస్తాను"—అన్నాడు . . .

'సరే'—అని తల వూపుతూండగా, అవుటరు సిగ్నలు సమీపించిన మేలు కూత కూసింది "బండి వస్తూందండి తిరిగి మిమ్మల్ని కలుసుకుంటాగా" — అంటూ వెంకట్రాజు — ప్లాటుఫారం ముందువయిపుకు పరుగెత్తాడు.

సీతారామయ్య 'ఉస్సు' రనుకుంటూ నెమ్మదిగా—అడుగులు వేస్తూ, స్టేషను బయటకు వచ్చాడు!

*   *   *

ఆతర్వాత పదిరోజులకు—

ఒక సాయంకాలం, కాఫీహోటలుదగ్గర, సీతారామయ్యకు, వెంకట్రాజు కనిపించాడు.

ఒకక్కప్పుడు — చాటుగా ముఖం పెట్ట, తప్పించుకొన ప్రయత్నించిన వెంకట్రాజే ఎదురుగావచ్చి సంతోషాన్ని వ్యక్తపరుస్తూ "ఏమండో య్ పంతులుగారూ? ఒక మంచి వార్త.. మీ గొడుగుపోలేదు. వుంది!"—అన్నాడు.

సీతారామయ్యకు చచ్చిపోయినవాడు—తిరిగి బ్రతికినప్పుడు వచ్చేటంత సంతోషం వచ్చింది అతడు ఆదుర్దాగా: "ఏదీ? ఎక్కడ?"—అని అడిగాడు!

వెంకట్రాజుకు నవ్వువచ్చింది "ఇక్కడ కాదండీ! మీ గొడుగు వున్నటుగా కబురు వచ్చింది నా స్నేహితుడు రామారావు అని చెప్పాను జ్ఞాపకంవుందాండీ? అతగాడు దాన్ని తనతో ఏలూరు తీసుకుపోయాట్ట! ఆవేళ మేం బజారుకుపోతూంటే దార్లో నా చేతిలో గొడుగు పుచ్చుకొన్నాట్ట అతడు నాకు తిరిగి యిచ్చింది లేదు పరాకుగా వెనక్కు తిరిగి వెళ్ళిపోయాట్ట. బండి ఎక్కినాక—వాడికి జ్ఞాపకంవచ్చిందట. ఏం చెయటానికీతోచక దాన్నికూడా తీసుకుపోయాడట మంవూరు వచ్చే పరిచయంవున్న వ్యక్తి ఎవరయినా కన్పడితే వాళ్ళకు దాన్ని యిద్దామని వాడు పదిరోజుల్నుంచీ ప్రయత్నిస్తున్నాట్ట! చిట్టచివరికీ ప్రొద్దుట—అర్ధంతరంగా సేషనులో కన్పడి, ఈ వూరువస్తున్న మా స్నేహితుడిచేత—గొడుగు ఆ సమయంలో దగ్గరలేకపోవటంవల్ల—వున్నట్లుగా నాతో చెప్పమని కబురుమాత్రం పంపించాడు.

సీతారామయ్యకు, తన గొడుగు, తనకు దక్కుతున్నందుకు ఎంతిగానో ఆనందం కల్గింది. వెంకట్రాజులాంటి అమాయకుడ్ని యేమైనా చెడ్డగా భావించి, గతంలో కష్టంకలిగించే లాగ ఏమైనా మాటలన్నానేమోనని అతడు బాధపడ్డాడు కూడా!

"వెంకట్రాజూ! ఈ సందర్భంలో నేనిన్ను చాలా శ్రమపెట్టాను. నన్ను గురించి నువ్వు యేమాత్రం చెడ్డగా భావించకు సుమా. ." అని సీతారామయ్య అంటూంటే,—

"పంతులుగారు ఎంత మాటన్నారు"—అంటూ అతడు నొచ్చుకున్నాడు!

"అయితే ఏలూరులో వున్న మన గొడుగు ఎంతకాలంలో మనకు చేరుతుందంటావ్?"—సీతారామయ్య ప్రశ్నించాడు.

వెంకట్రాజు కొంచెం నిదానించి అన్నాడు, "మేం పేపర్లుఅమ్ముకుంటూ—ఏలూరు—దాకా తరుచు వెడుతూంటాం కాదండి . ఈ పట్టు మరచిపోకుండా దిగి—మా వాళ్ళయింటికి వెళ్ళి మీ గొడుగు తెచ్చిపెడతాను"

'ఎన్ని రోజులలో?"—అనుమాన నివృత్తికోసం అడిగాడు సీతారామయ్య!"

"ఏం చెప్పనండి? నే వీలును బట్టి వెడుతూంటాను. సుమారు పదిరోజులనుకోండి"

"సరే...ఆ పది రోజుల్లోగా నా గొడుగు నాకు చేర్చు"

"అలాగేనండి"

ఈలోగా శరభశాస్త్రి అనే, సీతారామయ్య స్నేహితుడక్కడికి వచ్చి, "అలా పైకి వెళ్ళొద్దాం రావోయ్"—అంటూ, అతగాడ్ని బలవంతాన లాక్కుపోయాడు! "వస్తాను మరచిపోకు"—అంటూ సీతారామయ్య అతడి వెంట నడిచాడు!

*   *   *

ఇప్పటికే పెద్దదయినా ఈ కథను మరింత పొడిగించటం వుచితం కాదు .

ఏలూరునుంచి గొడుగు పదిరోజుల్లో తప్పకుండా తెచ్చి యివ్వగలనన్న వెంకట్రాజు-అన్నమాట ప్రకారం కంటె ముందుగా-అంటే వారం రోజులకే, ఒక గొడుగు చేత పుచ్చుకొని, సీతారామయ్యకు దాన్ని యిచ్చే తలంపుతో అతడు పనిచేసే ఆఫీసు దగ్గరకు వచ్చాడు!

అప్పటికి మధ్యాహ్నం మూడు గంటలయివుంటుంది. అర్జంటు రిఫరెన్సు పరిశీలన చేస్తున్న సీతారామయ్యకు "పంతులుగారూ"—అని వెంకట్రాజు గుమ్మం బయటనుంచి కేక వేయటంతోటే దృష్టి అటువైపుకు నడిచింది! అతడు లోపలకు వచ్చాడు. వెంకట్రాజునుమాడ్డంతోటే-సీతారామయ్య వదనంవికసించింది..."ఏమోయ్ గొడుగు దక్కిందా?"—చేతులో వున్న అర్జంటు కాగితాన్ని ఆలా

(43 వ పేజీ చూడండి)

వనితా లోకం

★ పశ్చిమ బెంగాల్ గవర్నరు ★

పద్మజా నాయుడు

హైదరాబాదు నగరములోని ఇద్దరు ప్రముఖులకు గవర్నరుపదవి లభించింది. ఆఇద్దరిలో ఒకరు కుమారి పద్మజా నాయుడు. స్వతంత్రభారతములో ఇంతవరకూ గవర్నరు పదవినందుకొన్నవారు ఇద్దరే మహిళలు. మొదటివ్యక్తి ప్రఖ్యాత కవయిత్రి, గొప్పదేశసేవిక, రాజకీయవేత్త, వీరభారతనారి అయిన సరోజనీదేవి. రెండవ ఆమె పద్మజానాయుడు. సరోవరములో పుట్టింది లక్ష్మీదేవి — ఆ సరోజనికి జనించింది పద్మజ.

కీర్తిశేషురాలయిన సరోజనీదేవి సారస్వత, రాజకీయ రంగాలలో ప్రఖ్యాతి గాంచింది. ఆమె పేరు పదిమందికీ తెలిసిన తరువాత నే, గవర్నరు పదవినందుకొన్నది కుమారీ పద్మజానాయుడు పేరు జన సామాన్యానికి అంతగా పరిచయములేదు. ఆమె రాజకీయ నాయకులందరివలె చెరసాల శిక్ష ననుభవించి, గొప్పత్యాగాలు చేయలేదు. తల్లి గొప్పతనమువల్ల నే ఆమె కీపదవి లభించిందని చాలామంది ఊహించారు.

సామాన్యముగా గొప్పవంశములో ఎంత సామర్థ్యముకలవారు పుట్టినా, వ్యక్తిగతముగా వారికి తగిన గౌరవము లభించదు. వారికి లభించే గౌరవప్రతిష్ఠలలో సగభాగము వంశానికి చెందుతాయి. కాని కుమారి పద్మజానాయుడి విషయములో మాత్రము తల్లికీర్తి ప్రతిష్ఠలు ఛాయామాత్రముగా నే తోడ్పడ్డాయి దానికి కారణము ఆ కుటుంబములోని ఉత్తమగుణాలకు ఆమె వారసురాలు కావటమే

ఆ కుటుంబములోని వారందరూ విద్యాసంపన్నులు. ఆ వాతావరణములో పెరిగిన పద్మజానాయుడు యూనివర్సిటీ డిగ్రీలు లేకపోయినా, ఉన్నతపాఠశాల విద్యానంతరము, ఇంటివద్దఉండే విజ్ఞాన సముపార్జన చేసింది. తల్లి కవయిత్రి కావటముచేత, ఆ గృహమెప్పుడూ కవిపండిత గోష్ఠులతో నిండిఉండేది వీటిచేత నే పద్మజానాయుడి హృదయము విద్యావిజ్ఞానాలచే సంస్కరింపబడ్డది

విశాలమయిన దృక్పథము, హిందూ, మహమ్మదీయులలో ఐకమత్యము పెంపొందించవలెనన్న పట్టుదల, అందరియెడ స్నేహభావము, అన్నిటికీమించిన ప్రసంగ కౌశలమూ పద్మజానాయుడికి మాతృదేవత పెట్టిన భిక్ష. సరోజనీదేవికి ఉన్న కవితా ధోరణి లేకపోయినప్పటికీ, పద్మజ వాగ్మాధుర్యముగల వక్త ఈమె తీయనికంఠము గతించిన సరోజనీదేవిని నిరంతరమూ స్మృతికి తెస్తూ ఉంటుంది.

కుమారి పద్మజానాయుడు నివురుగప్పిన నిప్పు తానుచేసిన కృషిని బాహాటముగా చాటుకొనేది కాదు. రాజకీయపార్టీలలో చేరకుండా హిందూ మహమ్మదీయ ఐక్యతకు కృషిచేసింది. భారతదేశములో ఏమూల భూకంపము వచ్చినా, క్షామము, వరదలు సంఘటిల్లినా హైదరాబాదులో ఒక కమిటీ ఏర్పడేది. ఆ కమిటీద్వారా ధనరూపములో విరాళాలు, ఆహార పదార్థాలు, వస్త్రాలు దాతలవద్ద నుండి సేకరింపబడేవి పనిచేస్తే తమ గౌరవము ఎక్కడ పోతుందోనని భయపడే ఉన్నత కుటుంబినులు కూడా ఈ కమిటీలలో ఉండి కృషి చేస్తూ ఉండేవారు. వీరందరికీ కుమారి పద్మజా నాయుడు నాయకత్వం వహిస్తుండేది. ఆహార పదార్థాలు, వస్త్రాలు సేకరించటానికి ఈమె మూలమూలల ఉన్న గ్రామాల పర్యటిస్తూ ఉండేది.

ఇల్లిందల సరస్వతీదేవి



పద్మజా నాయుడు

పోలీసుచర్యకు పూర్వము, మాచిరెడ్డి పల్లెలో కుమారిపద్మజానాయుడు చూపిన ధైర్య సాహసాలు హైదరాబాదీయులు ఎన్నడూ మరువలేరు. బాధితులైన మాచిరెడ్డిపల్లె పడుచులు ఆ తల్లిని తలచుకోకుండా గుక్కెడు నీళ్లయినా త్రాగరు. ఆ పల్లెపడుచులపై పోలీసు దౌర్జన్యము నిరంకుశముగా సాగుతున్న సమయములో, ఆమె జ్వరముతో బాధపడుతున్నది. ఈ వార్త వినిన పడగానే

పద్మజానాయుడు

తన దేహారోగ్యాన్ని సైతం లక్ష్యపెట్టకుండా, తక్షణమే బయలు దేరింది. మాచిరెడ్డిపల్లెకు కొంతదూరము కారు ప్రయాణము; ఆటుపైన ఎడబండీ ప్రయాణము! అస్వస్థతగా ఉన్నప్పటికీ, ఆమె ముందుకు సాగిపోయింది ఆ గ్రామములో ప్రతి ఇంటినీ దర్శించింది. ప్రతి ఇల్లాలినీ పలుకరించింది. వారి కష్టసుఖాలను విన్నది. తాను విన్న సమాచారమంతా వెనుక ముందులు కలిపి చూసుకొన్నది. ప్రభుత్వానికి అందచేసిన సమాచారము ఒకతీరు; వాస్తవముగా జరిగిన దొక విధము! అంగులో దేనినయినా క్షమించవచ్చు — ఓర్చుకోవచ్చు — కాని స్త్రీలపైన జరిగిన అత్యాచారం క్షమించరానిది. ఆ జ్వర తీవ్రతతోనే ఆమె పల్లెకుచులను ఊరడించి, హైదరాబాదుకు బయలుదేరింది. పోలీసు దౌర్జన్యాన్ని గురించీ, వారి పరిపాలననుగురించీ తాను కన్నదీ, విన్నదీ ప్రభుత్వానికి నివేదించింది అది కఠోరసత్యమయినప్పటికీ, ఆమె వెనుదీయలేదు. నిర్భయముగా వ్యవహరించింది.

హైదరాబాదులో క్లిష్ట పరిస్థితు లేర్పడినప్పుడు, కుమారి పద్మజానాయుడు హిందూ మహమ్మదీయుల ఐకమత్యానికి నిర్విరామముగా కృషి చేసింది. పోలీసు చర్యానంతరము బాధితులను అనేక విధముల తోడ్పడ్డది. ఇండ్లు లేనివారికి ఇండ్లు, వస్త్రాలు లేని వారికి వస్త్రాలు, ఆహారము లేనివారికి ఆహారము, వసతి లేనివారికి వసతి కల్పించి సహాకరించింది. వృత్తి లేని వారికి వృత్తులను కల్పించి జీవనదాత్రి అయింది.


1950లో ఢిల్లీ శాసనసభకు హైదరాబాదు ప్రతినిధిగా మరి పదిహేను మంది సభ్యులతోపాటు కుమారి పద్మజానాయుడు కూడా ఎన్నుకొనబడ్డది. హైదరాబాదు విషయములో అతిశ్రద్ధతో కృషి చేసింది. ప్రతినిధుల సంఖ్యను హెచ్చించవలసినదిగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

ఈమెకు కళాభిరుచి మాతృదేవినుండి సంక్రమించింది. పల్లె ప్రజలయెడ ఈమె సహజ దయార్ద్రహృదయమే కుటీర పరిశ్రమల ప్రాపకానికి కృషిచేయ పురికొల్పింది. హైదరాబాదుకు స్వాతంత్ర్యము లభించిన తరువాత చేతి పరిశ్రమల సలహా సంఘానికి ఈమెను చైర్‌మన్‌గా నియమించారు. కళాభిరుచిగల పద్మజానాయుడు రాష్ట్రపతి నిలయాన్ని స్వయంగా అలంకరించింది ఆ నిలయాన్ని ఖాదీ, హిమ్రూ పని తనముగల వస్త్రాలతోను, కుటీర పరిశ్రమల సంస్థలలో తయారు అయిన వింత వస్తుజాలముతోను నింపి వేసింది


ఏభయి సంవత్సర్వాల వయసులో నయినా ఆమెలో ఉత్సాహమూ శక్తీ తగ్గలేదు బాల్యమునుండీ తల్లిదండ్రులూ అన్నదమ్ములూ ఆమెను ముద్దుగా 'బేబీ' అని పిలిచేవారు. సన్నిహితులు కూడా ఆమెను ఆ పేరుతోనే పిలుస్తూ ఉంటారు ఇప్పటికీ ఆమె అన్నగారయిన డాక్టరు జయసూర్య నాయుడు "బేబీ" అని పిలవగానే, ఆమెలో చిన్నప్పటి చిలిపితనమూ, బాల్యదశలోని ఉత్సాహమూ పొంగులు వారుతూ ఉంటాయి.

పద్మజానాయుడు పశ్చిమ బెంగాలుకు గవర్నరు అయిందనే వార్త అందగానే, పత్రికా విలేఖరు లనేకులు ఆమె దర్శనార్థము వెళ్ళారు "నేను బహుమాన ప్రశానోత్సవాలకూ సభలకూ అధ్యక్షత వహించటానిక వెళ్ళుతున్నా ననుకోవటము లేదు. ఆ రాష్ట్ర ప్రజలకు నాచేతనయినంత సేవ చేయటానికి వెళ్ళుతున్నాను ఆ పదవిని స్వీకరించటములో నా ఉద్దేశ్యము ఇదీ" అన్నది మందహాసముతో.

నూతన పదవీస్వీకారము చేసిన పద్మజానాయుడు పరిపాలనాదక్షతకు తగిన శిక్షణ తల్లివద్దనే పొందింది. రాజకీయ రంగములో అగ్రస్థాన మలంకరించిన భారత రమణులలో తల్లికి తగిన కుమార్తె అనిపించుకొన్న పద్మజానాయుడు మాతృదేవి అడుగుజాడలలో నడచి, తన కర్తవ్యాన్ని విజయవంతముగా పాలించగలదని ఆశిద్దాము. ★



"మరకతాసనముపై కొలువున్నది గులాబి" [కృష్ణశాస్త్రి]
ఫోటో: వై. రామకృష్ణరావు—బందరు




పరిమాణంలో పరిణామాలు

"బొట్టు" అనేది అనేక రకాలుగా పెట్టుకోవచ్చు. చాలామంది గుండ్రంగా దిద్దుకుంటారు కొంతమంది దోసగింజబొట్టనీ మరికొంత మంది చంద్రవంక అనీ ఇంకా కొంతమంది నక్షత్రంలాగానూ, ఇట్లా అనేక మంది అనేకరకాలుగా పెట్టుకుంటారు. ఏది ఎట్లాఉన్నా, భారతనారికి బొట్టు అతి ముఖ్యమైన అలంకారాల్లో ఒకటిగా ఉంటూ వచ్చింది. పండితుల దగ్గరనుంచి పామరులదాకా దానికి ప్రాధాన్యత ఇచ్చారంటే దానిలో ఏదో మాహాత్మ్యం ఉందనే ఒప్పుకోవాలి.

పూర్వం దేవతలు కస్తూరీతిలకం దిద్దుకునేవారుట ఇప్పటి "ఇమిటేషన్ దేవతలకు" కలాపీతిలకం అంటే మహామోజు (అమన్యకొన్నాళ్ళు ఈరకమైన తిలకానికి గిరాకీ

ఎం. సూర్యదుర్గ
(విజయవాడ)

హెచ్చిందికూడాను) ఇప్పుడు మళ్ళీ కుంకం తనపూర్వస్థానం ఆక్రమించుకుంది. మొదట్లో "బొట్టు" అంటే ఎంతో పవిత్రమైనదిగాను, విలువైనదిగాను భావించేవారు. రానురాను దాని పవిత్రతపోయి, విలువకూడా కొంచెం తగ్గి, అలంకార వస్తువుగా మాత్రం నిలిచిపోయింది

మా అమ్మమ్మ రాగికానీ అంత బొట్టు పెట్టుకుంటే, అమ్మ దమ్మిడీ అంతే పెట్టుకుంటుంది కాని వాళ్ళిద్దరికీ కూడా దాని విలువ తెలుసు. అక్కయ్య ఆవగింజంత బొట్టు పెట్టుకున్నా, దానికీ ఆ విలువ తెలుసనే అనుకోవాలి. నమ్మాలికూడాను. (పెళ్లయింది కనక.)

ఈ విధంగా చిన్నవవుతూ వచ్చిన ఆకారాలు ఈ 20 వ శతాబ్దిలో మళ్ళీ "ఇంతింతై వటు డింతయై" అన్నట్లు పెరగడం మొదలు పెట్టాయి. ఇప్పుడు ఏ స్త్రీ ముఖంచూచినా దమ్మిడీ అంత కుంకంబొట్టు కనిపించి తీరుతుంది. అంగులో కాస్త ఫాషనబుల్ గా ఉండి కొంచెం చదువు వచ్చును, అనుకునే వాళ్లయితే ఇంక చెప్పనే అక్కర్లేదు.

మా అన్నయ్య అభిప్రాయం

అసలు దీని పరిమాణం ఎటా పెరిగిందా? అని సందేహం కలుగుతూ ఉంటుంది ఈ

కుంకుమ చేసే పద్ధతి

బజారు కుంకుమ బాగా అతకదని, ఇప్పుడు పెట్టుకున్న బొట్టు ఇట్టె రాలిపోతుందని అందరూ అంటూ ఉంటారు. అలా రాలడానికి కారణం అది బజారు సరుకు కావడం. అందులో కల్తీ ఉంటుందన్నమాట

కావలసిన సరకులు కొనితెచ్చుకొని మనమే తయారుచేసుకుంటే, అలాంటి బెడద ఉండదు. పైగా, మనమే చేసుకున్నామన్న సంతోషం తృప్తి ఉంటవి తయారుచేయడం సులభం; చౌక.

కావలసిన సరుకులు: పసుపు కొమ్ములు ఏడు ఫలములు; కుంకుమ రాళ్లు ఒక్క తులం. ఈ కుంకుమరాళ్లు అనేవి పెసరగింజలంత ఉంటవి; మిల మిల మెరిసిపోతూను.

పద్ధతి: పసుపుకొమ్ములను ఒక రాత్రి అంతా నీళ్లలో నానేసి, మరునాడు శుభ్రముగా తెల్లనీరు వచ్చువరకూ కడగాలి. ఈ కొమ్ములు కడిగేటప్పుడు మొదట నీళ్లు పచ్చగా వస్తవి. ఆ రంగు పోయేవరకూ కడగాలన్నమాట. పుచ్చుకొమ్ములుంటే నీళ్లలో పైకి తేల్తవి వాటిని ఏరి పారేసి, మిగతా వాటిని ఎండబెట్టాలి గచ్చు నేల మీద గనక పోస్తే త్వరగా ఎండిపోతవి. ఏమాత్రం తేమ ఉండకూడదు. ఎండలు బాగా కనక కాస్తే నాలుగు ఎండలు చాలు.

ఆతరవాత రోలు శుభ్రంగా, తడి లేకుండా తుడిచి, బాగా గలగలా ఎండిన ఈ కొమ్ములు, కుంకుమరాళ్లూ వేసి మెత్తగా దంచాలి.

అప్పుడు, సన్నటి వాయిలుగుడ్డ శుభ్రమైనది తెచ్చుకుని, ఈ గుండను వస్త్రకాళితం చెయ్యాలి సూక్ష్మంలో మోక్షం అనుకుని జల్లించెయ్యడం మంచిది కాదు వస్త్రకాళితం చేసే కుంకం కాటుకలా మెత్తగా పడుతుంది.

పసుపుకొమ్ములు కడక్కుండానే కొందరు తయారుచేస్తారుగాని, అప్పుడు మంచిరంగు రాదు పైన చెప్పిన పద్ధతిలో చేస్తే, కొన్నాళ్లు నిలవుంచితే కలరు మరీ బాగుంటుంది. ఇంకోటి, పసుపుకొమ్ములు తగ్గిస్తే ఎరుపు ఎక్కువ వస్తుందనుకునేరు. అలా చేస్తే కుంకం నల్లబడి ఊరుకుంటుంది. జాగ్రత.

కొత్తపల్లి రాజ్యలక్ష్మి.
—(చిన్నగంజాము)

వందేహాన్ని అన్నయ్య ముందు వెల్ల డిస్తే. "ఏముంది! ఎవరో ఒక అమ్మాయి, వాళ్లయింట్లో ముసలమ్మ పోరుపడలేక ఒక రోజు పొద్దుస్నే పెద్ద బొట్టు పెట్టుకుని ఉంటుంది అది ఆపిల్ల ముఖానికి అందంగా కూడా ఉండి ఉంటుంది. దాంతో ఆ అమ్మాయిని చూసిన ఆడవాళ్లందరూ తాముకూడా అంతబొట్టు పెట్టుకుంటే, అంత అందంగానూ ఉంటా మనుకుని ఉంటారు. అంతే. ఆరోజు మొదలు అదే ఫాషనుగా మారిపోయింది." అన్నాడు ఇది విన్న ఏ స్త్రీ కైనా "స్త్రీలు తమువ్వంత బుద్ధిని ఉపయోగించకుండా గుడ్డిగా ఇతరులని అనుకరించడం వల్ల నేకదా ఇతిగాడు ఇట్లా అనగలిగాడు" అని తప్పక కోపం వస్తుంది. ఇతరులకి ఎట్లా ఉన్నా ముఖ్యంగా నాకు మాత్రం చాలాకోపం బాధ రెండూ కలిగాయి.

అసలు నిజానికి చిన్న నుదురు ఉన్న వాళ్లు పెద్ద బొట్టు పెట్టుకుంటే ఏంబాగుం టుంది చెప్పండి? అదేవిధంగా చాటంతముఖం ఉన్నవాళ్లు కనుపించీ కనుపించకుండా చుక్క పెట్టుకున్నా బాగుండదు. అసలు కంటికి ఆనదుగదా. ఈ సంగతి ఏమాత్రం ఆలోచించినా వెంటనే స్ఫురించకపోదు. కాని ఆలోచించకపోవడమే స్త్రీలలో ఉన్న బలహీనత అంటే ఒప్పుకోక తప్పదు (నిజంకనుక). పొట్టిగాను, సన్నంగాను ఉండి, చిన్న నుదురుకలవాళ్లు కందిగింజంత కుంకం పెట్టుకుంటే కొట్టొచ్చినట్టు కాకుండా సమంగా, బాగుంటుంది. భారీగా ఉండి కొంచెం వెడల్పైనముఖం కల స్త్రీలు, కొంచెం పెద్దదిగా (అంటే దమ్మిడీ అంత కాదు సుమండీ!) పెట్టుకుంటే అందంగా ఉంటుంది. ఇట్లా బొట్టు ఏవిధంగా పెట్టు కుంటే బాగుంటుందో ఎవరికి వారే స్వంతం గానే నిర్ణయించుకోవచ్చును. ఇదేమీ పెద్ద కష్టమైన పనికాదు కూడాను.

కొంతమంది స్త్రీలు బజారులలో అమ్మే రకరకాలైన మెరుస్తూఉండే బొట్లు కొను క్కొని అతికించుకుంటారు. పోనీ అట్లా పెట్టుకోవడంతో సరిపెడతారా? అంటే అదీలేదు. అదిపెట్టుకుని పొగ్గా ఏ పేరంటా నికో బయలుదేరుతారు పోనీ ఆవెళ్లేది ఏ పార్కుకో, సినిమాకో అయితే ఫరవాలేదు పేరంటంలో చుట్టూ చేరిన ముత్తైదువలంతా ఆ బొట్టుని ఒకసారి చేత్తో ముట్టుకుని చూసి, మరీ వదిలి పెడతారు అక్కడివాళ్లు కనక వారికి బొట్టు పెడితే ఎంత చీదరించు కుంటారో చెప్పలేను. ఆ సమయంలో వాళ్లముఖం చూచితీరాలి అసలు ఇటువంటి బొట్లు చిన్నపిల్లల కైతే సరదాగా పెట్టినా బాగానే ఉంటాయికాని, పెద్దవాళ్లకి బొత్తిగా బాగుండవు ఈమాటే మాఇంటి ప్రక్కనున్న రమణమ్మగారితో అంటే, ఆవిడ ఒకసారి ముఖం చిన్నదిచేసి, ఆ తరు వాత గట్టిగా నవ్వి, (ఆవిడకి కోపంవస్తే ఒక్కసారి మనంహడలి పోయేలాగ నవ్వే స్తుంది. అల్లాచేస్తే ఆకోపం ఎదుటివారికి తెలియదని ఆవిడ భర్తగారి సలహాట) "నా ముఖం! అసలు నీకు అందం అంటే ఏమిటో తెలుస్తేగా, మెరిసే వస్తువంటేనే ఎంత అందాన్ని ఇస్తుందో, మెరిసే బొట్టు ముఖా నికి అంతకు రెట్టింపు అందాన్నిస్తుంది" అంటుంది. ఆవిడ అమాయకురాలూ కాదు, పసిపిల్లా కాదు. ఇటువంటి వాళ్లని చూసి ఏమంటాం?

మొగాడయినా సరే ఆడదయినా సరే, అలంకరణ విషయంలో సిద్ధాంతాలను అనుస రించడం, లేదా పక్కవాళ్ళని అనుక రించడం మంచిదికాదు. రాణించదు. తమతమ శరీరప్రకృతులకు తగినది ఏది అని ఆలో చించుకొని అలంకరించు కొంటేనే నప్పు తుంది ★

ప్రతి విమర్శ:

మనపద్ధతుల లోపాలే మనకి చర్చనీయాలు

ఏ విషయాన్నయినా చర్చింప బూనుకున్నప్పుడు వాటిలోని మంచిచెడ్డలను వివరించాల్సి వుంటుంది. 'మంచి' ఎప్పుడూ అనుసరణీయమే, కొబట్టి మంచి విలువ ఎప్పుడూ తగ్గదు, మారదు పోతే 'చెడు' అనేదే చర్చనీయాంశం ఈ చెడు వలన జరుగుతూన్న కష్టనష్టాలను విమర్శించి, అందుకు తగిన నివారణోపాయములను ఆలోచించడం సహజము ఈ అభిప్రాయంతోనే నా వ్యాసంలో (ఆడపిల్లల చదువు అవసరమైన మార్పులు), ఇప్పటి విద్యావిధానములోని సాధకబాధకాలను వివరించాల్సి వచ్చింది

'స్త్రీకి ప్రత్యేక విద్యాశిక్షణ అవసరము అన్నది, కేవలము నా ఆశయమే కాదు. ఈ సంస్కరణము బహుజనామోదము పొందినది

“పురుషునకువలెనే స్త్రీకికూడా విద్య అవసరం. అయితే, విద్యాబోధనా పద్ధతులు మాత్రము స్త్రీ పురుషులిద్దరికీ ఒకేవిధంగా ఉండరాదు” అని పూజ్యబాపూజీ పలుమారులు స్పష్టంగా చెప్పారు

అంతేకాదు ప్రస్తుత విద్యావిధానంపై, గాంధీజీ అసంతృప్తినికూడా వెలడించారు. స్త్రీలకు విద్యాబోధన చేసే విధానాలన్నీ లోపభూయిష్ఠంగానూ, హానికరంగానూ ఉన్నాయని, “Conquest of Self” అనే గ్రంథంలో ఆయన విమర్శించారు ఏ విధంగానూ, ఈ నాటి విధానాలు సముచితమైనవన లేమన్నారు.

ఇక యిటువంటి చదువులో లోపములు లేవనీ ఉన్నదల్లా మానసిక ప్రవృత్తుల్లోనే అనీ సర్దిపోవడం సాహసం అనిపించుకుంటుంది.

నవంబరు 28 వ తేదీ వారపత్రికలో శ్రీమతి ముత్తుకుమల్లి సుశీలగారు నా వ్యాసంలోని కొన్ని అంశాలను విమర్శించేరు వారి సంశయాలను పురస్కరించుకొని నా అభిప్రాయాలను వివరిస్తాను

శిశు సంరక్షణ, బాధ్యతా పరిజ్ఞానము

విద్యావతులకు ఆయాలు వారివారి ఆర్థిక స్తోమతును తగినట్టే దొరుకుతారు. గొప్పవారికి పెద్దదాదులు దొరికితే, మధ్య తరగతి వారికి చిన్నదాదులు వున్నారు. పది లేక పన్నెండేళ్ళ వయసుగల ఆడపిల్లలు నాలుగు లేక ఐదు రూపాయిల జీతంతో దొరుకుతారు. వీళ్ళు ప్రొద్దున పిల్లలు లేచిన దగ్గర నుండి మళ్ళా రాత్రి పిల్లలు పడుకునే వరకు పిల్లల సంరక్షణంతా వాళ్లకు తోచినట్లు చేస్తారు. యిలాంటి దాదులమీద పిల్లలను విడిచిన వారిని చాలమందిని ప్రత్యక్షంగా చూచిన సంగతే వివరించేను

యిక వాచీ చూచుట తెలియని తల్లులు ఆయాలమీద పిల్లలను వదలి కార్లలో షికార్లుకొట్టుట అనేది, సామాన్యమే. వాచీ చూచేపాటి విజ్ఞానంలేని తల్లులు పిల్లల సంరక్షణలో ఉదాసీనం వహించడం, ఆయాలమీద వదలడంలో విశేషం ఏముంది?

బళ్ళ అహల్యాదేవి
(భోజ్‌దీ - బీహార్)

ఇక, కళాశాలలో చదివే అమ్మాయిలు ఇంట్లో తమ్ముళ్ళ చెల్లెళ్ళ పోషణభారం వహించి, తల్లులకు వంటలో సహాయం చేస్తారన్నది నిజమే. కాని, నేను, స్థూలంగా ఈనాటి స్థితిగతులను, సర్వసాధారణంగా కనబడే మనుష్యులను దృష్టిలో ఉంచుకొని విమర్శ చేశానని గమనించాలి. విమర్శ చేసినప్పుడు ఎవరైనా అంతే తల్లికి సాయం చేసేవారు చెల్లెళ్లను తమ్ముళ్లను సంరక్షణ చేసేవారు చదువుకొన్నవారిలో అసలు లేరని నేను అనలేదు కాని అటువంటివారు బహుకొద్దిమందే అని

మాతృత్వం అనేది అందరిలోనూ ఒకేరకమైన అనుభూతుల్ని కలిగించవచ్చు. కాని నిత్యజీవితంలో దాని ప్రభావం ఎంత ఉంటున్నదన్న విషయం ఆలోచించాలి. ఆయాలంటూ వున్నవాళ్లు చాలమంది వుంటారు. మరి ఆదరించేవాళ్ళ మాత్రం చాల తక్కువ. నోటితో చెప్పేదానికి, చేతితో చేసేదానికీ చాల తేడా వుంది. అందుచేతనే ఈ అనుభూతుల్ని లెక్క చేయనట్లుగానే కనబడుతారు ఇక బాధ్యతా పరిజ్ఞానం కలిగివుండుటకూడ ఆ మాత్రమే. అసలు బాధ్యతాయుక్తమైన విద్య ఆడపిల్లలకు నేర్పితే కదా ఈ బాధ్యతా పరిజ్ఞానం కలిగిఉండడం. ఈ విషయంలో మన మహాత్ముని ఆదేశము జ్ఞాపకం చేసుకోదగింది

“గృహనిర్వహణ అనేది పూర్తిగా స్త్రీల బాధ్యత అందుచేత, గృహపరిపాలనలో - పిల్లల పోషణలో, పెంపకంలో, వారికి చక్కని విద్యాబుద్ధులు అబ్బేటట్లు చూడడంలో స్త్రీలకు ప్రత్యేక పరిజ్ఞానం ఉండాలి పురుషులకన్న వారికే ఈ విషయం మరింత సమగ్రంగా తెలిసి ఉండడం అవసరం” అని మహాత్ముడు ఈ విషయమై వ్రాశారు.

“పిల్లలకు క్రమశిక్షణ యివ్వలేకపోవటం తల్లి దండ్రుల లోపమేకాని విద్యావిధానంలో లోపంకాదు” అన్నారు సుశీలగారు. ఇది ఎంత అపసవ్య హేతువాదనో తెలుస్తూనే వుంది. ఈనాటి తల్లులందరూ కొద్దో గొప్పో ఈ విద్యావిధానంలో శిక్షణ పొందినవారే కదా. అటువంటివారు యిచ్చే పిల్లల క్రమశిక్షణలో లోపం వున్నదంటే అది విద్యావిధానానిది కాదనడమెలాగ. కాబటి సుశిక్షిత భావి భారత పౌరులను తయారుచేయుటకు ఆడపిల్లల చదువులో మార్పులు కావాలి. కనీసం సుశీలగారు చెప్పినట్లు తల్లుల క్రమశిక్షణలో పనులను సరిదిద్దుటకయినా, విద్యా సంస్కరణము అత్యవసరము

అజ్ఞానము, విజ్ఞానము

“ఒకేపనిని చదువుకున్న స్త్రీ, చదువుకొనని స్త్రీ చేస్తే, అందులోనిలోపం, చదువుకున్నామె చదువుకీ, చదువుకొనని ఆమె అజ్ఞానానికి ముడిపెట్టటం మనకి అలవాటయింది ”

ఇది కేవలం అలవాటుకాదు, సహేతుక వాదనే అవుతుంది పిల్లలు ఏదైన చిలిపి చేష్టలు చేస్తే, ఏదో చిన్నతనమని సరిపెట్టుకుంటాం అదే పెద్దవాళ్ళు చేస్తే వెకిలిచేష్టలు

(42 వ పేజీ చూడండి)

నిజం చెప్పాలంటే :

మనకితెలియదనికాదు కాని...

చిన్న రకం నరకం

పిల్లా మేకా బిలబిల్లాడుతూ తిరుగుతూ ఉంటే ఇళ్లయిళ్లా కలకలలాడుతూ కన్నుల పండుగగా వుంటుంది. అలాటి కుటుంబాలలో చీలికలు రావడం, కాపురాలు వేరు కావడం ఎవరికేనా బాధాకరంగానే ఉంటుంది; అయితే, ఇంట్లో పొరపొచ్చాలు పెరిగి ఇంట్లో ఎవరికివారు చిరచిరలాడుతూ ఉంటే మరి బాధగా ఉంటుంది. అలాటి ఇళ్లనిచూస్తే ఇవి చిన్నరకం నరకాలా అనిపిస్తుంది

"అన్నయ్య అడగ్గానే వందలకి వందలు ఇచ్చేస్తారు - మా కీయటానికయితే చేతులు రావం"టాడు వాసు వాళ్లమ్మను.

వాసు అంత మాట అనడానికి ముందు అతని హృదయంలో ఎన్ని తుఫానులు చెలరేగిఉండాలో మరి నిష్కారణంగా ఎవడూ అలా అనడుగదా. మాధవ నిర్దయమో మానవ నైజమో అంతు పట్టటం లేదుగాని, పదిమందిఉన్న కుటుంబాలలో ముఖ్యంగా, ఈ రకమైన అన్యాయాలగురించి, పక్షపాతాలగురించీ కీచులాటలు వినబడతాయి మనం నిష్పక్షపాతంగా ఆలోచిస్తే, ఈ విధమైన భిన్నదృష్టులే సమిష్టి కుటుంబాలు విడిపోవటానికి కారణమనిపిస్తుంది.

అత్తకోడళ్లు, ఆడపడుచుల, తోటికోడళ్ల స్పర్థలను కొంచెమైనా అర్థంచేసుకోవచ్చు కాని తల్లే తన పిల్లల్ని "చెరో కంటితోటీ" చూసిన సందర్భం నేను చూశానంటే నమ్ముతారా ?

నాకే నమ్మ బుద్ధి పుట్టలేదు నే నెరిగిన ఒకావిడుంది. ఇద్దరుకొడుకులు. చిన్నవాడంటే ఆవిడకు ఎక్కడలేని అపేక్షను ఇంక పెద్దకొడుకు స్ఫటికంలాటి మనిషి. మెత్తనివాడు. నోరూ వాయీ లేదు. గట్టినమ్మకాలు లేవు ఇవ్వాళటి దృఢవిశ్వాసం రేపు చాలా మామూలు కారణంవల్ల తప్పిపోతుంది. కళ్లెదుట మోసం జరుగుతున్నా కావలేనివాడు తెలియచెప్పినా పట్టించుకోడు.

కాని, పాపం అతనిభార్య, తనభర్త ఇంట్లో ఇంత తేలికగా చూడబడటం సహించలేకపోయింది మనుషులు వేరుల్లయితే తప్ప ఇటువంటి పరిస్థితుల్లో మనస్పర్థలు రాకమానవు ఆమెకికూడా, క్రమంగా, ఇంట్లోవారంటే, కోపం అసూయ కలిగి పెరగసాగాయి. ఆవిడ ఆ అంతర్యుద్ధానికి తట్టుకోలేకపోయింది. భర్తకి నచ్చచెప్పి, వేరే కాపరం పెట్టించింది చివరకి

ఇంకేం చేయగలదు ? ఒకచోట ఉండి, ఎల్లవేళలా ఒకళ్లనొకళ్లు అసహ్యించుకుంటూ ఇళ్లను చిన్నరకం నరకాలు చేసుకోవడం కన్న, వేరేగాఉంటూ అభిమానం, గౌరవం పెంపొందించుకోవడం మంచిదిగదా.

ఇంకోటి; ఇరుగుపొరుగులంతా, ఆ పిల్లని ఎలా ఆడి పోసుకుంటున్నారో ఆమెకు తెలుస్తూనే ఉంటుంది. కాని, "నీతి ప్రౌఢ వివేకులైన నిపుణుల్ నిందించనీ మెచ్చనీ" అన్న భర్తృహరి సుభాషితాన్ని తలచుకుని ఒక నిట్టూర్పు విడుస్తూంటుంది.

వంకిపేని జానకీ దేవి—(ఏలూరు)

* * *

ఇరుగు పురుగులు

కొందరున్నారు. వారు ఎల్లప్పుడు వారి యొక్క గొప్పతనాన్నే వెల్లడి చేసుకుంటూ, దానిగురించే మాట్లాడుతూ ప్రాణం విసుగెత్తిస్తారు. వీరివల్ల ఇంతకుమించి ఎటువంటి హానీ లేదు. ఇంకొందరు, ఎదటివాళ్లు మనస్సులు నొచ్చుకునేలా మాట్లాడి సంతోషపడతారు. వీరుకూడా అంత ప్రమాదకరం అయినవారు కారు.

ఇంక, మూడవరకమువారు వీరందరిని మించిపోతారు వీరిని ఇరుగుపొరుగులనడం కన్నా, ఇరుగు పురుగులు అనవచ్చును. ఆ యింటి గొడవ ఈ యింటికీ, వీరింటిగుట్టు వారింటికీ చేరవెయ్యడమే వీరి నిత్యకృత్యం. ఎక్కడ ఆలిమగలూ, అత్తకోడళ్లూ కీచులాడుకుంటారా అని వీరు చెవులు రిక్కించుకు వింటూ ఉంటారు ఉన్నవికొన్ని లేనివికొన్ని పట్టుకుని ఇంకోచోటికి ఆ మాటలు కాసినీ మోస్తేకాని వీరికి నిద్రపట్టదు ఇది విశ్వైకధర్మంగా భావిస్తారు కాబోలు

ఈరకమువారివల్ల, ఎన్ని స్నేహాలు నాశనమై పోతున్నాయో, ఎన్ని కుటుంబాలు దెబ్బతింటున్నాయో చెప్పలేము.

నిజానికి ఈ మాటలు మోసేవాళ్ల సంగతి అందరికీ తెలిసిందే.

ఈ గుణం అలవాటు పడ్డవాళ్ళని ఒకంతట మార్చలేము ఎవరూ చాడీలు, పుకార్లూ చెయ్యకూడదు అని శాసనాలు చెయ్యలేము అలాగని అసలీ సమస్య పాతదికదా అని అంతకన్న వూరుకోలేముగదా. ఇంతకీ ఈపని చేసేది మనతోటివాళ్లే పాటివాళ్లే వాళ్లని నొప్పించకుండా నిరుత్సాహపరచాలంటే ఒకటే మార్గం. మనం నీతు లేమీ చెప్ప నక్కరలేదు.

చాడీలు-నిజమైనా అబద్ధమైనా సరే. వినకపోవడం. చెప్పేమనిషి సగం సగం చెప్తూ ఉండగా హఠాత్తుగా మధ్యలో మాట మార్చేసి, మిగతాది వినకపోవడం. నేనిల్లా చేశాను ఇప్పుడు నాతో చాడీలు చెప్పేవాళ్లు తగ్గిపోయారు

అసలు నన్నడిగితే ఇంకోటి చెప్తా. చాడీలు చెప్పేవాళ్లకన్న వాటిని చెవిని బెట్టేవాళ్లనే ముందర దండించాలి.

వెనకటికొక రాజుగారు "పితూరీలు చెప్పే వాడి సంగతలా ఉంచుగాని, ముందర, వినేవాడి చెవులు రెండూ కోయుము" అని ఉత్తర్వు జారీచేశారట

సి. ఆర్. దేవి—(కర్నూలు)

* * *

మీకు తెలుసని నాకు తెలుసు

మీకు తెలుసునని నాకు తెలుసును. మన అందరికీ తెలుసును కాని సమయం వచ్చినపుడు మనం అనేక చిన్న సమస్యలని ఎలా ఎదుర్కోవాలో తెలియక తికమక పడతాం మనకి మంచిదని తోచిన పనిని చేయుటకే ఎంతగానో భయపడతాము. ఏమని? ఎదటివారు ఎవరైనా ఏమనుకుంటారోఅని ఉదాహరణకు చూడండి మనకి పనికిరావు అనిపించే వస్తువులు అనేకం నిజంగా ఉపయోగపడేవే మనం అలా పనికిరాని వాటిని పదిలబరుచుకొని ఎందుకో ఒకందుకు అనుర్చుకొంటే, సహించ లేనటువంటివారు హేళన చేస్తారు నేను ఇలా చెప్పినందుకు ఏమీ బాధ పడటంలేదు ఎందుకంటే, ఒకరు మంచిపని చేస్తున్నప్పుడు హేళనచేసి నిరుత్సాహపరచే వారిని సహించలేనివారు అంటే తప్పేముంది కనక ?

ఇక, తప్పు ఉన్నదలా, అలాంటి హేళనలకు భయపడే వారిలోనే. ఎందుకంటే, చాలామంది హేళనకు భయపడి, కొరమాలినవని అందరూ అనుకునేవాటిని మరల ఉపయోగించడం తమకు బాగా తెలిసినప్పటికీ. తమ హోదాకు ఎక్కడ భంగము కలుగునోయని వాటిని పారవేయడం నేను చూచాను. ఇది మన ఆత్మగౌరవానికి

ధంగం అంటాను నేను. మనలను మనమే అవమానం చేసుకోవడము. ఎదటివాళ్లు హేళనచేస్తే మనము వారిని ఖాతరు చేయవలసిన పనిలేదు. ఇంకొకటి. ఈలా హేళన చేసేవారిలో అమాయకులు కూడా ఉంటారు. వారివలన మనకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఇంక రెండవ రకమువారే. మనని కొంచెం కష్టపెట్టగలరు. వీళ్లు ఇక్కడా అక్కడా అని కాకుండా, సరిగా ఏ పేరంటానికో వెళ్ళేప్పుడు చూచి "ఏమండీ మీరు కట్టుకున్న జాకెటు, ఏడాది క్రితం నాతో కలసి కొనుక్కున్న చీరలోనిది గాదుటండీ" అని గభాలున అడిగి వేస్తారు నవ్వుతూ ఇంకొందరు మనము అక్కడ లేకపోతే "ఏమండో విన్నారా వారింట్లో ఇట్లా వీరింట్లో అట్లా నమండీ" అని పితూరీలు చెప్పినట్లుగా చెప్తారు చెవులొగ్గి వినేవారుంటే, వీరి పోకడలు మరీ విపరీతంగా ఉంటాయి ఈ సందర్భములో నే, లేని గొప్పలకు పోవాలని ఉబలాటము పడేవారి విషయం కూడా వ్రాయదలచుకున్నాను. ఎరువుసొమ్ము బరువు చేటు అని మన పెద్దలు ఏనాడో చెప్పారు. ఒకరింట సరుకు ఎరువు తెచ్చుకున్న అప్పటినించి, దాన్ని పదిలంగా వారికి చేరవేసే వరకు బెంగగానే ఉంటుంది పోతే నష్టం అచ్చుకోవాలిమరి. ఇది ఇలాఉండగా, ఈ హేళన చేసేజాతివారున్నారే వీరికి లీలగానేనా తెలిసిందా, కసితీర్చుకున్నట్లుగా, "ఎవరిదమ్మ ఇది? నీ దగ్గిర ఇదివరకు ఎప్పుడూ చూడలేదె ఎరువు సరుకా ఏమిటి" అని రహస్యంగా అడుగుతున్నట్టే నటిస్తూ, అందరికీ వినబడేలాగ గట్టిగా అంటారు

ఇలా హేళన చేసేవారికి తెలుసునో తెలియదోగాని, హేళనకు గురిఅయిన వారికన్న హేళన చేసినవాళ్ళే నలుగురిలోనూ వెల్తి పడిపోతారు. మనకి కనబడని పొరపాట్లలో, మంచివికాని గుణాలలో మార్చుకోవ తగినవి సవాలక్షా ఉన్నాయి. అందులో ఇటువంటి చిన్న ఇబ్బందులే ఎక్కువ.

వి. ఆర్. దేవి—(తెనాలి)

* * *

కొత్త రకం ఫాషన్

పెళ్ళిళ్లు, సంతర్పణలూ, ఇతర శుభ కార్యాలూ జరిగినపుడు, కొంతమంది ఆహార పదార్థాలను వృథాచేయడం గొప్ప అన్న ధోరణిలో ప్రవర్తిస్తున్నారు. ఇది ఈమధ్య మరీ ఎక్కువ అయిపోతున్నట్లు కనబడుతోంది. ఒకరిని చూచి, మరి ఒకరు తెలుగు మీరుతున్నారు

ఏమిటంటే, పిల్లలు అన్నం తిన్నపుడు అన్నం, కూరలూ కంచం చుట్టూరా విరజిమ్మటం మామూలే. కాని పెద్దవాళ్లు ఇపుడు ఈ ముచ్చట మొదలు పెట్టారు. ఫలానావిడ ఆమె చాలా తక్కువ తింటుం దనిపించుకోవాలని రెండు మూడు ముద్దలు మాత్రం తిని తక్కిందంతా అవతల పారవేసే స్త్రీలను నేను కళ్ళారా చూశాను ఇందులో ఇంకో ఫాషన్ ఉంది. ఏకూరో బాగుందని, ఆకులో ఉన్నదంతా తినేశారనుకోండి అపుడు, అడిగి అడిగి ఇంకొంత కూర వేయించుకుంటారు. ఇది తినడానికి కాదు పారవెయ్యడానికి!

ఇక, వడ్డించేవారు ఇంకో ఆకు ఎక్కువ చదివినటు కనబడుతుంది. అతిథుల మొహమాటపడతారని, వాళ్లు ఎంతగా వద్దంటున్నా వినకుండా ఎక్కువగా వడ్డించడం, వాళ్లు చివరకి పారవెయ్యడం, అదంతా నష్టం కావడం జరుగుతోంది. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అన్నారు దాన్ని నిర్లక్ష్యం చెయ్యడం మహాపాపం అని చెబుతారు. పొదుపు గురించి ఉపన్యాసాలు చెప్పే వాళ్లు ఈ ఫాషన్ ఊరూరా వ్యాపించిపోకుండా మార్గాలు చూడ్డం మంచిది ★

ఎం. అనసూయ—(తణుకు)

మనమాటల మరమ్మత్ :

బాలవ్యాకరణం

నాది "ఆత్మవిశ్వాసం;" నీది "తిక్క" వాడిది "మరీ మొండిపట్టు".

పట్టుదల అనే ఒక్క విషయం గురించి చెప్పుకున్నప్పుడు మనుష్యులనిబట్టి ఈ పేర్ల రూపాలు మారుతాయి మనం మారుస్తాము అన్నమాట తెల్లారి లేచింది మొదలు అస్తమానం వరకూ మనం అనేక విషయాల గురించి, అనేకమంది గురించి మాట్లాడినప్పుడు, మనం అభిమానాలు, అహంకారాలూ, పక్షపాతాలు, ఈర్ష్య మొదలైన వాటి ఫలితంగా ఒక్క విషయాన్నే అనేక రకాలుగా చెపాం.

సి. వి. విజయలక్ష్మి

[మద్రాసు]

నేను, నువ్వు, వాడూ అనే మూడు కర్తలను బట్టి ఈ మాటలు మారుతాయి మనకి బాగా వంటబట్టిపోయిన రాగద్వేషాల మూలంగానే మనం కొన్ని రకాల మాటలని ఉపయోగిస్తామని, న్యాయంగా, సబబుగా ఆలోచిస్తే ఆ మాటలు నిందతో కూడినవి, నిష్కారణంగా అనేవి, ఎదటి మనుష్యుల మనస్సులను నొప్పించేవి, ఎదటి వాళ్ల దృష్టిలో మనలను చులకన చేసేవీ అని నా అభిప్రాయం

"తిన్నతిను, ఎదటుమధ్యమ ఎక్కడో ప్రథమ" అని పురుషత్రయానికి మాతాతగారు కొండగుర్తులు చెప్పేవారు అంటే, తెలుగు వ్యాకరణములో, ప్రథమ పురుష అంటే వాడు, మధ్యమ పురుష అంటే "నువ్వు" ఉత్తమ పురుష అంటే "నేను" అన్నమాట.

ఇంగ్లీషులో ఈవరస తిరగబడుతుంది. వాళ్లు "నేను" కే ప్రథమ స్థానం ఇచ్చారు. ఇంగ్లీషు గ్రామరులో ఫస్ట్ పర్సన్ (ప్రథమ పురుష) అంటే నేను. సెకండ్ పర్సన్ (మధ్యమపురుష) తెలుగులోలాగే నువ్వు. తెలుగులో ప్రథమపురుష అయిన "వాడు" ఇంగ్లీషులో థర్డ్ పర్సన్ అవుతుంది.

వ్యాకరణం మన కల్చర్ కి ఆధారం అని నే నేమీ అనటంలేదు గాని, రోజూ మనం మంచీ చెడ్డా మాట్లాడినపుడు మనకి తెలియకుండానే భేదాలతో మాట్లాడుతాము అనిపిస్తుంది ఈమాటల్ని కొంచెం ఆలోచించి మరీ వాడితే, స్వంతానికి కొంచెం మరమ్మతు చేసుకున్నట్లవుతుందని నా అభిప్రాయం. నోరు మంచిదైతే ఊరు మంచిదన్నారు. అందువల్ల అపుడు మనతోపాటు, మన చుట్టూ వుండే వాళ్ళూ—లోపాలుంటే పోగొట్టుకుని మారుతారు అని నా అభిప్రాయం

నే నేం నీతిపాఠాలు చెప్తానంటం లేదు కాని, కొన్ని శాంపుల్స్ నేను విన్నవి కన్నవీ (అన్నవి కూడా రెండు) ఇక్కడ రాస్తాను ఆపైన మీ యిష్టం.

కొత్త చోళీ

ఉత్తమ పురుష: (మనం తొడుక్కున్నపుడు) "ఇది లేటెస్ట్ ఫ్యాషన్ తెలుసా?"

మధ్యమ: (ఎదటిపిల్ల వేసుకుంటే) అదేమిటోయ్ ఆ చేతులు అంత పొడుగు పెట్టించావు-మరీ పోలగొట్టాల్లాగ?"

ప్రథమ పురుష: (ఎదటలేనిపిల్లగురించి)

బాలవ్యాకరణం

"ఆ సీత తొడుక్కుంటున్న 'రవిక' 1904 లో మా బామ్మ తొడుక్కున్న రకం.

డాబుసరి చీర

ఉత్తమ: చాలా బ్రైట్‌గా కంటికి నదురుగా ఉందికదూ ఈ చీర?

మధ్యమ: ఆచీరె ఇంకో అమ్మాయికట్టుకుంటే ఏమండో నువ్వేమనుకున్నా సరేగాని, నీచీర రంగు మరీలౌడ్‌గా ఉందిసుమీ.

ప్రథమ: సీత ఆ చీర కట్టుకుంటే, ఒకి గంగిరెద్దులా ఉంది దానికసలు 'టేస్టు' లేదు

అతివాగుడు

ఉత్తమ. వినేవాళ్ళుంటే అలా సరదాగా కబుర్లు చెప్తూ ఉండటం నాకెంతో సరదా. నేను లేకపోతే ఇల్లు చిన్నబోతుందంటారు మా నాన్నగారు.

మధ్యమ: ఇదుగో ఏమండో; మనం - ముఖ్యంగా ఆడపిల్లలం మితంగా మాట్లాడ్డం నేర్చుకోవాలి ఒక్క చిన్న సంగతి చెప్పడానికి అంతసేపెంగకు పడుతుంది నీకు?

ప్రథమ: ఆ పోదూ, ఆ సీత మరీ ఎడతెరిపిలేకుండా, వసపోసిన పిట్టలాగ బడబడ వాగుతుంది. చెవులు హోరెత్తి పోతున్నాయి, నాకు.

కోపం

ఉత్తమ: నాకు ఒళ్ళు మండిపోతోంది అన్యాయం చూస్తున్న కొద్దీ

మధ్యమ: నువ్వు అలా కంగారు పడిపోకూడదు

ప్రథమ ఆపిల, గోరంతని కొండంత చేసి ఎంగుకలా గోలెత్తిపోతుందో! ఛీ, మరీ అన్యాయం

తీరు

ఉత్తమ: ఎవరేమనుకున్నా నాకుభయం లేదు. నేను నిర్మొహమాటంగా కుండబద్దలు గొట్టినట్టు ఉన్నమాట అనేస్తాను

మధ్యమ: మీరు తొందరపడుతున్నారు అనవసరంగా. అలా ఖళ్ఖళ్ మంటూ మాట్లాడ్డం మంచిదికాదు

ప్రథమ: అతను మరీ ముందూ వెనకా లేకుండా నోటికొచ్చినట్లల్లా వాగుతాడు. కల్చర్ లేగు బొత్తిగా. పల్లెటూరి గబ్బిలాయిలా ఉన్నాడు.

మాట తప్పుట

ఉత్తమ: నేను మళ్లీ జాగ్రత్తగా ఆలోచించి, నా అభిప్రాయం మార్చుకున్నాను.

మధ్యమ: నువ్విలా ఇట్టే నిమిషానికోసారి మనసు మార్చుకుంటే ఎలా చెప్పు.

ప్రథమ: దానికసలు మాటనిలకడ, నిజాయితీ లేవు రెండు మూడు నాలికలున్నట్లున్నాయి పచ్చి అబద్ధాలనుకో దాని మాటలన్నీ.

ఉత్తమ: నాది ధృఢ నమ్మకం.

మధ్యమ: నీది మొండిపట్టుదల

ప్రథమ: దానికి ఎంత అహంకారం ఎంత పొగరు!

★

ప్రతివిమర్శ

(39 వ పేజీ తరువాయి)

అని అసహ్యపడడం, సహజమేకదా. చదువుకోనని ఆమె ఎలాగా అజ్ఞానురాలే, ఆమె చేసేది అజ్ఞానమైనదే, మరి అప నే విద్యావతీ విజ్ఞానవతీయైన ఆమె చేస్తే అది ఆమె విజ్ఞాన సముపార్జనలోపం అనుకుంటే తప్పేముంది?

అనుభవము

అనుభవమంటే స్వయంగా చేసి అనుభవించడమనే అర్థమేకాదు. ఒకరు చెప్పింది, చేసిందీ, చూసి అర్థం చేసుకొని అనుభూతిని పొందడాన్ని కూడ అనుభవము అంటారు మాటవరుసకు చూడండి సినిమాకు వెళ్తాం. సినిమా బొమ్మలో నాయకిపొందే దుఃఖాన్ని చూసి మనమూ విచారాన్ని అనభవిస్తాము నాయకి ఆనందాన్ని చూచి మనమూ సంతోషిస్తాము. నాయకి స్థితిలో ఉండకుండానే చూచి మనం ఆఅనుభవంపొందే మన్నమాట. సుశీలగారు, 'పిల్లల పెంపకంలోను, భర్తను ఆదరించి, ఆనందింపజేయుటం విషయాల్లోనూ Practical Training ఇచ్చుట గురించి ఆలోచించి శ్రమపడ్డారు ఈ విషయాలకు కాలేజీలో సైన్సు Practicals వంటి వేమీ అవసరంలేదు కావలసినదల్లా, సమగ్రంగా శాస్త్రోక్తంగా బోధించే బోధనా పరిజ్ఞాన సంపద.

"విద్యావతులుకాని స్త్రీలు పిల్లల పెంపకాల్లో, భర్తని ఆదరించి, ఆనందింప చేయుటలో, వివాహాత్పూర్వమే అనుభవం కలిగి వుంటారేమో నేను గ్రహింపలేకుండ వున్నాను" అని సుశీలగారు తమ అనుమానాన్ని వెలడించేరు.

విద్యావతులుకాని అమ్మాయిలు, ఇంట్లోనే ఉండి తల్లుల వెనుక, పనిపాటల్లో సహాయపడుతూ వుంటారు తల్లి పసిపిల్లలకు చేసే సంరక్షణ చూస్తూ వుంటారు తల్లికి వీలుపడని సమయాల్లో, వీళ్లే పిల్లల సంరక్షణ చేయడంకూడ పరిపాటి. ఇంకా తన తండ్రిని, తల్లి ఎట్లు ఆదరిస్తుందో గమనిస్తూంటారు. ఇట్లు వివాహాత్పూర్వమే "అవిద్యావతులు" పై అంశాల్లో అనుభవం కలిగి వుండవచ్చు. దీనిలో ఆశ్చర్యమేమీ లేదు ఇంతమాత్రం గ్రహింపకపోవుట చాల శోచనీయం ఇంకా యిటువంటి సంకుచిత అనుమానాలకు విపరీతార్థాలకు దోహద మివ్వడం సాటి వనితలకు బాధ కలిగిస్తుంది

స్త్రీలు. ఉద్యోగాలు

ప్రతి స్త్రీ విద్యావతిగ, విజ్ఞానవతిగ ఉండాలి ఆమె నేర్చే విద్య, కళాసంపన్నమై, తన సహజశక్తుల నినుమడింప చేసేదిగా వుండి, ఆ విద్యలోనే స్వయంపోషక శక్తి కలిగి వుండాలి. స్త్రీలు ఉద్యోగాలు చేయుట అనేది వారి వారి ఆర్థిక పరిస్థితుల బట్టి వుంటుంది. అంతేకాని ప్రతి ఒక్కరూ వుద్యోగాలుచేస్తాం, అనుకుంటే "అందరూ అందల మెక్కితే మోసేవారెవరు" అన్న సామెత లాగున వుంటుంది. అప్పుడు ఈ గృహసంరక్షణలు, లలితకళలు ఎవరిపాలు కావాలి? మరి మన ప్రభుత్వం స్త్రీ సంక్షేమానికీ, కళాసముద్ధరణకూ 75 లక్షల వ్యయంతో సాగిస్తూన్న స్త్రీ సంక్షేమ కార్యక్రమాలు, కళాకేంద్రాలు యేమయేట్టూ?

కాబట్టి ప్రాథమికంగా ప్రత్యేకశిక్షణ అభ్యసించిన తరువాత, స్త్రీలు వారి వారి అభిరుచుల్నిబట్టి అర్థిక పరిస్థితినిబట్టి ఉన్నత విద్యలను అభ్యసించిన ఉభయత్రా శ్రేయస్కరము. ★

★ ఆడబడుచులా-ఆడంబరాలు ★

(26 వ పేజీ తరువాయి)

టుందనే ఆలోచనలో పడి, ఊహించుకోలేక సతమత మవుతున్నాడు.

* * *

సాయంత్రం అయిదయేసరికి నలుగురు కోడళ్లూ ముగ్గురు కూతుళ్లూ, మంగాయమ్మ కొత్త గుడ్డలతో ముస్తాబై కూర్చున్నారు. పెద్ద కొడుకు నాగేశ్వరరావు భార్యను ఇవతలకు పిల్చి ఏవో గుసగుసలు చెప్పాడు. భార్య చింపిరిచేటంత ముఖం చేసుకుని దొడ్డి వాకిలిగుండా మళ్లీ హాల్లోకి వచ్చి కూర్చుంది. నాగేశ్వరరావు తల్లి దగ్గరకువచ్చి "అమ్మా! లక్ష్మీపతి గారింటికి వెళ్లొస్తామే! ఆయన్ని చూసి చాలా రోజులయింది" అన్నాడు.

"దానికేం లక్షణంగా వెళ్ళిరండి!" అన్నది తల్లి. మరుక్షణంలో నాగేశ్వరరావూ, కాంతమ్మ ఇద్దరూ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నారు.

వాళ్లిద్దరు వెళ్లిపోంగానే మూడో కొడుకు, ఆ తర్వాత నాలుగోవాడు పెద్ద సోదరుని అడుగుజాడల్లో ప్రవర్తించి బయటకు జారుకున్నారు. వీళ్ళంతా పోవటం చూసి రాజమ్మ భర్తను ప్రక్కకు పిలిచి "ఏమండీ! ఏదన్నా సినిమాకు వెళ్దామండీ!" అన్నది భర్త మరేదో చెప్పాడు చిరునవ్వుతో. "సరేలెండి!" అంటూ సిగ్గుతో తలవంచుకుని లోపలికొచ్చి కూర్చుంది యథాస్థానంలో.

"ఇదిగో! జన్మకో శివరాత్రని అందరం ఇవాళ సినిమాకు వెళ్దాం!" అన్నాడు పరంధామయ్య పడకుర్చీమీదనుండి లేచి ఆవలిస్తూ.

"మరి ఇంట్లో ఎవరుంటారు?" అనడిగింది మంగాయమ్మ. "అయితే ముందు ఎవరెవరు సినిమాకు వస్తారో చెప్పండి?" అనడిగాడు పరంధామయ్య.

"గృహప్రవేశం రోజు గనక ఇల్లు తాళం వేసి పోవటానికి వీల్లేదు ఇంట్లో ఎవరన్నా ఉంటే నేను రెడీ!" అన్నది మంగాయమ్మ.

"మేమూ వస్తాం!" అన్నారు కూతుళ్ళు ముగ్గురూ! రెండో కొడుకు కాంతారావు, కోడలు రాజమ్మ ఏం మాట్లాడలేదు.

"ఏరా కాంతం? మీరు ఊకొట్టలేదే?" అన్నాడు పరంధామయ్య.

"నాకు రెండు రాత్రులనుంచి నిదరలేదు నేను రాను! అన్నాడు కాంతారావు. "నాకు తలనొప్పిగా ఉంది నేను రాలేను!" అన్నది రాజమ్మ.

* * *

పర్యవసానంగా జరిగిన గమ్మత్తేమంటే ఒకళ్ళకు తెలియకుండా ఒకళ్ళు పరంధామయ్యగారి కుటుంబం అంతా రెండో కొడుకు, కోడలు తప్ప-ఒకే హాలులో ఒకే కుర్చీ వరుసలో చేరారు. పరంధామయ్య కొడుకులు చేసినపనికి లోలోపల నవ్వుకున్నాడు. ముగ్గురు కూతుళూ అన్నల్ని దెప్పిపొడిచారు కొడుకులూ, కోడళ్ళ ముఖాల్లో కత్తివాటేసినా నెత్తురు చుక్కలేదు. మంగాయమ్మ ఈవిషయా లన్నింటినీ గమనించికూడ చూడనట్టు ఊరుకుంది

కాంతారావు, రాజమ్మ ఇద్దరూ భోజనం చేసుకుని మనదే రాజ్యం అన్నట్టు ఇల్లంతా ఒకసారి తిరిగి, తలుపులు జాగ్రత్తగా బిడాయించి పడకగది చేరుకున్నారు.

పరుపుమీదకు మేను వాలుస్తూనే ఒక్కసారి గట్టిగా ఆవలించాడు కాంతారావు.

"అప్పుడే నిద్రొస్తున్నదండీ!" అన్నది రాజమ్మ తమలపాకుల చిలకలు నోటికందిస్తూ.

"నిద్రొస్తే యేం నీ కెందుకు? నీకు తలనొప్పి వచ్చిందన్నావుగా!" అన్నాడు కాంతారావు నవ్వుతూ.

"మామగారు మాత్రం సామాన్యులా యేం? సినిమాకు వెళ్తూ వెళ్తూ తలనొప్పిని బంక వేసుకెళ్ళారు. కాస్త కూస్త మిగిలి ఉన్న దొంగ తలనొప్పికాస్తా దాని దారిన అది పోయింది." అన్నది రాజమ్మ. ★

★ దక్కిందిగొడుగు ★

(34 వ పేజీ తరువాయి)

టేబులు మీద వదలి, అతడి చేతిలో వున్న గొడుగువంక చూస్తూ అడిగాడతను!

"దక్కిందండి కానీ యీ సందర్భంలో మీరు నన్ను క్షమించాలి" వెంకట్రాజు ముందుగానే క్షమాపణాస్త్రాన్ని సీతారామయ్యమీద పడేశాడు!

"దక్కిందిగా... మరిక నేం ..." సీతారామయ్య అదోవిధంగా వెంకట్రాజువైపు చూశాడు!


"నిజంగానే మీరు నన్ను క్షమించాలండి. మీ గొడుగు అందమైన ప్లాస్టిక్ కామతో మొదటిరకం నల్ల సిల్కుగుడ్డతో-కట్టుదిట్టమైన వూచలతో చాలా అందంగా వుండేదండి. కాని నా చేతికి యిది దక్కిందండి" వెంకట్రాజు, కళ్ళనీళ్లు పెట్టుకొని, గొడుగు విప్పి చూపించాడు.

ఆ గొడుగు ప్లాస్టిక్ పిడి ఎప్పుడో విరిగిపోయింది! గుడ్డ మొదటిరకందే అయినా అంతా తూట్లుపడిపోయింది; ఊచలు తుప్పపట్టాయి! "ఇదేమిటి? ఇది నాదికాదు నాకేం అర్థంకావటంలేదు" సీతారామయ్య తెల్లబోతూ అడిగాడు.

"ఏం చెప్పేదండీ?" కళ్ళు తుడుచుకొని, వెంకట్రాజు చెప్పటం సాగించాడు! "మీతో చెప్పినట్లుగా గొడుగు తెద్దామని నిన్న ఏలూరు పనికట్టుకువెళ్లి, వాళ్లింటికి చేరుకొన్నానండి. యోగక్షేమాల తరువాత మా రామారావు ఏమిటేమిటో చెప్పి యీ గొడుగు తెచ్చియిచ్చి: "మరేం అనుకోకు! నాలురోజులక్రితం-వర్షంలో నీ గొడుగు వేసుకొని కాఫీకి వసంతమహల్ అనే హోటలుకు వెళ్లాను. గొడుగు - అన్నిటితోపాటూ బయటవుంచి లోపలికెళ్ళాను. కాఫీ త్రాగి, తిరిగి వచ్చిచూస్తే ఆ గొడుగు గల్లంతు! ఏంచేసేదీ-అక్కడవున్న వాటిల్లోకి బాగున్నదీ, ఆ గొడుగు పోలికలున్నదీ-ఒకటి తీసుకొని మాటాడకుండా బయటకు వచ్చేశాను! మీ గొడుగుకు బదులు యిది నాకు దక్కింది ... అతలాయన ... ఏదో గొడుగు యివ్వమన్నాడని-యింతక్రితం అన్నాడుగా! ఆయన చేతిలో యీ గొడుగు వుంచి జరిగినదంతా చెప్పు" అన్నాడండి. బంగారంవంటి-మీ గొడుగుకి బదులుగా యిది దక్కిందండి..."పది రూపాయల కిమ్మత్తుచేసే బంగారంవంటి గొడుగును నువ్వు పారవేస్తే, ఆయన్ను నేనేలా సమాధానపరచగలను" అని బాధపడుతూ అంటూంటే చీమయినా కుట్టనట్టుగా వాడు: "పోనీ... మా యింట్లో ఎలుకలు ఎక్కువగా వుండటం వల్ల గొడుగు తూట్లుపడిందనీ, ఈ మధ్య వానలు ఎక్కువగా కురుస్తున్నందువల్ల ఊచలు తుప్పపట్టాయని, పిల్లల మూలకంగా కామ విరిగిపోయిందనీ చెప్పు" మన్నాడండి. "కొత్తప్లాస్టిక్ కామ వేయించుకొని, కొత్త వూచలు పెట్టించి-కొత్త నల్లసిల్కుగుడ్డ వేయిస్తే-అది సరికొత్తగొడుగు అయిపోతుందని, సలహాకూడా యిచ్చాడండీ"...పారవేసినవాడు ఆ విధంగా మర్యాదలేకుండా మాట్లాడితే నేనేం చేసేదండి?..

ఈ మాటలని, వెంకట్రాజు తలదించుకొన్నాడు. సీతారామయ్య, తన్ను తాను ఎలాగో సమాధానపరుచుకొన ప్రయత్నిస్తూ: "పోనీలే...ఏదో గొడుగు దక్కింది! అంతే" అని నోటిచివరనుంచి అన్నాడు!

"బ్రతికించారు" అన్నాడు వెంకట్రాజు పట్టి ఆనందం పొందుతూ. ★



లేడీ డాక్టరు ★

[మధురాంతకం రాజారాం]

పంతులమ్మ వయ్యెదవా
  ప్రభావతీ అంటే
చింతాకంతైను సుడీ
  చెల్లెమ్మకు ముఖము!
స్టెతస్కోపు మెడనుదాల్చి
  చేతు లూపుకొనుచు
ఠీవిని వెలయించాలని
  ఆమె మనోరథము!

పాఠశాలయందు జరుగు
  నాటకమ్ములోన
ప్రభావతికి లభ్యమాయె
  రమ్యమైన పాత్ర,
పాత్ర చిన్నదైన నేమి
  పాపకేమొ చాలా
ప్రమోదమ్ము కలిగె నద్ది
  డక్టరు వేషమెగాన!

నిలువు టద్దమునకు ముందు
  నిలిచియుండి యామె
నేర్చుకొనెను తనకుతానె
  హావ భావములను
ఏకాంతము దొరికినదో
  ఇంక చెప్పనేల?
ఇట్టె ప్రారంభమాను
  గదిలోపల గోల!

'పరాబ్రహ్మ' కీర్తనతో
  తెర బిరాన లేచె
ప్రథమాంకమునందె పాప
  రంగమునకు వచ్చె
రోగశయ్య చెంత కేగి
  రోగివైపు తిరిగి
ఎగాదిగా చూచి యామె
  పరీక్షింపదొడగె.

రోగ నిదానమ్ము చేయ
  స్టెతస్కోపు తీసి
రోగి గుండె పైన నునిచి
  కళ్లు కొంత మూసి
జబ్బు ముదిరిపోయె నంచు
  చెప్పినదో లేదో
సభలో నవ్వులసవ్వడి
  మారుమ్రోగిపోయె!

చప్పట్లవి మ్రోగుటేల?
  సవ్వడి చెలరేగుటేల?
సభాజనులు నవ్వుటేల?
  చెప్పుకొనుడు చూతము!
చెవులలోన జొరబడకనె
  వివరాలను తెలిసికొన్న
స్టెతస్కోపువలన కలిగె
  నింత రసాభాసము! ★



పఖేసి

వెండికొండమీద పార్వతీ పరమేశ్వరు లిద్దరూ విలాసంగా కబుర్లు చెప్పుకొంటున్నారు ప్రక్కనే వినాయకుడు, కుమారస్వామి, యిద్దరూ కూర్చొనివున్నారు. ఇంతలో ఎక్కడినుండి ఊడిపడ్డాడో నారదమహాముని, మధురగానంతో దంపతుల ఎదుట నిలబడ్డాడు. నారదుడి గానం చెవినిపడుతూనే పార్వతి కొద్దిగా చలించింది. పరమేశ్వరుడి పరాకు ఒదిలింది. ఈ మహానుభావుడు ఏమిచిక్కు తెచ్చిపెడతాడో

మందరపు పద్మ, లలిత

నని యిద్దరూ హడలుకున్నారు. అనుకున్నట్టే నారదుడు వచ్చినవాడు వచ్చినట్టుండక, పార్వతీదేవి చేతిలో అరటిపండొకటి పెట్టి, దంపతు లిద్దరికీ బహువినయంతో నమస్కరించి, మందహాసంతో చల్లగా జారుకున్నాడు! ఇంకనేం! నాటకానికి నాంది ప్రారంభమైంది.

నారదమహాముని అలా కాలు కాస్త అవతలపెట్టగానే, వినాయకుడు, కుమారస్వామి యిద్దరూ, అరటిపండుకోసం చేతులుజాపేరు. అందులో ఎవరికి దాన్నివ్వడం? చిన్నపిల్ల లామెను! చెరిసగం త్రుంచియిస్తే వొప్పుకోరు. పండు పండే కావాలంటారు. అనుకున్నంతా అయింది! నారదుడువచ్చాడంటే ఏదో తగువు తెచ్చాడన్నమాటే. అందుకోసరమే అతనికి కలహాభోజనుడన్న పేరు కూడా వచ్చింది. దెబ్బలాటే అతనికి భోజనం. పండుకోసరం, యిద్దరన్నదమ్ములు తన్నులాడుకోవడంచూసి పార్వతీ పరమేశ్వరు లిద్దరికీ ఏమీ పాలుపోలేదు.

చివరికి పార్వతి కాస్తఆలోచించి కుమారు లిద్దరినిచూసి "నాయనలారా! మీరిద్దరూ ఇలా తగువులాడుకోవడం ఏమీ బాగుండలేదు. మీకొక చిన్నపోటీని ఏర్పాటు చేస్తాను అందులో గెలిచిన వాడికీ పండు యిస్తాను" అన్నది. దానికిద్దరన్నదమ్ములూ అంగీకరించి, పోటీ పరీక్ష ఏమిటో చెప్పమని వేధించడం మొదలుపెట్టేరు.

పార్వతీదేవి పోటీపరీక్ష చెప్పసాగింది: "మీరిద్దరూ ముల్లోకాల చుట్టూ ప్రదక్షిణంచేసి రావాలి. ఎవరు ముందువస్తారో, వాళ్ళు గెలిచినట్లు, వాళ్ళకే ఈ పండుయిస్తాను" అన్నది. పోటీపరీక్ష విన్నదే తడవుగా, కుమారస్వామి ఆరుముఖాలు ఆనందంతో విప్పారినాయి. వినాయకుడి ముఖం వెల వెల పోయింది! అతని గుండెల్లో రాయిపడింది!

విఘ్నేశ్వరుడి వాహనం ఎలుక. తన స్థూలదేహానికితోడు దిక్కుమాలిన వాహనంకూడా అలాగే ఏడిసింది! లంబోదరంతో, ఆ చిన్న ఎలుకమీద ఎక్కి, ముల్లోకాలూ ప్రదక్షిణంచేసి రావాలి అంటే మాటలా? అదీపోనీ, తనమట్టుకు తాను ఏదోచేసిరావాలంటే అదొక దారి. తాపీగా కావలసినంత వ్యవధి తీసుకుని, ఆ ప్రదక్షిణ మేదో పూర్తిచేసి వచ్చేవాడు. మరి పోటీ

పళని

పరీక్ష! తమ్ముడికి కడ్డీలాంటి శరీరానికి తోడు, వాహానం కూడా కలిసివచ్చింది అతడి వాహావం చక్కటి రంగురంగుల నెమలి!

కుమారస్వామి కులుకు చెప్ప తరం కాదు! "ఎలాగూ అన్న ఓడిపోతాడు, నేనే గెలిచితీరుతాను" అని అతగాడికి అహంకారం పట్టుకున్నది. ఆ అరటిపండు ఎలాగూ తన దేనన్న ధీమాతో చకచకా ముల్లోకాలనూ చుట్టి రావడం మొదలుపెట్టేడు

వినాయకుడికి తమ్ముడిసంతోషం చూడగానే వెఱ్ఱెత్తినట్టయింది అతని కేమి చేయడానికి తోచిందికాదు దిక్కుతోచక వెండికొండ పరిసరాల లోనే చతికిలపడ్డాడు న్యాయంగా పరీక్షకు నిలబడితే, ఎలాగూ తను ఓడిపోతాడు. అనవసరంగా, తన దేహాన్ని, ఎలుకమీద పడేసి, రొప్పుతూ రోజుతూ, ప్రయాణం చెయ్యడం అతగాడికి సుతరామూ నచ్చలేదు. ఎదురుగ్గావున్న ఎలుకను మింగివేయాలన్నంత కోపం ముంచుకువచ్చింది

వినాయకుడి కంత బొజ్జవున్నా బండబ్బాయిమాత్రం కాదు! అతనికి కూర్చుని ఆలోచించగా, చక్కటి ఆలోచన మెరపులా తట్టింది. అతడి కళ్లు సంతోషంతో నాట్యం చేశాయి. వెంటనే గబగబా తల్లితండ్రులవద్దకు ఆయాసపడుతూ పరుగెత్తిపోయాడు "ప్రపంచానికంతకూ మీరే తల్లిదండ్రులు కనుక, మీచుట్టూ ప్రదక్షిణంచేస్తే ముల్లోకాలు చుట్టివచ్చినట్టే!" అంటూ తల్లిదండ్రులచుట్టూ తిరిగి, పాదాలకు భక్తితో ప్రణమిల్లాడు.

వినాయకుడు చేసిన యుక్తికి పార్వతీదేవి మనస్సు సంతోషంతో పరవళ్లుత్రొక్కింది బొజ్జగణపయ్య బుద్ధి కావిడ ముక్కున వేలేసుకుని, ముద్దుగా అతని తల నిమురుతూ, అరటిపండు చేతిలోపెట్టింది! పాపం! కుమారస్వామి నిజంగా ముల్లోకాలనూ చుట్టివచ్చేవేళకు, వినాయకుడు అరటిపండు కాస్తా గుటకాయస్వాహా చేసి కూర్చున్నాడు! కుమారస్వామి, ఆయాసపడుతూ అరటిపండుకోసరం చెయ్యిచాపేడు. అమ్మప్రక్కన కూర్చున్న వినాయకుడు ముసిముసినవ్వులు నవ్వేడు. పార్వతీదేవి విచారంతో అసలు విషయం తెలియజేసింది.

కుమారస్వామి కోపం కట్టలు తెంచుకున్నది. కోపంతో వినాయకుడివైపు తిరిగి, "పిరికిపందవు! న్యాయంగా పరీక్ష గెలవలేక, వాళ్ళను మోసగించి పండు తిన్నావు నీకెప్పుడూ తిండిరంధేగా" అన్నాడు జాలిగా తల్లిదండ్రుల వైపు తిరిగి "తల్లిదండ్రులు మీరు, చిన్నకొడుకునన్న ముద్దయినా లేకుండా, వాడికి అన్యాయంగా పండు యిచ్చేసి కూర్చున్నారు" అని వెనక్కు తిరిగిచూడకుండా, చరచరా ఒక కొండమీద తన స్థిరనివాస మేర్పరచుకున్నాడు.

ఎంతయినా కన్న కడుపేమో! పార్వతీదేవి కొడుకును చూడకుండ వుండలేకపోయింది. దీని కంతటికీ కారణమైన నారద మహామునికి మనస్సులోనే మంగళహారతులు నాలుగుపాడింది పరమేశ్వరుడితో పోరిపోరి చివరికిద్దరూ కుమారస్వామి వుండే కొండ చేరుకున్నారు వెళ్ళగానే కుమారస్వామిని కౌగలించుకొన్నారు ఇద్దరూ ఒకేకంఠంతో "వెఱ్ఱివాడ! మామీద అలిగి వెళ్ళిపోతావా' పళమ్ నీ (పళమ్‌నీ=నీవే ఫలానివి) (కొక ఫలమేమిటి చెప్పు?" అని సముదాయించేరు. కుమారస్వామి కుఱ్ఱతనం మాత్రం విడిచిపెట్టలేదు. ఆ కొండమీద అలాగే వుండిపోయాడు ఆ 'ఫళమ్ నీ'యే నేటి పళని

పళని గురించి పసందైన కథ విన్నారు కదా! ఇది దక్షిణ దిస వున్న గొప్ప పుణ్యక్షేత్రాలలో ఒకటి కొండమీది కుమారస్వామి చూడడానికి కనులపండువుగా వుంటాడు. మీరెప్పుడైనా తప్పక చూడండి.

★

చేతి తొడుగు

ఒక మునలివాడు తనకుక్క వెంట రాగా, అడవిలో ప్రయాణం చేస్తున్నాడు ప్రయాణం మధ్యలో పొరాగ్గా 'చేతి తొడుగు' క్రింద పారవేసుకున్నాడు.

సరీగా అప్పుడే ఆ దారిన ఒక ఎలుకపిల్ల వెళుతూ, ఈ చేతి తొడుగును చూడటం తటస్థించింది. అది మెల్లిగా తొడుగుపైకి ఎక్కి కూర్చుంది. "ఆ! ఇదీ నాకు నివాస యోగ్యమయిన స్థలం" అనుకుంది.

"శ్రీ విరించి"

కాస్సేపయ్యాక ఒక కప్ప ఆ దారినే వచ్చింది చేతి తొడుగును చూచి తక్కున ఆగి "ఎవరిక్కడ బస చేస్తున్నవారు?" అని అడిగింది.

"నేను కిచ-కిచ-ఎలుకను. నీ వెవరు?"

"నేను బెక-బెక కప్పను నన్ను కూడా లోనికి రానివ్వు"

"అలాగే, రా"

కప్పకూడా తొడుగులోనికి చేరుకుంది. ఎలుక ఒకపక్కకు ఒదిగింది ఇద్దరూ తొడుగులో సర్దుకు కూర్చున్నారు

మరికొంత సేపయ్యాక కుందేలు ఆ ప్రాంతాలకు వచ్చింది. తొడుగును చూడగానే ఆగి అడిగింది: "ఇక్కడ ఎవరు బస చేస్తున్నారు?"

"మేము, కిచకిచ ఎలుక-బెక బెక కప్ప! మరి నీ వెవరు?"

"నేను, దాటుతీసే కుందేలును. నేనుకూడా మీతో కలవనా?"

"అలాగే! తప్పకుండా."

కుందేలుకూడా లోనికి చేరింది. తొడుగులో ముగ్గురూ సర్దుకుని కూర్చున్నారు.

ఇంకా కొద్దిసేపటికి గుంటనక్క ఒకటి ఆ దారినే వచ్చింది. యథా ప్రకారంగా "ఎవరయ్యా, ఈ చేతి తొడుగులో నివసిస్తున్నారు?" అని అడిగింది.

"మేము-ఎలుక, కప్ప,కుందేళ్లం. మరి నీవెవరు?"

"నేనా? నేను నక్కను-నాకు కూడా జాగా ఇస్తారా మరి?"

ఎలుక, కప్ప, కుందేలు ఇంకా బాగా కుదించుకుక్కూర్చుని, నక్కకు కూడా చోటు చేశాయి.

తరువాత కొద్దిసేపటికి తోడేలు అటువైపు వచ్చింది.

"ఎవరీ తొడుగులో నివాసం?"

"మేం నలుగురం, ఎలుక, కప్ప, కుందేలు, నక్క. మరి నీ వెవరు?"

చేతి తోడుగం

"తోడేలును మరి మీ బనలో నాకూ భాగం ఇవ్వరూ?"

"అంతకంటేనా? లోనికి రా!"

తోడేలు కూడా లోన చేరింది. అయిదుగురూ సర్దుకుని కూర్చున్నారు.

మరి కాస్సేపటికి అడవిపంది అటు వచ్చింది.

"ఎవరిక్కడ?"

"అయిదుగురం, ఎలుక, కప్ప, కుందేలు, నక్క, తోడేలు. మరి నీవెవరు?"

"నేనా? గురగురలాడే అడవి పందిని, నేను కూడా వుంటే మన జట్టు ఇంకా బాగుంటుంది కదూ."

"చూచినవాళ్ళల్లా యీ చేతి తోడుగులో దూరాలనే ప్రయత్నిస్తున్నారు పందీ! నీకు ఇట్లా లోపలికి రావడం సులభం కాదేమో!"

"మరేం ఫరవాలేదులే. నేనెట్లాగో తంటాలుపడి లోపల చేరుకుంటా."

"అలా అయితే రా. కానీ ఎందుకయినా మంచిదని ముందే హెచ్చరిస్తున్నాం."

పందికూడా బలవంతాన లోపల యిరుక్కోగలిగింది. ఏతావతా, చేతితొడుగులో ఆరుగురుఅయ్యారు. ఎవరికీ చీమంతమేర పక్కకు ఒరుగుదామన్నా అవకాశం లేకుండా పోయింది. ఇలా వుండగా, ఒక ఎలుగుబంటి ఆ దారినే వెడుతూ ఆగింది "ఎవరిక్కడ?" అని అడిగింది.

"మేం ఆరుగురం. ఎలుక, కప్ప, కుందేలు, నక్క, తోడేలు, పంది. మరి నీవెవరు?"

(56-పేజీ చూడండి)

సినిమా

★ బొంబాయిలో టాకీ రజతోత్సవాలు ★

భారతీయ చలన చిత్రాల ఆయుర్దాయం అనే ఒక పాయింటు, మొత్తానికి పుణ్యకాలం మించకుండా, చలన చిత్ర పరిశ్రమ అధినేతలు టాకీ రజతోత్సవాలను బొంబాయిలో మొదలు పెట్టారు. బొంబాయి కాంగ్రెసు అధ్యక్షుడు, ఈ పరిశ్రమ శ్రేయోభిలాషి అయిన శ్రీ ఎస్. కె. పాటిల్ డిసెంబరు 16 ఉదయం 9 గంటలకు లిబర్టీ సినిమా మందిరంలో ప్రారంభోత్సవం చేశారు. మొట్టమొదటి టాకీ 'ఆలం ఆరా' లో నాయకి భూమిక నిర్వహించిన జుబేదా బాను నాయకుడు మాస్టర్ విఠల్, దర్శక నిర్మాత అర్దేషీయర్, ఎం. ఇరానీలు, నేటి చలన చిత్ర పరిశ్రమ ప్రముఖులు పలువురు వచ్చారు.

శ్రీ పాటిల్ తమ ప్రసంగంలో, చలన చిత్రాలకు ప్రజానీకంపైగల ప్రభావాన్ని పునరుద్ఘాటించారు

ఈ పరిశ్రమ దిన దిన ప్రవర్ధమానం కావాలంటే, పరిశ్రమలో వారంతా ప్రభుత్వం చేస్తున్న కృషితో సహకరించాలని ఆయన అన్నారు. ఈ రంగాన్ని, ఒక పరిశ్రమగా, భావించి, సముచితమైన, కట్టుదిట్టమైన పద్ధతులలో దీనికి పుష్టినిచ్చి నిలబెట్టడానికి ప్రత్యేక శ్రద్ధవహించి కృషి చేయాలన్నారు. ఈ విధమైన ప్రయత్నాల ఆవశ్యకతను పాటిల్ పదే పదే నొక్కి చెప్పారు. తాత్కాలికమైన ఇబ్బందులకు ప్రాధాన్యం ఇచ్చి, తాత్కాలికమైన లాభాలను, ఫలితాలనూ ఆశించి, ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించక నిరాకరించవద్దని విజ్ఞప్తి చేశారు

పరిశ్రమ అభివృద్ధికి అత్యంత ప్రధానమైన ఆర్థిక వసతి విషయం ప్రస్తావిస్తూ, నిర్మాతలు దారుణమైన వడ్డీలు ఇచ్చి గాని అప్పులు తెచ్చుకోని కలసివ పరిస్థితులను క్రమంగా తొలగించి, సౌలభ్యం సగుపాయం అయ్యే విధంగా పెట్టుబడి కార్పొరేషన్‌లను నెలకొల్పవలసి ఉన్నదని పాటిల్ అన్నారు.

భారత చలన చిత్ర పరిశ్రమకు పితృతుల్యులు మార్గదర్శకులూ అయిన పెద్దలందరికీ ఆయన జోహారు లర్పించారు

ఐ. ఎం. పి. పి. ఎ అధ్యక్షుడు శ్రీ జె



మొదటి భారతీయటాకీ చిత్రం నిర్మించిన అర్దేశిర్ ఇరానీ

పి తివారీ చలనచిత్రాల స్థాయిని పెంపొందించవలసిన ఆవశ్యకతను వివరించారు. తయారయ్యే ప్రతి కొత్త చిత్రంలోను కొత్తదనం ఉండాలని ఆయన అన్నారు. ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ ఎం. బి బిలిమోరియా మాట్లాడుతూ చలనచిత్రాలు సాంఘిక పురోభివృద్ధికి ముఖ్య సాధనాలు అన్నారు.

భారత చలనచిత్ర పరిశ్రమ పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే చిత్రం "రాజా హరిశ్చంద్ర" ప్రభృతి చిత్రాలలో కొన్ని భాగాలను, ప్రభాత్ టాకీస్ వారి "దునియా నామానే" చిత్రాన్ని ఈ సందర్భంలో ప్రదర్శించారు.

రజతోత్సవ సందర్భంలో ఈ వారం రోజులూ భారత చలనచిత్ర పరిశ్రమలో ఉత్తమ శ్రేణికి చెందిన 21 చిత్రాలను నగరంలోని 30 థియేటర్లలో ప్రదర్శించారు.

ప్రధాని సందేశం

భారత ప్రధాని శ్రీ జవహర్లాల్ నెహ్రూ రజతోత్సవాలకు శుభ సందేశం పంపుతూ ఈ పాతిక సంవత్సరాలలోనూ భారత చలనచిత్రపరిశ్రమ ఎన్నతగిన కృషి చేసి అభివృద్ధి సాధించిందని ప్రశంసించారు

ఈ పరిశ్రమకు మార్గదర్శకులైన పెద్దలను, ఈ ఆనందోత్సవ సమయాన గౌరవించడం ఎంతో సంతోషం కలిగించిందని శ్రీ నెహ్రూ పేర్కొన్నారు


ఉపరాష్ట్రపతి డా॥ రాధాకృష్ణన్, డా॥ బి. వి. కేస్కర్, శ్రీ మురార్జీదేశాయి, శ్రీ వై. బి చవన్ ప్రభృతులుకూడా పరిశ్రమ పురోభివృద్ధిని ఆకాంక్షిస్తూ సందేశాలు పంపించారు.

ఈ రజతోత్సవాలు దేశంలోని నాలుగు ప్రధానకేంద్రాలలోనూ విడిగా జరుగుతున్నాయి. బొంబాయిలో ఉత్సవాలు డిసెంబరు 16 నుండి 22 వరకు, తరవాత కలకత్తాలో డిసెంబరు 30 నుండి 1957 జనవరి 5 వరకూ, మద్రాసులో జనవరి 11 నుండి 17 వరకూ జరుగుతాయి పరిసమాప్త్యుత్సవాలు జనవరి ఆఖరివారంలో ఢిల్లీలో జరుగుతాయి. ★



వర్ణ చిత్రాల యుగానికి (ఝాన్సీకి రాణి) ప్రారంభోత్సవం చేసిన ప్రముఖ నిర్మాత, దర్శకుడు, నటుడు అయిన సొహరాబ్ మోడీ... "రాజ్ హఠ్" చిత్రంలో రనపుత్ర ప్రభువు గా.

50 లక్షల డాలర్ల ఖర్చుతో



"పెద్దతలకాయలు యుద్ధం చెయ్యాలని నిశ్చయించాయి అప్పుడు చిన్నలపని కత్తిదూసి యుద్ధానికి బయలుదేరడమే. కాని జయాపజయాలు తేల్చేది నిర్ణయాలు చేసే పెద్దలు కాదు; యుద్ధంచేసే చిన్నలే అన్న అంశాన్ని ద్యోతకంచేసే "వార్ అండ్ పీస్" చిత్రంలో, నెపోలియన్‌ను ఎదుర్కొనడానికి బయల్దేరి వెళ్తున్న జార్ సైన్యం

డినోడి లారెంటిస్, కార్లోపాంటీ అనే ఇటాలియన్లు ఇద్దరు మూడుసంవత్సరాలనాడు, 'సాహసోపేతం' అని చెప్పకోతగ్గనిర్ణయం ఒకటిచేసుకున్నారు ఏడాది తిరిగేసరికి పారమౌంట్ పిక్చర్ అనే అమెరికన్ సంస్థ, ఈ నిర్మాతలూ కలసి, ఆ నిర్ణయాన్ని కార్యరూపంలో పెట్టారు యూరప్ దేశాలు — ముఖ్యంగా ఇటలీ రెండేళ్ళపాటు సంరంభంతో నిండిపోయాయి

వారు తలపెట్టినపని టాల్‌స్టాయ్ నవల "వార్ అండ్ పీస్" (యుద్ధము-శాంతి)ను సెల్యులాయడ్ భాషలోకి తర్జుమాచేయడం

అసలు టాల్‌స్టాయ్ ఈ బృహత్కథను చెప్పడానికి ఆరేళ్ళు (1863-69) పట్టింది. ఆయన వ్రాసిన ఆరులక్షుల మాటలూ, చదివి వంటపట్టించుకోవడానికి నెల, రెండునెలలూ కూడా పట్టుతుంది. అంతటి గాథను, నిర్మాతలు ఇపుడు $3\frac{1}{2}$ గంటల వ్యవధిలో చెప్పారు

మహానదిలా ప్రవహించే ఈ గాథను మహామహులు కాకపోయినా, హేమాహేమీలు అనతగ్గ చలనచిత్ర రచయితలు దాదాపు పాతికమంది విడివిడిగా, జంటలుగా, గుంపులుగా ప్రయత్నించికూడా

(54 వ పేజీ చూడండి)

★ టాల్‌స్టాయ్ రచించిన ఉత్తమ నవల ★

'యుద్ధమూ శాంతీ' ఇతివృత్తం



నతాషా (ఆడ్రీ హెప్‌బర్న్) చంచల మనస్క. ఆమె ప్రిన్స్ ఆంద్రీని ప్రేమించింది పియర్ (హెన్రీఫాండా) ఆమె ప్రేమ వర్షించినా తృణీకరించలేకపోతోంది.

యుద్ధాలెందుకు జరుగుతాయి? ఒక దేశంలోని జనలు వ్యక్తిగతంగాతా మెప్పుడు చూడని, ద్వేషించని మరో దేశపు వేలాదిజనుల్ని యుద్ధంపేరిట అమానుషంగా ఎందుకు హత్యచేస్తారు? 19 వ శతాబ్దపు తొలిదినాల్లో నెపోలియన్ దిగ్విజయ యాత్రతో యూరప్ అంతా అట్టుడికి నట్లుడికి పోయింది. లక్షలకొద్దీ జనం చని పోయారు. దేశాలకి దేశాలు శ్మశానాలుగా మారిపోయాయి ఈ దారుణానికి కారణమేమిటి? కారకులెవరు?

ఒక్కొక్క చరిత్రకారుడు ఒక్కొక్క రకంగా కారణాలు చెప్పాడు. నెపోలియన్ విజిగీష కారణమని ఒకడూ, విప్లవం వ్యాపింపచెయ్యాలనే ఫ్రెంచివారి దురాశ అని మరొకడు, జార్ చక్రవర్తిదే తప్పని మరొకడు-ఇలాగ అనేక కారణాలు చెప్పారు. రష్యన్ సాహిత్యకారుడు టాల్‌స్టాయ్ ఆ రోజుల్లో వ్యాప్తిలో ఉన్న ఈ వాదాలన్నిటినీ ఖండించి అసలు కారణాలను అన్వేషించడానికి ప్రయత్నించాడు. ఈ ప్రయత్నం పదకొండు వందల పేజీలకు పైబడిన పెద్దనవల (వార్ ఎండ్ పీస్) రూపంలో జరిగింది. వేర్వేరు వ్యక్తిత్వం కలిగిన అనేక పాత్రలు, వందల కొలది సంఘటనలు, అసంఖ్యాక సేనావాహినుల సంఘర్షణలు వీటితో క్రిక్కిరిసిన ఈ నవల ప్రపంచ సాహిత్యంలోనే గొప్పనవల అని అంటారు.

ఈ నవలకు కథానాయకుడని చెప్పదగిన వాడు పియర్ బెజుహోవ్. పియర్ యువకుడు, విద్యావంతుడు, అమిత ధనవంతుడు, సరళ స్వభావుడు. కాని నడవడిలో నిలకడలేని వాడు. జీవితపరమార్థం ఏమిటి? ఎటువంటి జీవితం ఆనందాన్నిస్తుంది? ఇవీ అతన్నెదుర్కొన్న సంశయాలు. తన ధనాన్ని చూసి పెళ్లాడిన భార్య అతనికి దుర్భరంగా తయారవుతుంది. నెపోలియన్ మీద కొండంత గౌరవంతో ప్రారంభించి, యుద్ధబీభత్సాన్ని కళ్లారా చూసిన తరవాత ఆగౌరవమంతా పోగొట్టుకుని నెపోలియన్‌ను హత్యచేసి పగతీర్చుకోవాలనుకునేంతదాకా వస్తాడు. చివరికతనికి ప్లేటన్ అనే ఒక పేదరైతులో తను అన్వేషిస్తున్న జీవిత లక్ష్యం కనిపించినట్లవుతుంది. అతని అన్వేషణ నతాషా అనే యువతి ప్రేమలో సఫలమవుతుంది. ఆమెనతడు వివాహం చేసుకుంటాడు.

మరొక ముఖ్యపాత్ర ప్రిన్స్ ఆంద్రీ. ఇతడు పియర్ స్నేహితుడు. అతని వలెనే విద్యాధికుడు, ధనాఢ్యుడు. తనకీ రి

కాంతుడు యుద్ధం నుంచి అవకాశ మిచ్చిందని భావిస్తాడు. కాని యుద్ధ విధ్వంసనం చూసి, శారీరకంగా, మానసికంగా యాతనలనుభవించి పరివర్తన చెందుతాడు. నతాషాను ప్రేమించి పెళ్ళి చేసుకోబోతాడు. కాని ఆమెబుద్ధి చాపల్యంవల్ల పెళ్ళి ఆగిపోతుంది నతాషామీద, ఆమెను తననుంచి వేరుచేసిన అనటోల్ మీద ద్వేషం వహి



ప్రిన్స్ ఆంద్రీ బోల్కోన్‌స్కీ (మెల్ ఫెరర్) యుద్ధానికి వెళ్తున్నాడు. అతని సోదరి మేరీ (ఆనా మరియా ఫెరెరో) వీడ్కోలు చెప్పింది.

స్తాడు. కాని యుద్ధం అతనిలో ఒక మహోదాత్తమైన పరివర్తన తీసుకువస్తుంది. మృత్యువు ఎదుర్కొన్నప్పటి లాగానే జీవితం ఎదుర్కొన్నప్పుడు కూడా ద్వేషం, ప్రతీకారభావం మొదలైన అల్పభావాలన్నీ విఫలమై పోతాయనీ, నిజమైన జీవితానికి త్యాగం, ప్రాణికోటి పంతిటనీ



ఆంద్రీ, అతని భార్య లైసీ (మిల్లీవిటీల్), చెల్లెలు మేరీ



బోరోడినో యుద్ధరంగంలో జనరల్ కుతుజోవ్ (ఆస్కార్ హోమోల్కా), ప్రిన్స్ ఆంద్రీ (మెల్ ఫెరర్)

"యుద్ధమూ శాంతీ" ఇతివృత్తం

ఆవరించే విశాల ప్రేమ ఇవే మూల సూత్రా మూత్రాలనీ గ్రహిస్తాడు ఈ సత్యం గ్రహించడంవల్ల కలిగిన సాత్త్వికంతో మృత్యువును ఛీగానవ్వుతో ఎదుర్కొని ప్రియురాలైన నతాషా ఒడిలోనే మరణిస్తాడు.

కథానాయిక నతాషా అతి సుందరమైన పాత్ర కొండరాళ్లమీద తుళ్లింతలాడుతూ అపరాని ఉద్వేగంతో ప్రవహించే ఝరి లాంటిది నతాషా. దుష్టుల్ని మార్పునంత అవలీలగా ప్రేమికులను మార్పుస్తుంది. కాని ఏ ప్రేమికుడూ ఆమె హృదయంతరాన్ని తెలుసుకోలేక పోతాడు ఒక్క ఆంద్రీ తప్ప. అతడు యుద్ధంలో తగిలిన గాయంవల్ల మరణిస్తాడు. బాల్యం నుంచీ తన్నుకష్టంలో సుఖంలో అనుసరించి వస్తున్న పియర్ ను వివాహం చేసుకుంటుంది ఒకదారీ తెన్నూ లేకుండా ప్రవహిస్తున్న ఝరి మైదానంలోకి వచ్చి ప్రశాంతంగా, విశాలంగా ప్రవహించినట్లు ఆమె జీవితం చివరకు ఒక బరువుతో, పరువంతో, నిండుతనంతో మాతృత్వంతో పరిపూర్ణమవుతుంది.

ఈ మూడూ ముఖ్య పాత్రలు. "యుద్ధమూ శాంతీ"లో ఇంకా అనేక పాత్రలు సజీవమైనవి ఉన్నాయి. స్వేచ్ఛ, సమానత్వం, స్వాతంత్ర్యం సాధించడానికి ప్రారంభమైన ఫ్రెంచి విప్లవాన్ని వక్రమార్గాలు పట్టించిన నెపోలియన్ను టాల్ స్టాయ్ ద్వేషంతో కాక, యుద్ధానికి దారితీసిన అనేక వేల కారణాలలో ఒక కారణంగా, అల్పమానవుడుగా మాత్రమే చిత్రిస్తాడు.

ఈ నవలలో కథ, చరిత్ర రెండూ మిళితమై ఉన్నాయి. అంచులు, అవధులు లేని జీవితంలాగానే కథ ఫేడిన్ అయి, ఫేడౌట్ అవుతుంది ఈ మధ్యలో వ్యక్తులు అనేక పరిణామాలకు లోనవుతారు.

ఈ కథ నాధారంచేసుకొని తీసిన పారమౌంట్ చిత్రం "వార్ ఎండ్ పీస్" త్వరలో మద్రాసు రాబోతున్నది. ★

సినిమా వార్తలు

అన్నపూర్ణా పిక్చర్సువారి కొత్తచిత్రం "తోడికోడళ్లు" జనవరి 10 వ తేదీన విడుదల అవుతోంది వీరు దీనిని తమిళంలో కూడా నిర్మించారు.

ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో, సావిత్రి, కన్నాంబ, సూర్యకాంతం, నాగేశ్వరరావు, రంగారావు, రేలంగి, జగ్గయ్య, మొదలగువారు పాల్గొన్నారు.

మదనపల్లినుండి తీసుకువచ్చిన 'రూఫీ' అనే ఉత్తమజాతి కుక్క ఒకటి ఈచిత్రంలో విశేషాకర్షణ అని రషెస్ చూచినవారు చెబుతున్నారు.

శరత్ చంద్రచటర్జీ నవల "నిష్కృతి" ఈచిత్రం కథకు మాతృక. తెలుగుచిత్రానికి మాటలూ పాటలూ ఆత్రేయ వ్రాశారు. నిర్మాత డి. మధుసూదనరావు. ఈ చిత్రం నిర్మాణం సరిగా ఆరునెలలలో (వాహినీ స్టుడియో) ముగిసింది. అగ్రశ్రేణి నటీనటులు ఇంతమందితో, అందులోనూ రెండుభాషల వారితో చిత్రనిర్మాణం త్వరగా పూర్తి అయిన కొద్ది చిత్రాలలో ఇది ఒకటి.

వరుడు కావాలి

భరణీవారి కొత్త చిత్రంకూడా జనవరిలోనే విడుదల అవుతోంది. తెలుగుచిత్రం పేరు "వరుడు కావాలి" తమిళ చిత్రం "మన మగల్ తేవె."

రామకృష్ణదర్శకత్వాన తయారవుతున్న ఈ రెండు చిత్రాలలోనూ భానుమతి ముఖ్య భూమిక నిర్వహించింది. తెలుగుచిత్రంలో జగ్గయ్య అమర్ నాథ్, టి. ఆర్. రామచంద్రన్, రమణారెడ్డి, డా॥ శివరామకృష్ణయ్య, రామన్న పంతులు, ప్రమీల పాల్గొంటున్నారు.

హాస్యరస ప్రధానమైన ఈ చిత్రానికి రావూరు సత్యనారాయణ మాటలూ, పాటలు వ్రాశారు. సంగీత దర్శకుడు జి రామనాథన్.

* * *

విక్రం ప్రొడక్షన్స పేరిట శ్రీ బి ఎస్. రంగా నిర్మిస్తున్న పౌరాణిక చిత్రం "భక్త మార్కండేయ" జనవరిలోనే విడుదల కాబోతోంది నాగయ్య, పుష్పవల్లి, సి ఎస్ ఆర్, నాగేంద్రరావు, కాంతారావు, రఘురామయ్య, రమణారెడ్డి మాస్టర్ ప్రభాకర్, బాజ్జీ, సురభి బాలసరస్వతి, సూర్యకాంతం మొదలగువారు నటించారు. రచన సముద్రాల రాఘవాచార్య. దర్శకుడు బి. ఎస్. రంగా.

* * *

జలరుహా పిక్చర్స వారు 'రాజనందిని' అనే చిత్రం నిర్మిస్తున్నారు. దీనికి కథ, మాటలూ మల్లాది రామకృష్ణశాస్త్రి వ్రాస్తున్నారు. అంజలి, రామారావు, రేలంగి ముఖ్య భూమికలు నిర్వహిస్తున్నారు. దర్శకుడు వేదాంతం రాఘవయ్య, సంగీత దర్శకులు టి వి. రాజు, ప్రకాష్. నిర్మాత ఎం. జగన్నాథరావు.

* * *

★ బొంబాయి సినిమా లేఖ ★

భారతటాకీ రజతోత్సవాలు డిసెంబరు 16 న ప్రారంభం అయ్యాయి భారత చలనచిత్ర పితామహుడు దాదాఫాల్కే నిర్మించిన చిత్రాల్లో భాగాలను, ఈ సందర్భంలో ప్రదర్శిస్తున్నాడు. ఇవి కాక, దునియా-న-మానే, డా॥ కోట్నిస్ కీ-అమర్ కహానీ, శకుంతల, బంధన్, రామశాస్త్రి (మహారాష్ట్ర), సంత్ జ్ఞానేశ్వర్, కోర్టు డాన్సర్ (ఇంగ్లీషు), ఝూలా మొదలగు చిత్రాలనుకూడా ప్రదర్శిస్తారు.

మొత్తంమీద, ఈ సందర్భంలో ఏర్పాటు అయిన ఉత్సవ కార్యక్రమాలు చరిత్రాత్మకం అని చెప్పతగ ఈ సమయానికి తగ్గస్థాయిలో లేవనిమాత్రం అంగీకరించక తప్పదు.

* * *

సోవియట్ రష్యా వెళ్ళిన భారత సాంస్కృతిక ప్రతినిధివర్గ సభ్యుల పునరాగమనంతో బొంబాయి చిత్రసీమ మంచి సంరంభంతో నిండిపోయింది రాజ్ కపూర్ నర్గీస్, సొహ్రాబ్ మోడీ, మెహతాబ్, కామినీకౌశల్, అభీభట్టాచార్య, సురయా ప్రభృతులంతా రష్యన్ ప్రజలు వారు చూపిన ఆదరాభిమానాలను వేనోళ్ళ కొనియాడారు. తరవాత సొహ్రాబ్ మోడీ పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ, రష్యా చూట్టూరా ఇనపతెర ఉందంటూ సాగే ప్రచారం కేవలం దుష్ప్రచారమేననీ, అక్కడ అలాటిదేమీ లేదనీ, అక్కడి ప్రజలు, ప్రపంచంలో ఇతర దేశాలలో అందరికీ మల్లేనే, మామూలుగా ఉన్నారనీ అన్నారు. రష్యన్ పురుషులంతా సుస్ఫురద్రూపులూ, బలవంతులూ అన్నారు. స్త్రీలంతా కూడా కష్టపడి పనిచేస్తారని, మంచి ఆరోగ్యంగా పుష్టిగా కనుపించారనీ ఆయన చెప్పారు.

ఒకసారి, భారతబృందంలో కొందరొకచోట చలికి తట్టుకోవడానికి తలకి చుట్టుకునే స్కార్ఫులు నాణ్యమైనవి బేరమాడబోయి, ఖరీదులు విని తటపటాయిస్తూ ఉన్నారట. ఆ పక్కనే ఉన్న ముగ్గురు రష్యన్ యువతులు వెంటనే కొన్ని కొని వారికి కానుకలిచ్చారట.

ఈ పర్యటన సందర్భంలోనే జాగ్ తే రహో, శ్రీ 420, మీర్జా గాలిబ్, వారిస్, జాగృతి, బిరాజ్ బహూ మొదలైన హిందీ చిత్రాలను రష్యన్ ప్రభుత్వం కొన్నట్లు శ్రీ మోడీ తెలియచేశారు. బ్యాంక్ ఆఫ్ చైనా ద్వారా, వాటి కొనుగోలు మొత్తాన్ని వెంటనే, భారతీయ ద్రవ్యంలో ఇక్కడి సంస్థల పేరిట జమ కట్టించివేశారు.

అనేక విధాల ఈ పర్యటన ఉత్సాహకరంగా సాగిపోయినా, మనకు సిగ్గుచేటు అని చెప్పతగ్గ అంశాలుకూడా లేకపోలేదు ముఖ్యంగా, బృందం సభ్యురాలు సురయా, ఆమె సంరక్షకురాలుగా బయలుదేరి వచ్చిన ఆమెతల్లి ప్రవర్తించిన విధం, భారత బృందానికి ఏవిధంగాను గౌరవప్రతిష్ఠలను ఇనుమడింప చేసేదిగా లేదట ఈ ఇద్దరూ, ఇద్దరిలోనూ ముఖ్యంగా సంరక్షకురాలువు (హోదా?) గా మాత్రమే వెళ్ళిన సురయాతల్లి చీటికీ మాటికీ, బృందంలోని సభ్యులతో తగవులాడడం సాగించారట. ముఖ్యంగా ఈ బృందం ఒక సాంస్కృతిక ప్రతినిధివర్గం కాబట్టి, వ్యక్తులసత్ప్రవర్తన, క్రమశిక్షణ, మాటతీరు చాలా ముఖ్యం ఈ దృష్ట్యా, వీరు ప్రవర్తించిన తీరు ఏ విధంగానూ హర్షించ తగినదికాదని బృందంలో సభ్యులు కొందరు చెప్పారు.

ఇదేకనక నిజమైనపక్షంలో, భారత దేశపు కళకు సంస్కృతికీ ప్రతినిధులను ఏరి ఈ బృందాన్ని రూపొందించిన భారత ప్రభుత్వమే ఇందుకు బాధ్యత వహించవలసి ఉంటుంది.

* * *

నటుడూ, దర్శకుడు, నిర్మాత, రచయిత, "భారత దేశపు చాప్లిన్" అయిన రాజ్ కపూర్ పుట్టినరోజుపండుగ ఈ నెల 14 న జరిగింది నలుగుర్ని నవ్వించడమే వృత్తిగా గల ఒక హాస్యగాడి వ్యక్తిగత జీవితాన్ని ఇతివృత్తంగా రాజ్ కపూర్ భారీఎత్తున నిర్మింప సంకల్పించిన కొత్తచిత్రానికి ఆరోజున ఆర్. కె. స్టుడియోలో



సెల్వకోటి పిక్చర్సువారి "స్వయంప్రభ' లో సి.యస్.ఆర్., శ్రీరంజని.



విక్రమ్ ప్రొడక్షన్స్‌వారి "భక్తమార్కండేయ" లో యముని దర్బారు. శ్రీ ఆర్. నాగేంద్రరావ్, మహంకాళి వెంకయ్య, ప్రసాదరావు.

"వార్ ఎండ్ పీస్" చలన చిత్రం

(50-వ పేజీ తరువాయి)

దాన్ని ఆకట్టలేక, అవకట్టలుమట్టుకు కటి, సాధ్యమైనంత ఎక్కువభాగాన్ని వడబోసి పదిహేనువేల అడుగుల ఫిలింమీదకి కుదించారు.

నవలలో ప్రధాన పాత్రలే 28 ఉన్నాయి. తరువాత్రిశేణి వనతగ్గవి 48 ఇవికాక, ఇంకా 5 వందలమంది గుంపులుగా కాక, వ్యక్తులుగా, మనుష్యులుగా కనబడి పలకరించి వెళ్తారు. చలనచిత్రి నిర్మాణ కార్యక్రమంలో, ప్రధాన పాత్రలసంఖ్య 23 నుండి 17 కు తగ్గిపోయింది. టాల్‌స్టాయ్ చిత్రించిన యుద్ధాలు పది అయితే, ఇందులో మూడు చూపించడం గగనం అయింది.

అయినా చలనచిత్రం అనేసరికి ఏర్పడే అవధుల దృష్ట్యా, సాంకేతిక బాధ కాలదృష్ట్యా, ఈప్రయత్నం ఈ బృహత్కథకు తగిన స్థాయిలోనే జరిగిందని చెప్పాలి.

50 లక్షల డాలర్ల ఖర్చుతో, అగ్రశ్రేణికి చెందిన అంతర్జాతీయ నటీనటులు 60 మందితో, మరి పదివేల మంది చిన్న నటులతో ఈ గాథకు రూపం ఇచ్చారు

యుద్ధ దృశ్యాలలో ఫ్రెంచి సైనికులుగానూ, రష్యన్ సైనికులుగాను కూడా 5, 700 మంది ఇటాలియన్ సైనికులు నటించారు. నెపోలియన్ కాలం నాటిశతఘ్నులు, బండూ, కత్తి కరారూ సైనిక దుస్తులూ తయారు చేయడం, రోం నగరంలో కొంతకాలంపాటు పరిశ్రమగా సాగిపోయింది. దృశ్యాలచిత్రీకరణ ఒక్క ఇటలీలో నేకాక, దాదాపు యూరప్ దేశాలన్నిటిలోనూ జరిగింది. యుగోస్లావియాలోని "వాయ్‌వాడినా" నగరంవద్ద 1812 నాటి మాస్కో నగరాన్ని పూర్తిగా పునర్నిర్మించారు.

దుస్సాధ్యం అనదగ్గ ఈ మహాకార్యానికి ఇంతకాలం ఏ ఒక్కరూ, ఏనాడూ ఎందుకు పూనుకోలేదు?

మిగతా కారణాలు ఎలా ఉన్నా ముఖ్యకారణం, ఇదివరకూ ఆడ్రీ హెప్‌బర్న్ అనే అమ్మాయి పుట్టలేదు. అని చాలామంది అన్నారు

ఆడ్రీ ఇందులో నతాషా భూమికను నిర్వహిస్తోంది. టాల్‌స్టాయ్ సృష్టించిన నతాషా సౌందర్యం, లావణ్యం, లాలిత్యం అన్నీ ఈ బ్రిటిష్ అమ్మాయిలో మూర్తీభవించాయి

ఆడ్రీ హెప్‌బర్న్ "రోమన్ హాలీడే" చిత్రంతో తారాపథాన్ని అందుకొంది. తరవాత "సబ్రీనా ఫెయిర్ చైల్డ్" అనే చిత్రంతో ఆమె కీర్తిప్రతిష్ఠలు ద్విగుణీకృతం అయ్యాయి. మూడవది ఇది.

ఇందులో ఆమె అద్భుతంగా నటించినట్లు, ఈ చిత్రం విడుదల అయిన దేశాలలో విమర్శకులంతా మెచ్చుకున్నారు ఆడ్రీభర్త మెల్ ఫెరర్ ఈ చిత్రంలో ప్రిన్స్ ఆంద్రీగా నటిస్తున్నాడు.

నవలలో విశిష్టమైన మరొక భూమిక 'పియర్' ను అమెరికన్ నటుడు హెన్రీ ఫొండా, నిర్వహిస్తున్నాడు. జనరల్ కుతుజోవ్ గా ఆస్కార్ హోమోల్కా నటిస్తున్నాడు. ఇంకా జాన్‌మిల్స్, పీటర్ ఉస్తినోవ్ (బ్రిటన్), స్వీడిష్ నటి మాయ్‌బ్రిట్, ఇటాలియన్ నటులు విట్టోరియో గాస్‌మన్, రోసానాబ్రాజీ, జర్మన్, రష్యన్, ఫ్రెంచ్ నటులూ మరికొందరు పాల్గొంటున్నారు

దర్శకుడు కింగ్ విడార్ ★

బొంబాయి సినిమాలేఖ

ప్రారంభోత్సవం జరిగింది. ఈ చిత్రానికింకా నామకరణం జరుగలేదు. ఇందులో ప్రధాన భూమిక నిర్వహణ, దర్శకత్వం కూడా రాజ్ కపూరే నిర్వహిస్తాడు. నాయిక ఎవరని వేరే ఆలోచించ నవసరం లేదు.

* * *

తన పుట్టిన రోజు పండుగనాడే రాజ్ కపూర్ ఈ ఏడాది నిర్మించిన "జాగ్ తే రహో"ను బొంబాయి రీగల్, ఇంపీరియల్ మొదలైన థియేటర్లలో విడుదల చేశాడు. హిందీ బెంగాలీలలో తయారైన ఈ చిత్రం ఇటీవలి చిత్రాలలో అగ్రశ్రేణికి చెందినది ఈ చిత్రం మొట్టమొదట దక్షిణ భారతంలో విడుదల అయింది ఇలా ఒక హిందీ చిత్రానికి "అలిండియా ప్రీమియర్" దక్షిణాదిన జరుగడానికి ఇదే తొలిసారి. ★

★ అటలాంటా పరుగుపందెం ★

(12-వ పేజీ తరువాయి)

తలుచుకుంటే కన్నుమూసి తెరిచేలోగా అతన్ని పట్టుకోలేకపోతానా అనుకుంది.

జానస్ రాజుతోసహా ఆర్కేడియా రాజ్య ప్రజ అంతా ఆ పరుగుపందెం చూడడానికి వచ్చారు. మిలానియన్ మున్ముందుకు పరుగెత్తుకుపోవడంచూచి వారంతా ఉత్సాహం పట్టలేక గట్టిగా చప్పట్లు చరిచారు. ప్రజల ఉత్సాహ కోలాహలం వినగానే అటలాంటాకు లోలోపల కోపం పెచ్చు పెరిగిపోయింది.

ఆమెకూడా తొందరగా పరుగుపెట్టింది క్షణంలో మిలానియన్‌కంటె బాగా ముందుకు వెళ్ళిపోయింది.

అదిచూచి మిలానియన్ తన దగ్గరనున్న ఆపిల్ పండు నేలమీదికి విసిరివేశాడు బంగారు ఆపిల్ పసిరిపచ్చికలలో కనులు మిరుమిట్లుగొలుపుతూ తళతళా మెరిసింది

అటలాంటా ఆ ఆపిల్ చూచి ఎంతో ముచ్చటపడి దానికోసం ఒక క్షణం ఆలస్యం చేసింది.

అంతలో మిలానియన్ మెరుపులా ముందుకు పరుగెత్తుకుపోయాడు. అటలాంటా మళ్ళీ పరుగు మొదలు పెట్టింది. ఆమె పరుగు ప్రారంభించిందంటే సూర్యకిరణాలుకూడా ఆమెతో సమానంగా పరిగెత్తలేవు మళ్లీ ఒక క్షణంలో ఆమె మిలానియన్‌కంటె బాగా ముందుకు వెళ్ళిపోయింది.

అది చూచి మిలానియన్ మళ్ళీ ఇంకొక ఆపిల్ పసిరిపచ్చిక గుబురులలోకి విసిరి వేశాడు. అది ప్రాతఃకాల సూర్యకిరణాలలో మరింత తళ తళా మెరిసింది. అటలాంటా అదికూడా అందుకోవాలని నేలమీదికి వంగింది. అంతలోనే మిలానియన్ తిరిగి వాయు శక్తిలా పరుగు మొదలు పెట్టాడు. అటలాంటా తలెత్తి చూచేసరికతడు చాలాదూరం పరుగెత్తుకుపోయాడు.

అటలాంటా మళ్ళీ చకచకాపరిగెత్తింది. ఆమె గట్టిగా తలుచుకుందంటే ఎలాంటి వారైనా ఆమెకు దాసోహ మనవలసిందే. సరిగా అలాజరిగింది. ఆమెమళ్ళీ గబగబా పరిగెత్తింది. కన్నుమూసి తెరిచేలోగా

అటలాంటా పందెం

మిలానియన్‌కంటె బాగా ముందుకు వెళ్ళిపోయింది

వారిగమ్యస్థానం బాగా దగ్గరికి వచ్చేసింది. ఇంకొకనిమిషం పరిగెత్తిందంటే ఆ వేళ అటలాంటా తప్పకుండా ఆపందెంలో గెలిచిఉండేదే!

కాని అంతలోనే మిలానియన్ మళ్ళీ ఇంకొక కొంచెం పక్కగా ఆపిల్ విసిరివేశాడు.

అటలాంటా ఇంతకుపూర్వం రెండు ఆపిల్ పళ్లు సంపాదించింది. అయినా ఆ మూడో ఆపిల్ చూడగానే ఆమెకళ్లు చెదిరిపోయాయి. లేత లేత పసిరి పచ్చికలలో అది మరింత తళతళా మెరిసింది.

ఆమె ఆ ఆపిల్ విడిచిపెట్టడానికి ఇష్టంలేక వెంటనే అది చేతిలో ఇరికించుకుంది. అంతలో ఆమె చేతుల్లో ఉన్న రెండు ఆపిల్ పళ్లూ నేలమీద పడిపోయాయి. అవి గబగబా పసిరి పచ్చికలో అటు ఇటు దొర్లిపోయాయి ఆమె మళ్ళీ జాగ్రత్తగా అన్నిటినీ చేతిలో ఇరికించుకుని తలఎత్తి చూసింది.

అప్పటికప్పుడే మిలానియన్ గమ్యస్థానానికి బాగా దగ్గరగా వెళ్ళిపోయాడు.

అయినా అటలాంటా నిరుత్సాహ పడలేదు. గబగబా పరిగెత్తింది.

కాని మిలానియన్ మొట్టమొదటగా గమ్యస్థానం చేరుకున్నాడు. అటలాంటా ఒక్కక్షణంలో వెనకపడిపోయింది. మిలానియన్ గెలిచాడు.

అటలాంటా ఓడిపోయింది. కాని మిలానియన్‌పై ఆమె అనురాగంమాత్రం ఆ పరుగు పందెంలో నెగ్గింది. వెంటనే అటలాంటా మిలానియను లిద్దరికీ మహా వైభవంగా వివాహం జరిగిపోయింది. ★

న్యూఢిల్లీ లేఖ

(10-వ పేజీ తరువాయి)

ట్రంకు టెలిఫోనులో మాట్లాడవలసి ఉంటుంది. సమాధానాలు తయారుచేసేందుకు ఉద్యోగులు ఎక్కువసేపు (ఓవర్ టైమ్) పని చెయ్యాల్సి ఉంటుంది. ఇంతా చేసి సమాధానసమయంలో ప్రశ్న వేసిన సభ్యుడే గైరుహాజరవుతాడు. సమాధాన మివ్వాల్సిన మంత్రి అయిదునిమిషా లాలస్యమైతే సభలో గగ్గోలు జరుగుతుంది. ఏ కారణం చేతనైనా ఆ మంత్రి హాజరు కాకపోతే ఇహ చెప్పనక్కరలేదు.

పార్లమెంటుకు రాకపోవడం కొందరు సభ్యులకు అలవాటుగా పరిణమించింది. ముఖ్యంగా ప్రశ్నలు వేసిన సభ్యుడు హాజరు కాకపోతే అతన్ని మందలించడానికేదైనా మార్గా లాలోచించాలి ★

చేతితొడుగు

(48 వ పేజీ తరువాయి)

"నేనా? నేను ఎలుగుబంటిని. మీరు ఆరుగురు వున్నా, నేను కూడా తోడు వుండటం బాగుంటుందనుకుంటాను?"

"ఎట్లా సాధ్యం? మేం ఆరుగురమే యెంతో యిరకాటంగా కూర్చున్నాం. ఇంక, చీమ; దోమ కాని దూరేంత సందయినా లేదు."

"ఎందు కుండదు? ప్రయత్నిస్తే సరి—"

"నీ యిష్టం. కాని యిక్కడ అప్పుడే ఆరుగురం వున్నామని మరిచిపోకు."

ఎలుగుబంటి కూడా లోనికి చొరబడింది. ఇప్పటికి చేతి తొడుగులో ఏడుగురు అయ్యారు. తొడుగు ఇప్పుడో ఇంకో కాసేపటికో పగిలిపోయేట్టుంది.

ఈలోపల ఆ ముసలివాడు తన చేతితొడుగు ఎక్కడో దారిలో జారవిడుచుకున్నానని గమనించాడు. దానికోసం వెనక్కు వెళ్లి వెదికితీరాలని నిశ్చయించుకున్నాడు. నడిచినంతమేరా మళ్లీ వెనక్కు నడుస్తున్నాడు. కుక్కకూడా జోరుగా పరుగెడుతోంది. చిట్టచివరకు మంచులోపడి దొర్లుతున్న చేతితొడుగు కనపించింది. కుక్క 'భౌ, భౌ' మని మొరగసాగింది.

చేతితొడుగులోని యేడుగురు మిత్రులూ ఈ మొరుగుడుకు విపరీతంగా భయపడ్డారు. ఒక్కొక్కళ్ళే బయటకు దూకి పిక్కబలం కొద్దీ దౌడు తీశారు.

ఇంతలో ముసలివాడు అక్కడకు చేరుకుని తన చేతి తొడుగు ఎత్తితీసుకున్నాడు. అక్కడితో కథ ముగిసింది ★

[యుక్రేనియన్ జానపద కథ]

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.